www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 334
మంగళవారం 19-3-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 12.23 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పునర్వసు రా. 8.11 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ. 7.11-8.55. తె. 5.00 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 8.48-9.36, రా. 10.19 తదుపరి 11.05; అమృతఘడియలు: సా. 5.35-7.19; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 6.23
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైవేపై రయ్ రయ్!



బాపట్ల జిల్లా కొరిశపాడు-రేణంగివరం మధ్య జాతీయ రహదారిపై దిగుతున్న విమానం

బాపట్ల జిల్లాలో రహదారిపై దిగిన విమానాలు

- అత్యవసర రన్‌వేపై ట్రయల్ రన్ విజయవంతం
- గతంలో గాల్లోనే ట్రయల్.. ఇప్పుడు ల్యాండింగ్ సక్సెస్
- ట్రయల్‌రన్‌ను పర్యవేక్షించిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు

2

బొమ్మ వదలాలి!

జగన్ బొమ్మల పిచ్చికి కోడ్ దెబ్బ



పల్లీ చిక్కీ నుంచి భూమి పట్టాదాకా అన్నింటిపైనా 'జగనన్న'

- బడిగోడలపై జగన్ పెయింటింగులు
- పుస్తకాలు, పిల్లల బెల్టులనూ వదలని జగన్
- ఆస్పత్రుల్లో ఓపీ చీటీపైనా ఆయనే
- నవరత్నాల లోగో పేరుతో సొంత ఫొటో
- ధ్రువీకరణ పత్రాలన్నీ ఆయన 'పేరు'తోనే
- అవన్నీ తొలగించాల్సిందేనని ఈసీ ఆదేశం
- జగన్ ఫొటో, పేరు కనిపించకూడదు
- రేషన్ వాహనాలపై బొమ్మలు మూసేయాలి
- 'జగన్' లేకుండానే సర్టిఫికెట్లు జారీ చేయాలి
- ఈసీ ఆదేశాల మేరకు ఆయా శాఖల చర్యలు



బడి పిల్లలకు ఇచ్చే చిక్కీలపై జగన్ బొమ్మలు



సివిల్ సప్లైస్ వెబ్‌సైట్‌లో దర్శనమి స్తున్న సీఎం జగన్ ఫొటో

(అమరావతి, నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

బడి పిల్లలకు పంచిపెట్టే పల్లీల చిక్కీ కవరు నుంచి భూముల పట్టా దాకా.. ఎక్కడ పడితే అక్కడ జగన్ ఫొటోలే! బడి గోడల నుంచి భూముల సరిహద్దు రాళ్ల దాకా ఆయన బొమ్మలే! సొంత సొమ్మేదో పంచి పెడుతున్నట్లుగా ఎటు చూసినా ఆయన 'చిత్ర' విచిత్రాలే! ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో ఈ బొమ్మల పిచ్చి వదిలించుకోక తప్పడంలేదు. ఎక్కడపడితే అక్కడున్న జగన్ బొమ్మలను చెరిపేయాల్సిందేనని ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

అంతులేని బొమ్మల పిచ్చి...

భూమి పత్రాలు, పట్టాదార్ పాస్‌పుస్తకాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మొదలు ప్రభుత్వాస్పత్రుల్లో ఇచ్చే ఔట్ పేషెంట్ (ఓపీ) చీటీ దాకా ప్రతి చోటా జగన్ బొమ్మలే! కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఇకపై జారీ చేసే ధ్రువీకరణ పత్రాలు,

మిగతా 12వ పేజీలో...


ఆర్టీసీకి కొత్తగా వచ్చిన బుల్లెట్ ప్రూఫ్ బస్సు

ప్రజాధనంతో ప్రచార రథం!

- జగన్ ఎన్నికల ప్రచారానికి ఆర్టీసీ బుల్లెట్ ప్రూఫ్ బస్సులు
- 35 కోట్లతో కొన్న యాజమాన్యం.. ఒకటి బెజవాడకు రాక
- 2 రోజుల్లో ఇంకోటి కూడా.. ఇప్పటికే తాడేపల్లిలో 2 బస్సులు
- మూడేళ్లుగా వాడని వైనం.. వాటిని పక్కన పెట్టి మరీ కొత్తవి
- కోడ్ నేపథ్యంలో ఆర్టీసీ నుంచి అద్దెకు.. ప్రైవేటు బస్సులైతే భారం
- అందుకే 'చౌక బేరం' అని ఆర్టీసీ నుంచి తీసుకోవడం!

11

సీఎం ఆకాశంలో వెళుతున్నా ట్రాఫిక్ ఆపేవారు..

పీఎం సభకు భద్రత కల్పించలేరా?

- వైసీపీకి తొత్తుల్లా ఆ నలుగురు పోలీస్ అధికారులు
- డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీ, గుంటూరు రేంజి ఐజీ, పల్నాడు ఎస్పీలను ఎన్నికల విధుల నుంచి తొలగించండి
- కోడ్ వచ్చినా కొందరు పోలీసుల బరితెగింపు: ఎన్డీయే నేతలు
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనాకు ఫిర్యాదు


కృష్ణా జిల్లా సూరంపల్లిలో జరిగిన వైసీపీ ర్యాలీలో పాల్గొన్న వలంటీర్లు

వలంటీర్ల వాడకానికి కొత్త డ్రామా!

- వారికి ఇచ్చిన సర్కారీ సిమ్‌లు వెనక్కి!
- ప్రభుత్వంతో సంబంధంలేదని చెప్పే వ్యూహం
- యథేచ్ఛగా రాజకీయ ప్రచారానికి వాడకం
- ఇప్పటికే కోడ్‌కు విచ్చలవిడిగా తూట్లు
- అధికార పార్టీ అభ్యర్థులతో చెట్టపట్టాల్
- ఇంటింటి ప్రచారం.. ప్రలోభాలు
- విశాఖ నుంచి గుడివాడ వరకు ఇదే తీరు
- వలంటీర్లకు వైసీపీ ఎమ్మెల్యేల తాయిలాలు
- ఈసీ పట్టించుకోవాలని విపక్షాల డిమాండ్

వలంటీర్లపై వైసీపీ భారీ డ్రామా మొదలుపెట్టింది. 'వాళ్లకు ప్రభుత్వంతో సంబంధం లేదు' అని చెప్పేందుకు, ఎన్నికల కమిషన్ కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం జరుగుతోంది. ఎన్నికలకు రెండు నెలల ముందు వలంటీర్లను 'పక్కకు తప్పించి', పూర్తిగా రాజకీయ లబ్ధికే వాడుకుంటారని 'ఆంధ్రజ్యోతి' గతంలోనే వెల్లడించింది. ఇప్పుడు అదే జరుగుతోంది. కాకపోతే.. మరో రూపంలో!

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఎప్పుడో చెప్పింది. వారిని ఎన్నికల ప్రక్రియకు పూర్తి దూరంగా ఉంచాలని.. ఏజెంట్లుగా కూడా కూర్చోబెట్టకూడదని తేల్చి చెప్పింది. కానీ, అధికార పార్టీ వైసీపీ మాత్రం ఈ

మిగతా 2వ పేజీలో...

అప్పులతో కాదు.. సంపదతో

సంక్షేమం


మంగళగిరి మిడ్ వ్యాలీ సిటీలో 'బ్రేక్ ఫాస్ట్ విత్ లోకేశ్' కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకేశ్

- చంద్రబాబు ఇప్పటికే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు
- గద్దెనెక్కగానే అమరావతి పనులు
- జగన్ మూడు ముక్కలాటతో 30 ఏళ్ల వెనక్కి పోయిన రాష్ట్రం
- భావ ప్రకటనా స్వేచ్ఛకూ సంకెళ్లు
- టీడీపీ యువనేత నారా లోకేశ్
- మంగళగిరిలో ప్రచారం ప్రారంభం
- నియోజకవర్గంపై హామీల జల్లు

మంగళగిరి, మార్చి 18: రాష్ట్రంలో అప్పులు చేసి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం సరికాదని టీడీపీ యువ నాయకుడు నారా లోకేశ్ అన్నారు. సంపద సృష్టిస్తూ ఆ ఆదాయం ద్వారా సంక్షేమాన్ని అందించాలన్నదే టీడీపీ ధ్యేయమని చెప్పారు. సంపద సృష్టి చంద్రబాబుకే సాధ్యమన్న సంగతి జగమెరిగిన సత్యమన్నారు. గత అయిదేళ్ల కాలంలో 30 ఏళ్ల తిరోగమనంలోకి వెళ్లిపోయిన రాష్ట్రాన్ని తిరిగి ప్రగతి పథంవైపు నడిపించగల సత్తా టీడీపీకే ఉందన్నారు. మంగళగిరి

మిగతా 3వ పేజీలో...

"ఇదిగో బటన్ నొక్కుతున్నా. ఇంకాసేపట్లో మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడతాయి చూసుకోండి' ..ఈనెల 1న 'విద్యాదీవెన కోసం బటన్ నొక్కుతూ సీఎం జగన్ చెప్పిన మాటలివి. ఆయన మాటలను, నిధుల్లేని ఉత్తుత్తి నొక్కుళ్లను తల్లిదండ్రులు, విద్యార్థులు ఎంత నమ్మారో తెలియదుగానీ, కాలేజీల యాజమాన్యాలు మాత్రం... జగన్ బటన్ నొక్కిన గత ఇరవై రోజులుగా ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి పెంచేశాయి. కానీ, 90 శాతం తల్లిదండ్రుల ఖాతాల్లోకి ఇప్పటికీ డబ్బులు రాలేదు. దీంతో, 'ఉత్తుత్తి బటన్ నొక్కొద్దు.. మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు' అని బాధిత తల్లిదండ్రులు జగన్ సర్కారుపై ఆగ్రహిస్తున్నారు.

గెంటేస్తున్నారు!

రాష్ట్రంలో విద్యార్థుల చదువులు బలి

- డబ్బుల్లేకుండా 'విద్యాదీవెన'కు ఉత్తుత్తి బటన్ నొక్కుడు
- ఈనెల1న విడుదల.. ఇప్పటికి అందింది 10 శాతమే
- 90 శాతం మందికి ఇంకా ఫీజులు అందని వైనం
- ఫీజులు కట్టాలంటూ కాలేజీల నుంచి ఒత్తిడి
- పలుచోట్ల ఇంటికి పంపుతున్న దైన్య పరిస్థితి
- క్లాసులకు రావొద్దని గుంటూరులో ఓ కాలేజీ మెసేజ్
- టీడీపీ హయాంలో నేరుగా కాలేజీలకు నిధులు
- 'కాలేజీ- ప్రభుత్వం' వ్యవహారంగా ఫీజులు
- 'తల్లిదండ్రులు-కాలేజీ'గా మార్చడంతోనే తిప్పలు
- డబ్బు వస్తుందన్న నమ్మకం కోల్పోయిన కాలేజీలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల జీవితాలతో జగన్ సర్కారు ఆడుకుంటోంది. సకాలంలో ఫీజులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోంది. ఉత్తుత్తి బటన్ నొక్కుళ్లతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును గందరగోళంలో పడేస్తోంది. ఎప్పుడో అక్టోబరులో ఇవ్వాల్సిన ఫీజులకు సీఎం జగన్ ఈ నెల ఒకటో తేదీన బటన్ నొక్కారు. ఆయన బటన్ నొక్కి 20 రోజులు

మిగతా 12వ పేజీలో...



2

గ్రూప్-1 మెయిన్స్ రద్దును

సవాల్ చేస్తూ అప్పీల్

అత్యవసర విచారణకు ఏపీపీఎస్సీ అభ్యర్థన

నేడు విచారించేందుకు ధర్మాసనం అంగీకారం



2

పోటీకి తమిళిసై

తమిళనాడు నుంచి లోక్‌సభ బరిలోకి

టీ-గవర్నర్ పదవికి రాజీనామా..

బాండ్ల నంబర్లూ చెప్పాల్సిందే



అరకొర సమాచారం చెప్తే కుదరదు.. ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు ఫైర్

- ఎల్లుండి సాయంత్రం ఐదింటిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
- చట్టం చేతులు చాలా పొడవు అని వ్యాఖ్య
- యూనిక్ నంబర్ల వెల్లడిపై తీర్పు వాయిదా వేయాలని అసోచాం, ఫిక్కీ, సీఐఐ విజ్ఞప్తి
- వారి అభ్యర్థనను తోసిపుచ్చిన ధర్మాసనం
- ప్రధానమంత్రి హఫ్తా వసూలీ యోజన
- ఎన్నికల బాండ్లపై కాంగ్రెస్ ధ్వజం
- ఐటీ, ఈడీ దాడుల తర్వాత బాండ్లు కొన్న తెలుగు కంపెనీల పేర్లు చెప్పిన జైరామ్

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల వ్యవహారంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తీరును సుప్రీంకోర్టు మరోసారి తప్పుబట్టింది. బాండ్లకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించి తీరాల్సిందేనని.. ఎంపిక చేసిన అరకొర సమాచారం ఇస్తే కుదరదని సోమవారం తేల్చిచెప్పింది. ఈసారి ఇచ్చే వివరాల్లో.. బాండ్లను కొన్నవారికి, వాటిని అందుకున్న రాజకీయ పార్టీలకు మధ్య సంబంధాన్ని బయటపెట్టే యూనిక్ నంబర్లు ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల వివరాలు ఇవ్వడంలో ఎస్‌బీఐ జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), సీపీఎం, సిటిజన్ రైట్స్ ట్రస్ట్(సీఆర్టీ)లు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ కలిపి.. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. ఏ దాత ఏ పార్టీకి ఎంత ఇచ్చారనే విషయాన్ని తెలియజేసే యూనిక్ బాండ్ నంబర్లతో సహా అన్ని వివరాలనూ ఎస్‌బీఐ ఈసీకి

మిగతా 2వ పేజీలో...


కడప బరిలో షర్మిల!



- వివేకా హత్య కేసు నిందితుడు వైఎస్ అవినాశ్‌రెడ్డిపై పోటీ
- రాహుల్ సూచనకు ఓకే చెప్పిన పీసీసీ సారథి?
- ఒకట్రెండు రోజుల్లో ప్రకటన

11

20 రోజులు.. 60 స్థానాలు



- 22 నుంచి చంద్రబాబు ప్రచార భేరి
- రాష్ట్రవ్యాప్త పర్యటనలకు శ్రీకారం
- రోజుకు మూడు నియోజకవర్గాల్లో..

11

బెంగాల్ డీజీపీపై వేటు

- పోలీస్ బాస్‌ను తప్పించిన ఈసీ.. వెనువెంటనే కొత్త డీజీపీ నియామకం
- 6 రాష్ట్రాల హోం సెక్రటరీల మార్పు.. వీటిల్లో 3 బీజేపీ పాలిత రాష్ట్రాలు
- వారెవరికీ ఎన్నికల విధులు అప్పగించొద్దు.. సీఎస్‌లకు ఈసీ ఆదేశాలు
- బృహన్‌ముంబై కార్పొరేషన్ బదిలీలపై సీరియస్ హెచ్చరికలు



న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ.. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) పలువురు బ్యూరోక్రాట్లపై బదిలీ వేటు వేసింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల తరఫున ఎన్నికలను ప్రభావితం చేసేందుకు అవకాశాలున్న బ్యూరోక్రాట్లపై ఈ చర్యలు తీసుకుంది. అధికార పార్టీలకు విధేయులుగా ఉండేవారు.. ఒకటి కంటే ఎక్కువ శాఖలకు బాధ్యత వహిస్తున్న వారిని గుర్తించి, వారి జాబితాను పంపుతూ.. వెంటనే బదిలీ చేయాలంటూ ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఇలా బదిలీ అయిన అధికారులకు ఎన్నికల విధులతో సంబంధం లేని పోస్టింగ్‌లు ఇవ్వాలని సూచించింది. ఈ జాబితాలో పశ్చిమ బెంగాల్ డీజీపీ రాజీవ్‌కుమార్ కూడా ఉన్నారు. ఆయన పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీకి కుడిభుజంగా పనిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. 2016 అసెంబ్లీ ఎన్నికలు, 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పశ్చిమబెంగాల్ డీజీపీని బదిలీ చేయడం గమనార్హం..! రాజీవ్‌కుమార్‌పై ఈసీ బదిలీ వేటు వేయడంతో.. ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌ల పేర్లను ఈసీకి పంపారు. వారిలోంచి వివేక్ సాహాను ఈసీ ఎంపిక చేయగా.. వెనువెంటనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే.. 2021లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా

మిగతా 2వ పేజీలో...



రన్‌వేకి దగ్గరగా వచ్చిన సుఖోయ్ యుద్ధ విమానం

హైవేపై రయ్ రయ్..!

- కొరిశపాడు-రేణంగివరం రహదారిపై దిగిన విమానాలు
- అత్యవసర రన్‌వేపై ట్రయల్ రన్ విజయవంతం
- గతంలో గాల్లోనే ట్రయల్.. ప్రస్తుతం ల్యాండింగ్ సక్సెస్
- ట్రయల్‌రన్‌ను పర్యవేక్షించిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రయ్ రయ్ మంటూ వాయుసేన విమానాల విన్యాసాలు... 4.1 కిలోమీటర్ల పొడవుగల రన్‌వేపై విమానాలు ఒకదాని వెంట ఒకటి ల్యాండింగ్.. అత్యంత అరుదుగా కనిపించే ఈ దృశ్యానికి బాపట్ల జిల్లాలోని కొరిశపాడు-రేణంగివరం మధ్య హైవేపై నిర్మించిన ఎమర్జెన్సీ రన్‌వే (ఎయిర్ స్ట్రిప్) వేదికైంది. నూతనంగా నిర్మించిన ఈ అత్యవసర రన్‌వేను ఎయిర్‌ఫోర్స్, హైవే అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ అధికారులు దీనిపై విమానాల ల్యాండింగ్‌కు సంబంధించి ట్రయల్ రన్ నిర్వహించారు. విమానాలు రోడ్డుపై దిగుతున్నాయని తెలిసి.. వాటిని తిలకించడానికి స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలో 528 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతీయ రహదారి-16పై ఉదయం తొమ్మిది గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సడలించి వాహనాలను అనుమతించారు.

అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో..

విపత్తుల సమయంలో ఆపన్నులను ఆదుకోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో విమానాల ల్యాండింగ్‌కు అనువుగా ఉండేందుకు దేశవ్యాప్తంగా కొన్నిచోట్ల హైవేలపై అత్యవసర రన్‌వేలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా బాపట్ల జిల్లాలో కొరిశపాడు-రేణంగివరం మధ్య జాతీయ రహదారిపై 4.1 కి.మీ. పొడవు, 33 మీటర్ల వెడల్పుతో రూ.79 కోట్ల వ్యయంతో ఈ రన్‌వేను తీర్చిదిద్దారు.

ట్రయల్ రన్‌లో పాల్గొన్న విమానాలివే..

సోమవారం ఉదయం నాలుగు జెట్ విమానాలు తొలుత రన్‌వేపై గాలిలోనే చక్కర్లు కొట్టి వెళ్లిపోగా.. ఆ తర్వాత సుఖోయ్-30, హాక్ ఎయిర్ క్రాఫ్టులు రన్‌వేపై నుంచి స్వల్ప ఎత్తులో విన్యాసాలు చేపట్టాయి. ఏఎన్-32, డోర్నియర్, సరుకు రవాణా విమానాలు పూర్తిగా రన్‌వేపై ల్యాండయ్యాయి.

గ్రూప్-1 రద్దును సవాల్ చేస్తూ హైకోర్టుకు..

- అత్యవసర విచారణకు ఏపీపీఎస్సీ అభ్యర్థన

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేసి, తాజాగా పరీక్ష నిర్వహించాలని ఇటీవల సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ కార్యదర్శి హైకోర్టు ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. వీటిపై అత్యవసరంగా (లంచ్ మోషన్) విచారణ జరపాలని ఏపీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.ఎస్ ప్రసాద్ ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జవాబు పత్రాలను మళ్లీమళ్లీ మూల్యాంకనం చేయడం ఏపీపీఎస్సీ నిబంధన 3(9)కి విరుద్ధంగా ఉందని సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్నారని, డిజిటల్ విధానంలో మూల్యాంకనం చేయడంపై హైకోర్టు అభ్యంతరం చెప్పడంతో మ్యాన్యువల్ విధానంలో జవాబుపత్రాలు దిద్దామని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో సింగిల్ జడ్జి పొరపాటు పడ్డారన్నారు. 2021 డిసెంబరు - 2022 ఫిబ్రవరి మధ్య మొదటిసారి మాన్యువల్ మూల్యాంకనం జరిగిందనే ఆరోపణలను, ఆధారాలను పరిగణనలోకి తీసుకొని తేల్చాల్సిన అంశమని, ఈ విషయాన్ని రిట్ పిటిషన్‌లో తేల్చలేరని చెప్పారు. మ్యాన్యువల్ విధానంలో ఒకసారే జరిగిందని తాము సమర్పించిన వివరాలను పరిగణనలోకి తీసుకోవడంలో సింగిల్ జడ్జి విఫలమయ్యారన్నారు. గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన 169 మందిలో కొందరే హైకోర్టులో వాదనలు వినిపించారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందన్నారు. డిజిటల్ మూల్యాంకనంలో పిటిషనర్లు ఎంపికయ్యారని, దాన్ని రద్దు చేసి మాన్యువల్‌గా దిద్దాలని న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాలను వారు సవాల్ చేయలేదని చెప్పారు. మాన్యువల్ మూల్యాంకనంలో ఎప్పుడైతే వారు అనర్హులయ్యారో ప్రక్రియను ప్రశ్నించడం మొదలుపెట్టారన్నారు. వాటిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జీ.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం అప్పీల్‌పై మంగళవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

అబద్ధాలే కాంగ్రెస్ అజెండా

- పచ్చి అబద్ధాలతోనే కర్ణాటకలో అధికారంలోకి: మోదీ



బెంగళూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సమర్థ భారత నిర్మాణమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. కాంగ్రెస్‌కు అభివృద్ధి లక్ష్యం లేకపోగా అబద్ధాలే అజెండాగా మారాయని విమర్శించారు. కర్ణాటకలోని శివమొగ్గ, తమిళనాడులోని కోయంబత్తూరుల్లో సోమవారం భారీ రోడ్‌షోలను ప్రధాని నిర్వహించారు. శివమొగ్గలో నిర్వహించిన బహిరంగసభలో మోదీ మాట్లాడుతూ కర్ణాటకలో నలుగురు ముఖ్యమంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. "ఒకరు ప్రస్తుత సీఎం, మరొకరు భావి సీఎం, ఇంకొకరు సూపర్ సీఎం, మరొకరు షాడో సీఎం, వీరితోపాటు ఢిల్లీలో కలెక్షన్ సీఎం కూడా ఉన్నారు" అంటూ పరోక్షంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. పచ్చి అబద్ధాల ప్రచారంతోనే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే ధనాన్ని అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాల్సి ఉండగా, ఉచిత గ్యారెంటీ పథకాలకు ధారపోస్తున్నారని విమర్శించారు.

బాండ్ల నంబర్లూ చెప్పాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాల్సిందేనని పేర్కొంది. ఈమేరకు ఏ వివరాన్నీ దాచకుండా, తమ వద్ద ఉన్న మొత్తం సమాచారాన్ని వెల్లడించినట్టుగా పేర్కొంటూ గురువారం (మార్చి 21) సాయంత్రం 5 గంటల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ చైర్మన్, ఎండీకి ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. 2018 మార్చి 1 నుంచి 2019 ఏప్రిల్ 11 దాకా జారీ అయిన బాండ్ల వివరాలను కూడా సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి ధర్మాసనం తిరస్కరించింది. అలాగే.. ఎన్నికల బాండ్ల వివరాలు బయటపెట్టాలంటూ తాము ఇచ్చిన తీర్పుపై సుమోటోగా సమీక్ష జరపాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాలా చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ప్రచారం కోసం చేసే ఇలాంటి పనులను తాము అనుమతించబోమని జస్టిస్ చంద్రచూడ్ తేల్చిచెప్పారు. కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా.. ఆ లేఖ పూర్తిగా అవాంఛనీయమని ఆయన పేర్కొన్నారు. అయితే.. బాండ్ల వివరాలు కోరుతూ కోర్టును ఆశ్రయించిన వారు మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ ఉద్దేశపూర్వకంగా కోర్టును ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారని.. బాండ్లకు సంబంధించి అంకెలను వక్రీకరించి చూపుతున్నారని ఆయన కోర్టుకు తెలిపారు. వాటిని నియంత్రించాలని కోరారు. దీనికి సీజేఐ.. ఒక వ్యవస్థగా చట్టం చేతులు చాలా పొడవైనవేనని.. కానీ, న్యాయమూర్తులుగా తాము రాజ్యాంగం ప్రకారం ప్రకారం తీర్పులు ఇస్తామని, రూల్ ఆఫ్ లా ప్రకారమే నడుచుకుంటామని.. తాము ఇచ్చిన ఆదేశాల అమలు జరుగుతోందా లేదా అన్నదే తమకు ముఖ్యమని.. ఒకసారి తీర్పు ఇచ్చాక అది ప్రజల సొత్తు అని, దానిపై చర్చలు జరపవచ్చన్నారు. తాము కూడా సోషల్ మీడియాలో కామెంట్లకు అతీతులం కాదన్నారు.



అలా ఎలా అడుగుతారు?

ఎన్నికల బాండ్ల వివరాలను బయటపెట్టాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వాయిదావేయాలని కోరుతూ అసోచాం, ఫిక్కీ, సీఐఐ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీం ధర్మాసనం తోసిపుచ్చింది. వాటి తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ.. బాండ్ల పథకం ప్రవేశపెట్టినప్పుడు దాతల గోప్యతను కాపాడతామని చెప్పారని, అలాంటిది ఇప్పుడు ఆ వివరాలు ఎలా బయటపెడతారని ప్రశ్నించారు. దీనికి ధర్మాసనం.. ఆ వివరాలను బయటపెట్టాలంటూ 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు రాజకీయ పార్టీలకు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. ఆ విషయం అందరికీ తెలుసని, దాతలకు కూడా తెలుసని.. తెలిసే ఇచ్చారని పేర్కొంది. అందుకే తాము కూడా ఆ రోజు నుంచీ పార్టీలకు వచ్చిన విరాళాలకు సంబంధించి పూర్తివివరాలు ఇవ్వాలని ఆదేశించాం తప్ప.. అంతకు ముందు జారీ అయిన బాండ్ల వివరాలను అడగలేదని గుర్తుచేసింది.

అందుకే ఇవ్వలేదు..: ఎన్నికల బాండ్ల వివరాలను ఎందుకు బయటపెట్టలేదనే ప్రశ్నకు.. ఒక్కో పార్టీ ఒక్కోరకంగా వివరణ ఇచ్చాయి. కొన్ని పార్టీలు ఆయా బాండ్లు తమకు కొరియర్‌లో ఊరూ పేరూ లేకుండా వచ్చాయని, వాటిని సొమ్ము చేసుకున్నాం తప్ప వాటిని పంపిందెవరో తమకు తెలియదని చెప్పగా.. మరికొన్ని పార్టీలు చట్టంలో ఉన్న నిబంధనలను అడ్డుపెట్టుకుని ఆ వివరాలను సమర్పించలేదు. ప్రజాప్రాతినిధ్యచట్టం నిబంధనల ప్రకారం తాము డోనర్ల వివరాలు వెల్లడించట్లేదని బీజేపీ పేర్కొంది.

పీఎం వసూలీ యోజన..

ఎన్నికల బాండ్ల పథకాన్ని కాంగ్రెస్ పార్టీ.. 'ప్రధాన మంత్రి హఫ్తా వసూలీ యోజన'గా అభివర్ణించింది. అంటే ప్రధానమంత్రి మామూళ్ల వసూలు పథకం అని అర్థం. సీబీఐ, ఈడీ, ఐటీ దర్యాప్తును ఎదుర్కొంటున్న 21 సంస్థలు.. బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో విరాళాలు సమర్పించాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరబిందో ఫార్మా డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డిని మనీలాండరింగ్ కేసులో 2022 నవంబరు 10న ఈడీ అరెస్టు చేస్తే.. నవంబరు 15న ఆ సంస్థ రూ.5 కోట్ల విలువ చేసే బాండ్లు కొనుగోలు చేసిందని వెల్లడించారు. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థపై 2023 డిసెంబరు 20న ఐటీ దాడులు జరిగితే.. 2024 జనవరి 11న ఆ సంస్థ రూ.40 కోట్ల విలువైన బాండ్లు కొన్నట్టు తెలిపారు. 2023 నవంబరులో రెడ్డీస్‌ల్యాబ్స్‌కు చెందిన ఉద్యోగిపై ఐటీ దాడులు జరిగాయని.. ఆ తర్వాత ఆ కంపెనీ రూ.62 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసిందని వెల్లడించారు.



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	40.0	26.0
కర్నూలు	39.8	26.4
ఏలూరు	38.0	22.0
తిరుపతి	37.7	24.3
విజయవాడ	35.4	23.2
ఒంగోలు	34.3	25.0

మొబైల్ నంబర్ పోర్టింగ్‌కు కొత్త నిబంధన

న్యూఢిల్లీ, మార్చి 18: మొబైల్ నంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ).. మన టెలికం ఆపరేటర్ అందిస్తున్న సేవలు నచ్చకపోతే వేరే ఆపరేటర్‌కు మారే వీలు కల్పించే విధానం ఇది. అయితే.. కొందరు సైబర్ క్రిమినల్స్ సిమ్ స్వాపింగ్ మోసాలతో దీన్ని దుర్వినియోగం చేస్తున్నారు. దాన్ని అరికట్టేందుకుగాను ట్రాయ్.. ఎంఎన్‌పీ నిబంధనలకు ఓ సవరణ చేసింది. అదేంటంటే.. సిమ్ స్వాప్ చేసిన వారం రోజులలోపు మీరు మీ మొబైల్ నంబర్‌ను వేరే ఆపరేటర్‌కు మార్చుకోలేరు. సిమ్ స్వాప్ అంటే.. ఉదాహరణకు మీ వద్ద పాతకాలం మొబైల్ ఉందనుకోండి. అందులో మామూలు పెద్ద సిమ్ కార్డు పడుతుంది. ఆ ఫోన్ పాడైపోవడంతో కొత్త ఫోన్ కొన్నారు. దాంట్లో మైక్రో సిమ్ కార్డు మాత్రమే పడుతుంది. అప్పుడు మీరు మీ ఆపరేటర్‌ను అడిగితే..మైక్రో సిమ్ ఇస్తారు. దీన్నే సిమ్ స్వాప్ అంటారు. అయితే, సైబర్ నేరగాళ్లు మన ఫోన్‌లో సమాచారాన్నంతా దొంగిలించి.. దాని ఆధారంగా మన వివరాలతో మన నంబర్‌నే వాళ్లు సిమ్ స్వాప్ ద్వారా పొందితే? అప్పుడు మనకు రావాల్సిన ఓటీపీలన్నీ వారికే వెళ్లిపోతాయి. మన బ్యాంకు ఖాతాలు ఖాళీ అయిపోతాయి. ఈ ముప్పును తప్పించడానికే ట్రాయ్ కొత్త నిబంధనను తీసుకొచ్చింది. ఇది జూలై 1 నుంచి అమల్లోకి రానుంది.

ఎన్నికల్లో పోటీకి తమిళి'సై'

- తమిళనాడు నుంచి లోక్‌సభ బరిలోకి



హైదరాబాద్/చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. ఆ పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ గవర్నర్ పదవితో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవిని కూడా వదులుకున్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సోమవారం పంపించారు. అనంతరం చెన్నై బయలుదేరి వెళ్లారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రెండో గవర్నర్‌గా, తొలి మహిళా గవర్నర్‌గా తమిళిసై బాధ్యతలు నిర్వర్తించారు. 2019 సెప్టెంబరు 8న తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె.. 2021 ఫిబ్రవరిలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమిళిసై పోటీ చేయనున్నారు. ఈ విషయమై గతంలోనే ప్రచారం జరిగినా.. పలు మార్లు ఆమె తోసిపుచ్చారు. అయితే, తాజాగా లోక్‌సభ టికెట్‌ను బీజేపీ నాయకత్వం ఖరారు చేయడంతో గవర్నర్ పదవులకు ఆమె రాజీనామా చేసినట్లు తెలిసింది. సౌత్ చెన్నై లేదా తూత్తుకుడి నుంచి ఆమె పోటీ చేస్తారని లేదంటే పుదుచ్చేరి నుంచైనా బరిలోకి దిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. డీఎంకే ఎంపీ కనిమొళి ప్రాతినిధ్యం వహిస్తున్న తూత్తుకుడి నుంచే తమిళిసై పోటీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలోనే తమిళిసై సౌందరరాజన్ విద్యార్థి సంఘం నాయకురాలిగా పని చేశారు. బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై పార్టీలో చేరారు. 1999 నుంచి 2013 వరకు పార్టీలో అనేక పదవీ బాధ్యతలు నిర్వర్తించారు, 2014 నుంచి బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా కొనసాగారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తమిళిసై.. రెండుసార్లు లోక్‌సభ సభ్యురాలిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత తెలంగాణ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి.. ఇప్పుడు మరోసారి లోక్‌సభ బరిలో తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం హైదరాబాద్‌లో బస చేసిన ప్రధాని మోదీ.. లోక్‌సభ టికెట్‌పై స్పష్టత ఇవ్వడంతో గవర్నర్ పదవికి ఆమె రాజీనామా చేసినట్లు సమాచారం. తమిళిసై రాజీనామాకు ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోదం లభించనుంది. కాగా, ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రస్తుతానికి కొత్త గవర్నర్‌ను నియమించే అవకాశం లేదు. ఎన్నికలు ముగిసే దాకా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కే తెలంగాణతోపాటు పుదుచ్చేరి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

మాటల యుద్ధంలో 'శక్తి'

- రాహుల్ ప్రసంగంపై రాజకీయ దుమారం
- 'అధికారం' అన్న భావంలో పద ప్రయోగం



న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. 'శక్తి' అన్న విషయమై చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. 'అధికారం' అన్న అర్థం వచ్చే రీతిలో 'శక్తి' అన్న పదాన్ని రాహుల్ ఉపయోగించగా, ఇది దుర్గాదేవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్య అంటూ బీజేపీ విమర్శలు సంధించింది. సాక్షాత్తూ ప్రధాని మోదీయే దీనిపై స్పందించడంతో విమర్శలు, ప్రతివిమర్శలు ప్రారంభమయ్యాయి. బీజేపీ విమర్శలకు ప్రతిస్పందించిన కాంగ్రెస్.. ప్రస్తుత ఎన్నికలు అసుర శక్తి అయిన బీజేపీ, దైవిక శక్తిని అయిన ఇండియా కూటమి మధ్య జరిగే పోరాటమని పేర్కొంది. భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా ఆదివారం ముంబైలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తూ ఈడీ, సీబీఐ, ఐటీ, ఈవీఎంలు లేకుండా మోదీ ఎన్నికల వెళ్లలేరని, వాటిని దుర్వినియోగం చేస్తున్న ఆ శక్తి(అధికారానికి)కి వ్యతిరేకంగా పోరాడతామని అన్నారు. "మోదీపై చేస్తున్న పోరాటం ఆయనపై వ్యక్తిగతంగా చేస్తున్నది కాదు. ఎందుకంటే ఆయన ఓ 'శక్తి' (అధికారం)కి ముసుగు మాత్రమే' అని విమర్శించారు. అయితే 'శక్తి' అన్న పదం దుర్గాదేవికి సంబంధించినది కావడంతో బీజేపీ ఆ కోణంలో విమర్శలు ప్రారంభించింది. సోమవారం జగిత్యాలలో మోదీ మాట్లాడుతూ.. "వారు 'శక్తి'పై పోరాటం చేస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలోనే పెట్టారు. నాకైతే ప్రతి తల్లి, చెల్లి శక్తి స్వరూపులే. నేను శక్తిని ఆరాధిస్తాను. నేను భారత మాత పూజరిని" అని అన్నారు. శక్తిని నాశనం చేయాలనుకునేవారికి, శక్తి ఆరాధకులకు మధ్య పోరాటం జరుగుతోందని, శక్తి స్వరూపిణులైన మహిళలందరూ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

వక్రీకరించడం మోదీకి అలవాటే

ప్రధాని వ్యాఖ్యలపై రాహుల్ ట్వీట్ చేస్తూ తన మాటలను వక్రీకరిచడానికి మోదీ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుంటారని చెప్పారు. తాను శక్తి గురించి చేసిన వ్యాఖ్యలు మోదీకి ఉన్న అధికారం గురించేనని స్పష్టం చేశారు. మోదీ అధికారానికి దేశ మీడియా రాత్రింబవళ్లు సెల్యూట్ చేస్తూ సత్యాన్ని అణచివేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందిస్తూ పెడర్థాలు తీసి, ప్రజల దృష్టిని మళ్లించడంలో మోదీ మాస్టర్ అని విమర్శించారు. "రాహుల్ గాంధీ 'అసుర శక్తి'పై దాడి ప్రారంభించగానే కంగారు పడ్డ ప్రధాని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మహిళా రెజ్లర్లను బ్రిజ్‌భూషణ్ వేధించినప్పుడు ప్రధాని ఏ 'శక్తి'ని పూజించారు? కథువా, ఉన్నావ్, హత్రాస్ రేపిస్టులకు మద్దతుగా బీజేపీ శ్రేణులు ఊరేగింపులు జరిపినప్పుడు శక్తిని పూజించాలని మోదీకి గుర్తుకు రాలేదా" అని పవన్ ప్రశ్నించారు.

బెంగాల్ డీజీపీపై ఈసీ వేటు

(మొదటి పేజీ తరువాయి)



వివేక్ సాహాపైనా ఈసీ వేటు వేయడం గమనార్హం..! ఆరు రాష్ట్రాల– గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల హోంశాఖ కార్యదర్శులను కూడా బదిలీ చేయాలని ఆయా రాష్ట్రాల సీఎస్‌లను ఆదేశించింది. వీటిల్లో గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ బీజేపీ పాలిత ప్రాంతాలు కావడం గమనార్హం..! వీరంతా హోంశాఖ కార్యదర్శులుగా ఉంటూనే.. ఇతర విభాగాల బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నట్లు గుర్తించినట్లు ఈసీఐ పేర్కొంది. ఇలాంటి కారణాలతోనే మిజోరం, హిమాచల్‌ప్రదేశ్ జీఏడీ కార్యదర్శులను కూడా బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆయా స్థానాల్లో కొత్తగా నియమించాలనుకుంటున్న అధికారుల జాబితా(మూడేసి మంది పేర్లు) తమకు పంపాలని, తాము నియామకానికి అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. ఆ మేరకు సోమవారం రాత్రికల్లా నియామకాలు పూర్తయినట్లు తెలుస్తోంది. కాగా.. పశ్చిమబెంగాల్ డీజీపీని ఈసీ బదిలీ చేయడంపై తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) సీరియస్‌గా స్పందించింది. ఈసీని అడ్డుపెట్టుకుని, రాజకీయాలు చేయడం బీజేపీ నైజమని టీఎంసీ ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ ఆరోపించారు.

మహారాష్ట్ర సీఎస్‌పై సీరియస్!

బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్(బీఎంసీ)లో కమిషనర్ ఇక్బాల్‌సింగ్ సహా.. ఓ అదనపు కమిషనర్లు, ఇంకో డిప్యూటీ కమిషనర్‌ను తొలగించాలని ఈసీఐ ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది. అయితే.. బీఎంసీ విషయంలో మూడేళ్ల నిబంధన నుంచి మినహాయింపునివ్వాలని, కొవిడ్ సమయంలో ఇక్బాల్‌సింగ్ విశేష సేవలందించారని పేర్కొంటూ ఈసీఐకి సీఎస్ లేఖ రాశారు. దీనిపై ఈసీఐ సీరియస్ అయినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం 6 గంటల్లోగా బదిలీలు జరపాలంటూ మరోమారు ఆదేశించింది. అంతే కాదు.. ఇతర మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కూడా మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న అధికారులను కూడా బదిలీ చేయాలని సూచించింది. కాగా.. మహారాష్ట్రలో బీజేపీ మద్దతున్న శివసేన(శిందే వర్గం) అధికారంలో ఉండడం గమనార్హం..! ఈసీ ఆదేశాలు వెలువడిన వెంటనే ఇక్బాల్‌సింగ్‌ను తొలగించిన మహారాష్ట్ర సర్కారు.. ముగ్గురు సీనియర్ల పేర్లను ఎన్నికల కమిషన్‌కు పంపింది.

ఏపీపైనా ఫోకస్..!

సొంత జిల్లాల్లో.. ఒకే స్థానంలో మూడేళ్లకుపైగా పని చేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఇప్పటికే ఈసీఐ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే..! ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలువురు ఉన్నతాధికారులపై కొరడా ఝుళిపించేందుకు ఈసీ సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇంతకు ముందే.. ప్రతిపక్షాలు జగన్ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్న పలువురు ఉన్నతాధికారుల జాబితాను ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన విషయం తెలిసిందే.

వలంటీర్ల వాడకానికి కొత్త డ్రామా!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో సొంత నేతలు, కార్యకర్తలకంటే వలంటీర్లనే ఎక్కువగా నమ్ముకుంది. వారి 'సేవలను' రాజకీయంగా వాడుకునేందుకు భారీ వ్యూహం రచించింది. దీని ప్రకారం.. వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన సిమ్ కార్డులను అధికారులు వెనక్కి తీసుకుంటున్నారు. ఇకపై మరింత విచ్చలవిడిగా వలంటీర్లు వైసీపీ సేవ చేసేలా రంగం రెడీ చేశారు. ఎవరైనా ప్రశ్నించినా, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా.. "వాళ్లు ఇప్పుడు ప్రభుత్వ విధుల్లో లేరు. సిమ్ కార్డులు ఇచ్చేశారు" అని తప్పించుకోవచ్చన్నది వైసీపీ వ్యూహం.

యథేచ్ఛగా ఉల్లంఘనలు

ఎన్నికల సంఘం ఆదేశాలున్నా పలు జిల్లాల్లో వలంటీర్లు వైసీపీ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. శనివారం వైసీపీ అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో ఆదివారం నుంచే వలంటీర్లను అధికార పార్టీ నేతలు రంగంలోకి దించేశారు. వలంటీర్లకు ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న జీతంతో పాటు తాము సొంతంగా అంతకు రెట్టింపు నజరానాలు ఇస్తామని భరోసా ఇస్తున్నారు. పలు చోట్ల కుక్కర్లు, మరికొన్ని చోట్ల సెల్‌ఫోన్లు కూడా పంపిణీ చేస్తున్నారు.

అభ్యర్థులకు ఓటర్ల సమాచారం

రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అభ్యర్థుల తరఫున ప్రచార బాధ్యతలు భుజాన వేసుకున్న వలంటీర్లు తొలుత తమ పరిధిలోని కుటుంబాలకు చెందిన ఓటర్ల సమాచారాన్ని వైసీపీ అభ్యర్థులకు చేరవేస్తున్నట్లు తెలిసింది. తమ పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? వారిలో వైసీపీకి అనుకూలంగా ఉన్నది ఎవరు? వ్యతిరేకంగా ఉన్నది ఎవరు? అనే కీలక సమాచారాన్ని వలంటీర్లు వైసీపీ నేతలకు అందిస్తున్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్న కుటుంబాలకు ఎలాంటి హామీ ఇస్తే వారు తమవైపు మొగ్గు చూపుతారనే విషయాలను కూడా అభ్యర్థులు వలంటీర్ల ద్వారా ఆరా తీస్తున్నారు. వలంటీర్లు అందరూ వైసీపీ కార్యకర్తలేనని గతంలోనే సీఎం జగన్ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ప్రభుత్వం పట్ల వ్యతిరేకంగా ఉన్న కొందరిని తొలగించి వారి స్థానంలో వైసీపీ కార్యకర్తలను నియమించుకున్నారు. క్షేత్రస్థాయిలో వీరిని మానిటర్ చేసేందుకు ఒక ప్రైవేట్ యంత్రాంగాన్ని జగన్ ప్రభుత్వం సిద్ధం చేసుకుంది. దీంతో రానున్న రోజుల్లో ఈ యంత్రాంగం చెప్పినట్టు వలంటీర్లు మరింత రెచ్చిపోవడం ఖాయమని ప్రతిపక్షాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారులు దృష్టి పెట్టాలని విపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో..

సోమవారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో పాతపట్నం వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి తరఫున ఆమె కుమారుడు శ్రావణకుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఒక వలంటీరు పాల్గొని వైసీపీకి ఓటేయాలని సూచించారు.

అనకాపల్లి జిల్లాలో..

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామ సచివాలయ పరిధిలోని ఒకటి, రెండు వార్డుల్లో గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న గొల్లు ఇంద్ర, గొంప నాగమణి, రొంగల రాధ, సింగంపల్లి దుర్గా భవానీలు సంక్షేమ పథకాల పట్టికను తీసుకుని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం ప్రారంభించారు. వైసీపీకి ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను పంచారు. దీంతో గ్రామస్థులు నిలదీశారు. అయితే, వలంటీర్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. జగన్‌ను గెలిపించుకునేందుకు తాము ప్రచారం చేస్తామని, తమ ఇష్టమని బదులిచ్చారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌కు టీడీపీ నాయకుడు గొలుకొండ శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. అలాగే, నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు నాయకులు శ్రీకాంత్, ఆదపురెడ్డి గోపాలకృష్ణతో పాటు మరో ముగ్గురు నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో రత్నకుమారి కొత్తమల్లంపేట సచివాలయానికి వెళ్లి వలంటీర్లను పిలిపించి విచారణ చేపట్టారు.

గన్నవరంలో..

ఈ నెల 16న ఎన్నికల షెడ్యూలును కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే, అదే రోజు సాయంత్రం కృష్ణా జిల్లాలోని గన్నవరం నియోజకవర్గంలో ఉన్న సూరంపల్లిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో వలంటీర్లు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించి వీడియోలు ఆలస్యంగా వెలుగు చూశాయి. వలంటీర్లు ఎ.వంశీకృష్ణ, నాగార్జునలు ఇంటింటికీ తిరిగి వైసీపీకి ఓట్లు వేయాలని అధికార పార్టీ అభ్యర్థులతో కలిసి ప్రచారం చేశారు. ర్యాలీలో జై జగన్, జై వల్లభనేని వంశీ నినాదాలతో హోరెత్తించారు.



అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కొత్తమల్లంపేటలో వైసీపీకి ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్న వలంటీర్లు

గుడివాడలో..

గుడివాడ పట్టణంలోని 24వ వార్డుకు చెందిన వలంటీర్లు భారతి, షకీలా... వైసీపీ నేత పసలాది శేఖర్‌బాబుతో ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని వివిధ డివిజన్లలో వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేశారు.

వైసీపీ ప్రచారంలో డీసీసీబీ ఉద్యోగి

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని కృష్ణవరం గ్రామంలో వైసీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి, ఆయన కోడలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కాకినాడ డీసీసీబీ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఉద్యోగి, కృష్ణవరం గ్రామానికి చెందిన గొరకపూడి గోపీనాథ్ పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకీ మద్దతు ఇవ్వకూడదు. ప్రచారంలోనూ పాల్గొన కూడదు. అయినప్పటికీ గోపీనాథ్ ప్రచారంలో పాల్గొన్నారు.

వీఆర్వో వైసీపీ పాటల ప్రచారం: పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల-1 వీఆర్వో, బీఎల్‌వో వింజమూరి కోటేశ్వరరావుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ షోకాజ్ నోటీసులిచ్చారు. కోడ్‌కు విరుద్ధంగా సదరు వీఆర్వో, బీఎల్‌వో కోటేశ్వరరావు తన వాట్సాప్ డీపీగా సీఎం జగన్‌తో గతంలో కలిసి ఉన్న ఫోటోను ఉంచారు. వాట్సాప్ స్టేటస్‌లో వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థరెడ్డి పాట.. 'బైరెడ్డి సిద్దార్థరెడ్డి.. నీపేరే మా ధైర్యం రెడ్డి..' అనే పాటను పెట్టుకున్నారు. దీనిని తన వాట్సాప్ గ్రూపులో షేర్ చేశారు. ఈ నేపథ్యంలో వీఆర్వో కోటేశ్వరరావుకు షోకాజు నోటీసు జారీ చేసినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

డ్వాక్రా వీవోఏ మైకు పట్టుకుని మరీ..

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం పంచాయతీ మెట్టపంగిడిగూడెంలో డ్వాక్రా వీఓఏ కొప్పిశెట్టి వెంకటేశ్వరమ్మ వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీకి ఓట్లు వేసి గెలిపించాలని మైక్ పట్టుకుని మరీ నినదించారు.

రేపు కోస్తాంధ్రలో పిడుగులతో కూడిన వర్షాలు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్రలోని అనేక ప్రాంతాల్లో బుధవారం పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ సోమవారం హెచ్చరించింది. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. మిగతా చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ అకాల వర్షాలు కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు పొలం పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, మైదాన ప్రాంతాల్లో చెట్లు, టవర్లు, కరెంట్ స్తంభాల కింద ఉండరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఇ- టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి తరుపున చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్మాణం, దక్షిణ మధ్య రైల్వే వారు దిగువ పనులకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1.నిట్ నం.: E29CTRDSC17-2023-24_EPC3 తేది.14.03.2024 పని పేరు: EPC విధానంపై దక్షిణ మధ్య రైల్వే యొక్క ప్రస్తుత 1X25కెవి విధానం నుండి 2X25కెవి ఎటి విధానం యొక్క అప్‌గ్రేడేషన్ ఒక విభాగం అగు తెనాలి- గుంటూరు-కెసిసి సెక్షన్ పై ఎస్‌సిఓటిటి- కన్వెక్టెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో 1X25కెవి ఎటి విధానం లోని సెక్షనింగ్ పోస్ట్‌లు (ఎస్‌పిల) మరియు సబ్‌సెక్షనింగ్ మరియు ప్యారలలింగ్ పోస్ట్‌లు (ఎస్ఎస్‌పిల) యొక్క కమిషనింగ్ మరియు టెస్టింగ్, స్థాపన, సరఫరా, డిజైన్ కొరకు ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పి) కు అభ్యర్థన. **అంచనా విలువ:** రూ. 24,63,52,244/-, **బయానా / బిడ్ సెక్యూరిటీ** : రూ.12,31,800/-, **దాక్యుమెంట్ విలువ:** ఆన్‌లైన్‌లో టెండరు దాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును., **పూర్తిచేయు కాలం:** 9 నెలలు, **బిడ్డింగ్ విధానం.:** రెండు ప్యాకెట్ల విధానం., **ముగింపు తేది** :17.05.2024న 15.00గం.లకు.

2.నిట్ నం.: E29CTrDSC_18-2023-24-EPC4 తేది.14.03.2024 పని పేరు: EPC విధానంపై దక్షిణ మధ్య రైల్వే యొక్క ప్రస్తుత 1X25కెవి విధానం నుండి 2X25కెవి ఎటి విధానం యొక్క అప్‌గ్రేడేషన్ ఒక విభాగం అగు గుత్తి- ధర్మవరం సెక్షన్ పై ఎస్‌సిఓటిటి- కన్వెక్టెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో 2X25కెవి ఎటి విధానం లోని ట్రాక్షన్ సబ్‌స్టేషన్(టిఎస్ఎస్) సెక్షనింగ్ పోస్ట్‌లు (ఎస్‌పిల) మరియు సబ్‌సెక్షనింగ్ మరియు ప్యారలలింగ్ పోస్ట్‌లు (ఎస్ఎస్‌పిల) యొక్క కమిషనింగ్ మరియు టెస్టింగ్, స్థాపన, సరఫరా, డిజైన్ కొరకు ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పి) కు అభ్యర్థన. **అంచనా విలువ:** రూ. 84,47,54,345.00/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ.42,23,800/-, **దాక్యుమెంట్ విలువ:** ఆన్‌లైన్‌లో టెండరు దాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును., **పూర్తిచేయు కాలం:**12 నెలలు, **బిడ్డింగ్ విధానం.:** రెండు ప్యాకెట్ల విధానం., **ముగింపు తేది:** 21.05.2024న 15.00గం.లకు.

3.నిట్ నం.: E29CTrDSC_19-2023-24-EPC5 తేది.15.03.2024 పని పేరు: ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ & కన్‌స్ట్రక్షన్ (EPC) విధానంపై దక్షిణ మధ్య రైల్వే యొక్క ప్రస్తుత 1X25కెవి విధానం నుండి 2X25కెవి ఎటి విధానం యొక్క అప్‌గ్రేడేషన్ ఒక విభాగం అగు విజయవాడ- ఒంగోలు సెక్షన్ పై ఎస్‌సిఓటిటి- కన్వెక్టెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో 2X25కెవి ఎటి విధానం లోని ట్రాక్షన్ సబ్ స్టేషన్ (టిఎస్ఎస్), సెక్షనింగ్ పోస్ట్‌లు (ఎస్‌పిల) మరియు సబ్‌సెక్షనింగ్ మరియు ప్యారలలింగ్ పోస్ట్‌లు (ఎస్ఎస్‌పిల) యొక్క కమిషనింగ్ మరియు టెస్టింగ్, స్థాపన, సరఫరా, డిజైన్ కొరకు ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పి) కు అభ్యర్థన. **అంచనా విలువ:** రూ. 197,66,42,006/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ.98,83,300/-, **దాక్యుమెంట్ విలువ:** ఆన్‌లైన్‌లో టెండరు దాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును., **పూర్తిచేయు కాలం:**18 నెలలు, **బిడ్డింగ్ విధానం.:** రెండు ప్యాకెట్ల విధానం., **ముగింపు తేది:** 24.05.2024న 15.00గం.లకు.

4.నిట్ నం.: E29CTrDSC_20-2023-24-EPC6 తేది.15.03.2024 పని పేరు: ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ & కన్‌స్ట్రక్షన్ (EPC) విధానంపై దక్షిణ మధ్య రైల్వే యొక్క ప్రస్తుత 1X25కెవి విధానం నుండి 2X25కెవి ఎటి విధానం యొక్క అప్‌గ్రేడేషన్ ఒక విభాగం అగు సికింద్రాబాద్- కాజీపేట సెక్షన్ పై ఎస్‌సిఓటిటి- కన్వెక్టెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో 2X25కెవి ఎటి విధానం లోని ట్రాక్షన్ సబ్ స్టేషన్ (టిఎస్ఎస్), సెక్షనింగ్ పోస్ట్‌లు (ఎస్‌పిల) మరియు సబ్‌సెక్షనింగ్ మరియు ప్యారలలింగ్ పోస్ట్‌లు (ఎస్ఎస్‌పిల) యొక్క కమిషనింగ్ మరియు టెస్టింగ్, స్థాపన, సరఫరా, డిజైన్ కొరకు ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పి) కు అభ్యర్థన. **అంచనా విలువ:** రూ. 171,73,18,602/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ.85,86,600/-, **దాక్యుమెంట్ విలువ:** ఆన్‌లైన్‌లో టెండరు దాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును., **పూర్తిచేయు కాలం:**18 నెలలు, **బిడ్డింగ్ విధానం.:** రెండు ప్యాకెట్ల విధానం., **ముగింపు తేది:** 28.05.2024న 15.00గం.లకు.

5.నిట్ నం.: E29CTrDSC_21-2023-24-EPC7 తేది.15.03.2024 పని పేరు: ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ & కన్‌స్ట్రక్షన్ (EPC) విధానంపై దక్షిణ మధ్య రైల్వే యొక్క ప్రస్తుత 1X25కెవి విధానం నుండి 2X25కెవి ఎటి విధానం యొక్క అప్‌గ్రేడేషన్ ఒక విభాగం అగు గూడూరు- తిరుపతి సెక్షన్ పై ఎస్‌సిఓటిటి- కన్వెక్టెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో 2X25కెవి ఎటి విధానం లోని ట్రాక్షన్ సబ్ స్టేషన్ (టిఎస్ఎస్), సెక్షనింగ్ పోస్ట్‌లు (ఎస్‌పిల) మరియు సబ్‌సెక్షనింగ్ మరియు ప్యారలలింగ్ పోస్ట్‌లు (ఎస్ఎస్‌పిల) యొక్క కమిషనింగ్ మరియు టెస్టింగ్, స్థాపన, సరఫరా, డిజైన్ కొరకు ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పి) కు అభ్యర్థన. **అంచనా విలువ:** రూ. 106,92,28,320/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ.53,46,200/-, **దాక్యుమెంట్ విలువ:** ఆన్‌లైన్‌లో టెండరు దాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును., **పూర్తిచేయు కాలం:**15 నెలలు, **బిడ్డింగ్ విధానం.:** రెండు ప్యాకెట్ల విధానం., **ముగింపు తేది:** 31.05.2024న 15.00గం.లకు.

6.నిట్ నం.: E29CTrDSC_22-2023-24-EPC8 తేది.15.03.2024 పని పేరు: (EPC) విధానంపై దక్షిణ మధ్య రైల్వే యొక్క నాందేడ్ డివిజన్‌కు అకోలా - అకోట్ సెక్షన్‌పై ఎలక్ట్రికల్ జనరల్ పనులు మరియు సివిల్ ఇంజినీరింగ్ పనులు కలుపుకొని 2X25కెవి ఎటి ఫీడింగ్ సిస్టమ్ (ఓహెచ్ఇ & పిఎస్ఐ) యొక్క కమిషనింగ్ మరియు టెస్టింగ్, స్థాపన, సరఫరా, డిజైన్ కొరకు ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పి) కు అభ్యర్థన. **అంచనా విలువ:** రూ. 74,44,59,623/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ.37,22,300/-, **దాక్యుమెంట్ విలువ:** ఆన్‌లైన్‌లో టెండరు దాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును., **పూర్తిచేయు కాలం:**12 నెలలు, **బిడ్డింగ్ విధానం.:** రెండు ప్యాకెట్ల విధానం., **ముగింపు తేది:** 04.06.2024న 15.00గం.లకు.

7.నిట్ నం.: E29CTrDSC_23-2023-24-EPC9 తేది.15.03.2024 పని పేరు: (EPC) విధానంపై దక్షిణ మధ్య రైల్వే యొక్క నాందేడ్ డివిజన్‌కు అమలర్పూర్ - ఖాండ్వ సెక్షన్‌పై ఎలక్ట్రికల్ జనరల్ పనులు మరియు సివిల్ ఇంజినీరింగ్ పనులు కలుపుకొని 2X25కెవి ఎటి ఫీడింగ్ సిస్టమ్ యొక్క (ఓహెచ్ఇ & పిఎస్ఐ) ఎటి ఫీడింగ్ విధానం యొక్క కమిషనింగ్ మరియు టెస్టింగ్, స్థాపన, సరఫరా, డిజైన్ కొరకు ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పి) కు అభ్యర్థన. **అంచనా విలువ:** రూ. 77,00,31,649/-, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ.38,50,200/-, **దాక్యుమెంట్ విలువ:** ఆన్‌లైన్‌లో టెండరు దాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును., **పూర్తిచేయు కాలం:**12 నెలలు, **బిడ్డింగ్ విధానం.:** రెండు ప్యాకెట్ల విధానం., **ముగింపు తేది:** 11.06.2024న 15.00గం.లకు.

8.నిట్ నం.: E(GS)/CN/2023-2024- తేది.18.03.2024 పని పేరు: అహ్మద్‌నగర్ - బీడ్-పర్లివైజ్‌నాథ్ న్యూ బిజి లైన్ యొక్క కనెక్టివిటీతో కనెక్షన్‌లోని పర్లివైజ్‌నాథ్ స్టేషన్ వద్ద ప్రతిపాదిత జంక్షన్ ఏర్పాట్ల యొక్క ఎలక్ట్రిఫికేషన్.
అంచనా విలువ: రూ. 69,59,625.00, **బయానా/బిడ్ సెక్యూరిటీ:** రూ.139200.00, **దాక్యుమెంట్ విలువ:** లేదు. **పూర్తిచేయు కాలం:**06 నెలలు, **ముగింపు తేది:** 10.04.2024న 15.00గం.లకు.

1. బిడ్ దాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ http://ireps.gov.inకు లాగిన్ చేయగలరు.
2. బిడ్డర్లు IREPS.gov.in ద్వారా బిడ్ సెక్యూరిటీ కల్పించవలెను లేదా షెడ్యూల్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి బ్యాంక్ గ్యారంటీ బాండ్‌ను దాఖలు చేయవలసి ఉంటుంది. బ్యాంక్ గ్యారంటీ బాండ్ అనుబంధం-VII ప్రకారం ఉండవలెను మరియు అది బిడ్ చెల్లుబాటు కాలం అవతల 90 రోజుల కాలానికి చెల్లుబాటులో ఉండవలెను. డిమాండ్ డ్రాఫ్టులు, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రిసిప్ట్, ఎఫ్‌డిఆర్ వగైరా ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.
3. టెండరుదారులు వారి ఆఫర్లను టెండరు ముగింపు తేదీనకు ముందు పదిహేను రోజుల గడువు కాలం అయిన టెండరు దాఖలు సమయం దాఖలు చేయాలి. టెండరుదారులు టెండరు దాఖలు కాలం ప్రారంభ తేది వరకు ఏదేని సవరణను (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) గమనించగలరు.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ II/C/సికింద్రాబాద్

ఇ- టెండరు కోరుతూ ప్రకటన (https://ireps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి తరుపున సిఇ/సి-ఐ/ఎస్‌సి నిర్మాణ సంస్థ, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ వారు దిగువ పనులకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1.నిట్ నం.: PMS-03-CAO-C-SC-2024, తేది.16.03.2024 పని పేరు: ఎస్‌సిఆర్ నిర్మాణ సంస్థ : దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్‌లోని ఎలక్ట్రిఫికేషన్ మరియు సిగ్నలింగ్ పనులు కలుపుకొని (అనగా కి.మి.219.00 నుండి 223.800 & కి.మి. 232.300 నుండి 232.600 వరకు) మరియు టన్నెల్స్ పోర్షన్ మినహాయించి దిగువ మెట్ట మరియు నంద్యాల స్టేషన్‌ల మధ్య ట్రాక్ యొక్క ద.మ. రైల్వే మరియు డబ్లింగ్‌కు గుంతకల్ డివిజన్‌లోని సిగ్నలింగ్ పనులు మరియు ఎలక్ట్రిఫికేషన్ కలుపుకొని గుత్తి మరియు పెండేకల్లు స్టేషన్ల మధ్య ట్రాక్ డబ్లింగ్ కొరకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసులు (పిఎమ్ఎస్) ఏర్పాటు కొరకు అథారిటీ ఇంజనీర్ యొక్క అపాయింట్‌మెంట్. **అంచనా విలువ:** రూ. 15,17,79,200.00, **బయానా** : రూ.9,08,900.00, **పూర్తిచేయు కాలం:**30(ముప్పై) నెలలు, **తెరుచు తేది:** 20.05.2024న 15.00గం.లకు.

1. బిడ్ దాక్యుమెంట్ మరియు ఇతర వివరాలు కొరకు వెబ్‌సైట్ https://ireps.gov.in కు లాగిన్ కాగలరు.
2. టెండరుదారు టెండరు ముగింపు కాలం అయినట్టి సదరు పదిహేను రోజుల కాలం లోగా మాత్రమే వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను.
3. టెండరుదారు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కొరకు టెండరు దాఖలు ప్రారంభ కాలం తేది వరకు గమనించగలరు.

చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం/నిర్మాణం/ సికింద్రాబాద్.

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. DRM/Works/BZA/09/2024 తేది: 15.03.2024

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతిదానికి ఎదురుగా పేర్కొన్న తేదీన 15.00 గం.ల వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1. టెండరు నం. E-13-East-BZA-2024 పని పేరు: ADEN/Lines/BZA సబ్ డివిజన్ యొక్క SSE/P.Way/North/BZA సెక్షన్‌లో KI-NWBH మధ్యన నిర్మాణ సంస్థ నుండి 3వ లైన్ (నూతన డౌన్ లైన్)పై టేకింగ్‌కి సంబంధించిన మిగిలిన మరియు ఇతర రక్షణ పనులు మరియు నూతన లైన్ యొక్క బ్యాంక్ యొక్క డ్రై స్టోన్ పిచింగ్, ట్రాక్‌ల మధ్యలో సెంట్రల్ డ్రైన్ ప్రతిపాదన. **పూర్తి చేయు కాలం:** 18 (పద్దెనిమిది) నెలలు, **టెండరు విలువ:** రూ. 48332178/- **బయానా:** రూ. 391700/-, **ముగింపు తేది:** 08.04.2024

2. టెండరు నం. PMS-01-Bridges-BZA-2024 పని పేరు: BZA-VSKP సెక్షన్ పై GVN-KVR స్టేషన్ల మధ్యన RJY వద్ద బిఆర్ నం. 248 కొరకు గోదావరి నదిపై బౌ స్ట్రింగ్ ఆర్చ్ పిఎస్‌సి బ్రిడ్జ్ యొక్క పిఎస్‌సి బాక్స్ గిర్డర్ వద్ద ఇతర ఎండ్ మరియు బౌ స్ట్రింగ్ ఆర్చ్ వద్ద యాంకర్ల ఒక ఎండ్‌తో నూతన హ్యాంగర్ ట్యూబ్ల యొక్క 672 నం.ల. యొక్క పెట్రోలియం వాక్స్ గ్రౌటింగ్ & గ్రైస్సింగ్ స్థాపన, సరఫరా, ప్రస్తుత హ్యాంగర్ ట్యూబ్ల యొక్క తొలగింపు కొరకు ప్రాజెక్ట్ నిర్వహణా సేవలు అందించుట. **పూర్తి చేయు కాలం:** 30 (ముప్పై) నెలలు, **టెండరు విలువ:** రూ. 2,14,45,335/- **బయానా:** రూ. 2,57,200/-, **ముగింపు తేది:** 15.04.2024

1) కాబోరు టెండరుదారులు టెండరు ముగింపు తేదీకి ముందు ఏదేని టెండరుకు మార్పులు / సవరణల కొరకు వెబ్‌సైట్ "www.ireps.gov.in" ను దర్శించవలసిందిగా సూచించబడుచున్నారు.

డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ

A0360

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు దాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

అప్పులతో కాదు.. సంపదతో సంక్షేమం



(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నారా లోకేశ్ సోమవారం తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజు ఆయన మంగళగిరి మిడ్‌వ్యాలీసిటీ, మంజీరా మోనార్క్, పాత మంగళగిరి, నవులూరు, ఎర్రబాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో లోకేశ్ పలు అంశాలపై చర్చించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ గెలిచిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు.. జీరో బడ్జెట్‌తో రాష్ట్ర పాలనను ప్రారంభించారని తెలిపారు. అత్యంత వేగంగా సంపద సృష్టించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. అయితే, గత అయిదేళ్ల జగన్ విధ్వంస పాలనతో రాష్ట్రం 2014 నాటి పరిస్థితి కంటే ఘోరమైన స్థితికి చేరిందన్నారు. 30 ఏళ్లపాటు వెనక్కు వెళ్లిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు చంద్రబాబు ఓ సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసుకున్నారని తెలిపారు. దీనిలో భాగంగా పరిశ్రమలను రప్పించి లక్షల ఉద్యోగాలను కల్పిస్తే యువతకు ఉపాధి సమస్య తీరడంతోపాటు రాష్ట్ర ఆదాయం కూడా రెట్టింపయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఆలోచనల మేరకు 20 లక్షల ఉద్యోగాలను కల్పించేలా కొత్త పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువస్తారని, తద్వారా రెండున్నర రెట్ల ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఈ ఆదాయంతో ఇప్పటికన్నా మరింత మెరుగైన సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు వీలవుతుందన్నారు.

ఎన్టీఆర్‌తోనే సంక్షేమం మొదలు

దేశానికి మొట్టమొదటగా సంక్షేమాన్ని పరిచయం చేసిన నేత స్వర్గీయ ఎన్టీఆర్ అన్న సంగతిని తెలుగుజాతి గుర్తుంచుకోవాలని నా రా లోకేశ్ తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే సంక్షే మ కార్యక్రమాలను క్లిష్టకాలంలో సైతం ముం దుకు తీసుకెళతామని చెప్పారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి విద్యావంతులు మరింత మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జగన్ మూడు ముక్కలాటలతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన నష్టాన్ని కూడా గుర్తించలేని మూర్ఖమైన స్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అపరిపక్వ విధానాలతో రాష్ట్రంలో పరిస్థితులు బిహార్ కన్నా దారుణంగా తయారయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. పాలనా సౌలభ్యం కోసం రాజధాని ప్రాంతం ఒకేచోట ఉండాలని, అభివృద్ధిని మాత్రం వికేంద్రీకరించాలన్నది టీడీపీ విధానమని లోకేశ్ చెప్పారు.

భావ స్వేచ్ఛ బందీ

గత అయిదేళ్ల కాలంలో రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛను వైసీపీ ప్రభుత్వం కాలరాసిందని లోకేశ్ ఆరోపించారు. సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వెల్లడించిన మహిళలపై కూడా పేటీఎం బ్యాచ్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసి అవమానించిందన్నారు. వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలను తీసుకోకపోగా ప్రోత్సహించిందన్నారు. మహిళలను గౌరవించే విధంగా విద్యావ్యవస్థలో మార్పులను తీసుకువస్తామని లోకేశ్ చెప్పారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబును ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అసభ్య పదజాలంతో అవమానిస్తే ముఖ్యమంత్రి కనీసం స్పందించకుండా వ్యవహరించిన తీరు చాలా జుగుప్సాకరంగా ఉందన్నారు. ప్రతిపక్షనేతలను తిడితేనే వారికి టికెట్లు ఇస్తామని జగన్ నిస్సిగ్గుగా చెబుతుండడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఈ తరహా రాజకీయ నేతలకు ప్రజలు ఓటుతోనే తగిన విధంగా బుద్ధి చెప్పాలని నారా లోకేశ్ పిలుపునిచ్చారు. "వివేకా హత్యకేసులో 'నారాసుర రక్తచరిత్ర' అంటూ జగన్ మీడియాలో దుష్ప్రచారం చేశారు. ఈ రోజు వివేకా కుమార్తె సునీత తన తండ్రిని ఎవరు హత్య చేశారో వెల్లడించిన సంగతి యావత్ ప్రపంచం చూసింది. హత్యా రాజకీయాలతో అధికారం కోసం అర్రులు చాచే మోసగాళ్లకు ఈ ఎన్నికలలో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

కృష్ణా జలాలు అందిస్తాం

మంగళగిరి నియోజకవర్గంపై నారా లోకేశ్ వరాల జల్లు కురిపించారు. ఇక్కడి స్వర్ణకార వృత్తిదారుల కోసం అతిపెద్ద గోల్డ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా చేనేతరంగం అభివృద్ధికి మంగళగిరిలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్టును రాష్ట్రంలోని మిగతా చేనేత కేంద్రాలకు కూడా విస్తరింపజేస్తామన్నారు. అలాగే మంగళగిరి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు కృష్ణాజలాలను అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అమరావతి పనులను ప్రారంభిస్తాం

గత అయిదేళ్లుగా ఆగిపోయిన ప్రజా రాజధాని అమరావతి పనులను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని నారా లోకేశ్ చెప్పారు. వచ్చే పదేళ్లపాటు రాష్ట్రంలో సమర్థవంతమైన ప్రభుత్వం ఉంటేనే ఈ కష్టాల నుంచి ప్రజలు గట్టెక్కగలుగుతారన్నారు. చంద్రబాబు ప్రారంభించిన పనులను జగన్ కొనసాగించివుంటే లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేవని తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలేవీ రాకపోగా, ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టడంతో యువత భవిష్యత్తు దెబ్బతినిపోయిందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

సీఐడీకి కోర్టు ఝలక్

ప్రత్తిపాటి శరత్ కేసులో కోర్టు పరిధి మార్పు పిటిషన్ కొట్టివేత

విజయవాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీఐడీ పోలీసులకు విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఝలక్ ఇచ్చింది. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ కేసు విచారణను మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు(ఏసీబీ కోర్టు)కు మార్చాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయాధికారి కరీముల్లా సోమవారం కొట్టివేశారు. అవెక్సా కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి సంబంధించి నకిలీ బిల్లులు, ఇన్వాయిస్‌లు పొందుపరచి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకున్నారనే ఆరోపణపై శరత్‌ను మాచవరం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో విచారణ జరుగుతుండగా సీఐడీ పోలీసులు కోర్టు పరిధిని మార్పు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై డిఫెన్స్ న్యాయవాది కిలారు బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పోలీసుల నుంచి సీఐడీకి కేసును అప్పగిస్తూ చేసిన ప్రక్రియ అంతా డీజీపీ, సీఐడీ ఏడీజీ మధ్య జరిగిందని వాదించారు. ఒక కేసును బదిలీ చేసేటప్పుడు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాలని స్పష్టం చేశారు. వంగవీటి రంగా హత్య కేసును ఈ సందర్భంగా ప్రస్తావించారు. రంగా హత్య కేసును గవర్నరుపేట పోలీసులు నమోదు చేశారని, తర్వాత ఆ కేసును సీఐడీకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఆ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కేసును విచారణ ఏ కోర్టు పరిధిలోకి వస్తుందన్న విషయాన్ని నిర్ధారించడానికి పిటిషన్‌ను చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేసింది.



న్యాయవాదుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జస్టిస్ శేషసాయి, చిత్రంలో జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు తదితరులు

మధ్యవర్తిత్వంతో తక్షణ న్యాయం

▸▸ న్యాయవాదుల శిక్షణలో జస్టిస్ ఏవీ శేషసాయి

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించవచ్చని ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. మధ్యవర్తిత్వానికి సంబంధించి మెలకువలు నేర్చుకొని సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు. కోర్టుల్లో పేరుకుపోతున్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్ అండ్ కన్సలేషన్ వారి సూచనలకు అనుగుణంగా ఏపీ హైకోర్టు ప్రాంగణంలో జస్టిస్ యు.దుర్గాప్రసాదరావుతో కలిసి జస్టిస్ ఏవీ శేషసాయి జ్యోతి ప్రజ్వలన చేసి మధ్యవర్తిత్వానికి సంబంధించి 5రోజులు(40గంటల) శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. హైకోర్టు న్యాయసేవల కమిటీ చైర్మన్ జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ వివాహసంబంధ సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి జి.మాలతి, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ పరిపాలనాధికారి అమర రంగేశ్వరరావు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ఉద్యాన, పట్టు సహాయకులకు అంతర్ జిల్లా బదిలీలు

అమరావతి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా 25 మంది గ్రామ ఉద్యాన సహాయకులు, ముగ్గురు పట్టు సాగు సహాయకులను ప్రభుత్వం అంతర్ జిల్లా బదిలీలు చేసింది. గ్రామ ఉద్యాన సహాయకుల్లో 17మందిని స్పౌస్ కోటాలో, 8 మందిని పరస్పర అంగీకార బదిలీలకు అనుమతించింది. పట్టు సహాయకులను స్పౌస్ కోటాలో బదిలీ చేశారు.

బహిరంగ ప్రకటన

IIFL హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ అయిన మేము ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మా ఖాతాదారు **శ్రీ రామా రావు కొండ్రకుంట, శ్రీ అనిల్ కుమార్ కొండ్రకుంట, శ్రీమతి భూలక్ష్మి** ద్వారా లోన్ నం. 788980లో తనఖా పెట్టబడినట్టి దిగువ తెలిపిన దాక్యుమెంట్లు పోయినవి.
పోయిన/కనిపించకుండా పోయిన ఒరిజినల్ టైటిల్ దాక్యుమెంట్ల వివరణ మరియు ఆస్తి వివరణ:
దాక్యుమెంట్ నం. 1348/1999(ఎస్ఆర్‌వో గుణదల, విజయవాడ): కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, గుణదలలోని ఆర్ఎస్ నం. 256/2, మునిసిపల్ వార్డ్ నం. 33/2, అసెస్‌మెంట్ నం. 38614ఎల్, డోర్ నం. 48-19-6ఏ/12, విస్తీర్ణం 536.38 చ.గజాలు స్థలం సరిహద్దులు తూర్పు: 7 అడుగుల వెడల్పు రోడ్, దక్షిణం: మునిసిపల్ రోడ్, పశ్చిమం: కొండ్రకుంట భూలక్ష్మి ఆస్తి, ఉత్తరం: ఓడిపి రోడ్‌పై కెనాల్.
దాక్యుమెంట్ నం.1336/1999 (ఎస్ఆర్‌వో గుణదల, విజయవాడ): కృష్ణా జిల్లా ,విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, గుణదలలోని ఆర్ఎస్ నం. 256/2, మునిసిపల్ వార్డ్ నం. 33/2, అసెస్‌మెంట్ నం. 38614బి, డోర్ నం. 48-19-6ఏ/2, విస్తీర్ణం 536.38 చ.గజాలు స్థలం సరిహద్దులు తూర్పు:కొండ్రకుంట రామారావు ఆస్తి, దక్షిణం: మునిసిపల్ రోడ్, పశ్చిమం: కాకర్ల లక్ష్మణ్ ప్రతాప్ ఆస్తి, ఉత్తరం: ఓడిపి రోడ్‌పై కెనాల్.
పైన తెలిపిన దాక్యుమెంట్లు ఏ వ్యక్తి అయినా కనుగొనినచో, దిగువ తెలిపిన చిరునామా వద్ద వాటిని మాకు తిరిగి అందచేయువలసిందిగా అభ్యర్థించడమైనది.
ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం. 40-5-5-1/ఎ, 1/బి, శ్రీప్రా టవర్స్, 2వ అంతస్తు, ఎయిర్‌టెల్ వెనుక, చంద్రమౌళి పురం, టిక్కిల్ రోడ్ , విజయవాడ- 520010
తేది: మార్చి 18,2024 ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మసకబారుతున్న ప్రతిష్ఠ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దలకు ఏమి అనిపిస్తున్నదో తెలియదు కానీ, ఆ బ్యాంకుతో దశాబ్దాల అనుబంధం ఉన్న సామాన్యులకు మాత్రం ఎంతో అవమానంగా ఉంది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ జాబితాల్లోనూ చోటు సాధించిన ఈ బ్యాంకు ఎన్నికల బాండ్ల విషయంలో ఇలా వరుసపెట్టి సర్వోన్నత న్యాయస్థానంతో చివాట్లు తినడం సరికాదు. నిజాయితీ, పారదర్శకతలకు పెద్దపీట వేయాల్సిన ఈ సంస్థ, తనకు తానుగానే తప్పటడుగులు వేస్తున్నదో, పాలకుల ఒత్తిడికి వంగిపోతున్నదో తెలియదు కానీ, సుప్రీంకోర్టుతో అది వ్యవహరిస్తున్న తీరువల్ల ఏళ్ళతరబడి కూడబెట్టుకున్న విశ్వసనీయత చెదిరిపోయే ప్రమాదం ఉంది.

ఏ దాత ఏ పార్టీకి ఎంత ఇచ్చారన్న కీలక సమాచారాన్ని తెలియచెప్పే యూనిక్ బాండ్ కోడ్స్ సహా తన వద్ద ఉన్న సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి అందచేయాల్సిందేనంటూ బ్యాంకును సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు గౌరవప్రదమైన భాషనే ఉపయోగించినప్పటికీ, బ్యాంకు కొంత సమాచారాన్ని దాస్తున్నదనీ, తాను ఎంపిక చేసినదానిని మాత్రమే అందిస్తున్నదని, కీలకమైన లింకులను దాచిపెడుతున్నదని పలు వ్యాఖ్యల ద్వారా చెప్పకనే చెప్పారు. ఎన్నికల సంఘానికి అంతా ఇచ్చేశానని, వీసమెత్తు సమాచారాన్ని కూడా దాచలేదని మార్చి 21వ తేదీ సాయంత్రం ఐదుగంటలలోపు బ్యాంకు ఛైర్మన్ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసుకోవాల్సి వస్తున్నది. కోర్టు ఏది అడిగితే అది అందించడానికి బ్యాంకు సంసిద్ధంగా ఉందని దాని తరపు న్యాయవాది హరీష్ సాల్వే అంటున్నారు కానీ, ఫిబ్రవరి 15 ఆదేశాలను అమలు చేయాలన్న ఉద్దేశం బ్యాంకుకు ఏ మాత్రం ఇష్టంలేదని ఆదిలోనే తేలిపోయింది. గత నాలుగేళ్లలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి వివరాలు ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలని కోర్టు ఆదేశిస్తే, ఈ తీర్పు వెలువడిన మూడువారాలకు మళ్ళీ కోర్టుముందుకు వచ్చి, జూన్ 30వరకూ గడువు పెంచాలని ఎస్‌బీఐ విన్నవించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా బాండ్ల రహస్యాన్ని బట్టబయలు చేయాలని, సమస్త వివరాలను ప్రజలముందు ఉంచాలని సుప్రీంకోర్టు సంకల్పిస్తే, ఎన్నికలు ముగిసేవరకూ ఆ రహస్యాన్ని దాచాలని బ్యాంకు చూసింది. దీనిపై ఆగ్రహించిన సుప్రీంకోర్టు గడువు ఏ మాత్రం పొడిగించకుండా బ్యాంకును దారికి తేవడంతో, విధిలేక అది ఎన్నికల సంఘానికి సమాచారాన్ని అందించాల్సి వచ్చినప్పటికీ, కీలకమైన లింకులు లేకుండా చేసి, సర్వోన్నత న్యాయస్థానం తీర్పువెనుక స్ఫూర్తిని దెబ్బతీసే ప్రయత్నమైతే జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు, ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారం దేనికదిగా ఉంటూ ఏ పార్టీకి ఏ దాత ఎంత ఇచ్చాడన్న వివరాలను జతచేయగలిగే అవకాశం లేకుండా జాగ్రత్తపడుతున్నాయి. కంపెనీలకు, పార్టీలకు మధ్య బాండ్లతో ఏర్పడిన బంధం కానీ, క్విడ్ ప్రోకో కానీ ప్రజలకు తెలియకుండా పోతోంది. సుప్రీంకోర్టు ఈ ఎన్నికల బాండ్ల విధానాన్ని రద్దుచేయడానికి ప్రధాన కారణం ప్రతీదశలోనూ ఉన్న గోప్యతే. రాజకీయ పార్టీలకు గుప్తనిధులను సమకూర్చిపెట్టే ఈ విధానానికి కర్తగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టు ఏమిచెప్పినా, ఎంత మొత్తుకున్నా ఆ బాంధవ్యం బట్టబయలు కాకూడదని అనుకుంటోంది. వివిధ పారిశ్రామికవేత్తల సంఘాలు సంస్థలు కూడా ఏవో కేసులు వేస్తూ, ప్రత్యేక అభ్యర్థనలు చేస్తూ కోర్టును ఇబ్బంది పెడుతున్నాయి. చివరకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా బరిలోకి దిగారు.

ఎన్నికల బాండ్లమీద కోర్టుకు ఎక్కి విజయం సాధించినవారు, ఆ వివరాలను వక్రీకరిస్తున్నారని, బాండ్ల లెక్కలను తారుమారు చేస్తున్నారని సోమవారం తుషార్ మెహతా కోర్టుకు ఫిర్యాదుచేశారు. కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని ఒక ఎజెండా ప్రకారం ప్రభుత్వాన్ని ఇబ్బందికి గురిచేస్తున్నారనీ, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన వాదన. ఎన్నికల బాండ్ల విధానాన్ని న్యాయస్థానం కొట్టివేయడం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారపక్షానికి ఇబ్బంది కలిగించే విషయమే. అయితే, ఆ తీర్పుకంటే, దానిని అమలుచేసే క్రమంలో ఈ దేశ అతిపెద్ద బ్యాంకు వ్యవహరిస్తున్న తీరే ప్రభుత్వాన్ని మరింత అప్రదిష్టపాల్జేస్తున్నది. ఇప్పటికైనా ఆ బ్యాంకును స్వతంత్రంగా పనిచేసుకోనిస్తే పాలకులు తమ పరువు గురించి భయపడాల్సిన పని ఉండదు.

బీఆర్ఎస్, వైసీపీల ఆటకట్టు

భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందేందుకే బీజేపీ, ఇతర పార్టీల నేతలను అరెస్టు చేయిస్తుందని బూటకపు ప్రచారం చేస్తున్నవారు, అరిచి గగ్గోలు పెడుతున్నవారు అసలు తాము తప్పులు చేశామో లేదో ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఏదో ప్రజల ప్రయోజనాల కోసం, దేశం కోసం తాము అరెస్టు అవుతున్నామంటూ పిడికిళ్లు బిగించి భద్రతాధికారుల వెంట వెళ్లేవారు, ధర్నాలు చేయించే వారికి తాము ఎన్ని వేల కోట్ల ప్రజాధనం స్వాయత్తం చేసుకున్నదీ కూడా తెలిసే ఉంటుంది. నిజానికి తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితను అరెస్టు చేయకపోవడానికి బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్ కారణమని, ఆ రెండు పార్టీలూ ఒకటేనని కాంగ్రెస్ నేతలు బూటకపు ప్రచారం చేసి ఎన్నికల్లో ప్రయోజనం పొందారు. ఇప్పుడు కవితను ఈడీ అధికారులు అరెస్టు చేసి తీసుకువెళితే కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని, రెండు పార్టీలు కలిసి ఆమెను అరెస్టు చేసేందుకు కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తే, అసలు ఈ అరెస్టు అంతా డ్రామా అని కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి.



■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

నిజానికి ఢిల్లీ మద్యం కేసులో కవిత ఎప్పుడో అరెస్టయి ఉండాల్సిందని ఈడీ రెండు రోజుల క్రితం ఢిల్లీలో ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన కస్టడీ రిపోర్టును, అంతకు ముందు ఈడీ, సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్లను చదివిన వారికి అర్థమవుతుంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అక్రమంగా భారీ ఎత్తున లాభాలు ఆర్జించేందుకు వీలుగా ఆమె ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో ఎలా చేతులు కలిపారో, ఢిల్లీలోని ఒబెరాయ్, హైదరాబాద్‌లోని కోహినూర్ హోటళ్లలోనే కాకుండా తన నివాసంలో దళారులతో, వ్యాపారులతో ఎలా చర్చలు జరిపారో, ఎవరెవరితో ఏఏ వాట్సాప్ చాట్‌లో ఏమేమి మాట్లాడారో కేంద్ర దర్యాప్తు సంస్థలు పూసగుచ్చినట్లు వివరించాయి. ఆమెతో పాటు సౌత్ గ్రూప్‌లో ఉన్న భాగస్వాములు, బినామీలు అప్రూవర్లుగా మారి పలు సాక్ష్యాలు ఇచ్చారు. ఎంత మొత్తం హవాలా మార్గంలో మళ్లించారో తెలిపారు. ఆమె వ్యక్తిగత సిబ్బంది కూడా ఎవరెవరికి తాము డబ్బు సంచులు మోశామో తెలిపారు. సాక్ష్యాలు రూపుమాపేందుకు కవిత ఎన్ని ఫోన్లలో డేటాను తొలగించి ఎలా ఫార్మాట్ చేయించారో తెలిపారు. వీటన్నిటి ఆధారంగా ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టాలని ఈడీ ఎన్నోసార్లు ప్రయత్నించింది. కాని సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకున్నారు. అంతేకాక దాదాపు ఏడాది నుంచీ కవిత అరెస్టును తప్పించుకుంటూ ఏజెన్సీలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, రాజకీయ నాటకాలు ఆడుతూ కాలం వృథా చేశారు. కోర్టులకు తప్పుడు సమాచారంతో ఫిర్యాదులు చేస్తూ వాయిదాల ఆధారంగా పబ్బం గడిపారు. కాని ఎంత తప్పించుకున్నా ఏజెన్సీలు తమ పని తాము చేయకమానవు కదా.. ఎట్టకేలకు హైదరాబాద్ వెళ్లి అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకు వచ్చారు. ఇక తాము ఎలాంటి తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆమెదే.



కేజ్రీవాల్‌తో కేసీఆర్‌కు ఉన్న సంబంధాల వల్లే కదా, ఆయన కుమార్తె కవిత ఢిల్లీ దాకా వెళ్లి లిక్కర్ వ్యాపారం చేసే సాహసం చేశారు. తెలంగాణ పేరుతో దోచుకునేందుకు తెర లేపినందువల్లే ఇవాళ తెలంగాణలో భారత రాష్ట్ర సమితి అత్యంత సంక్షోభంలో ఉన్నది. ఆంధ్రలో జగన్ అరాచక పాలనను అంతం చేసేందుకు చేతులు కలిపిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తర్వాత వైసీపీ మనుగడ సైతం ప్రశ్నార్థకమయ్యే అవకాశమున్నది.

కవిత మాదిరే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈడీ విచారణను తప్పించుకుంటూ కాలం గడుపుతున్నారు. అక్రమార్జనకు వీలు కల్పించే విధంగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించే విషయంలో కవిత, తదితరులతో కేజ్రీవాల్ చర్చించారని సాక్ష్యాలు ఉన్నప్పటికీ ఆయన ఈడీ ప్రశ్నలు ఎదుర్కోవడానికి సిద్ధంగా లేరు. ఈ కుంభకోణానికి సంబంధించి ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్ జైలులో ఉన్నారు. మొత్తం కుంభకోణానికి రూపకల్పన చేసిన కేజ్రీవాల్, దక్షిణాది వర్గానికి ప్రాతినిధ్యం వహించి రూ. 100 కోట్ల మేరకు ముడుపులు చెల్లించిన కవితల సాక్ష్యాలు సేకరిస్తే ఈడీ, సీబీఐ పని పూర్తవుతుంది. ఇప్పుడు కవిత అరెస్టు అయినందువల్ల కేజ్రీవాల్ అరెస్టుకు కూడా రోజులు దగ్గరపడుతున్నాయని ఈ కుంభకోణాన్ని అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఎంతకాలమని ఎవరైనా చట్టంతో దోబూచులాడుకుంటారు? అసలు తెలంగాణకు, ఢిల్లీకి సంబంధం ఏమిటి? కేజ్రీవాల్‌తో కేసీఆర్‌కు ఉన్న సంబంధాల వల్లే కదా, ఆయన కుమార్తె కవిత ఢిల్లీ దాకా వెళ్లి లిక్కర్ వ్యాపారం చేసే సాహసం చేశారు. తెలంగాణ పేరుతో దోచుకునేందుకు తెర లేపినందువల్లే ఇవాళ భారత రాష్ట్ర సమితి అత్యంత సంక్షోభంలో ఉన్నది. ఆ పార్టీ త్వరలో అంతరించిపోయే పార్టీల్లో కలిసే సమయం ఆసన్నమైంది.

ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరి పేటలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల నేతలు పాల్గొన్న భారీ బహిరంగ సభకు వచ్చిన బ్రహ్మాండమైన ప్రతిస్పందనను చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో కూడా జగన్మోహన్ రెడ్డి పార్టీకి నూకలు చెల్లినట్లు కనపడుతోంది. 2012లో అక్రమాస్తులు, మనీలాండరింగ్ కేసులో ఆయనను అరెస్టు చేసి, సీబీఐ 11, ఈడీ 7 కేసులు నమోదు చేసినప్పటికీ 12 సంవత్సరాలుగా విచారణను తప్పించుకుంటూ వస్తున్నారు. వందలాది డిశ్చార్జి పిటిషన్లను దాఖలు చేసి న్యాయప్రక్రియను ఆలస్యం చేస్తున్నారు. జగన్ స్వంత బాబాయి, మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి హత్యకి సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన పార్టీ ఎంపీ అవినాశ్ రెడ్డి కూడా తనను సీబీఐ ప్రశ్నించకుండా అయిదు సంవత్సరాలుగా తప్పించుకుంటున్నారు. నిజంగా జగన్ కానీ, అవినాశ్ రెడ్డి కానీ నేరస్థులు కాకపోతే న్యాయ ప్రక్రియకు ఎందుకు సహకరించకూడదు? ఏవో కారణాలు చూపి అసలు విచారణనే ముందుకు కొనసాగించకుండా ఎందుకు అడ్డుపడుతున్నారు? ఇప్పుడే కాదు, ఈ దేశంలో అనేక మంది నేరచరితులైన రాజకీయ నేతలు తమపై విచారణను తప్పించుకుంటూ ఏళ్లకు ఏళ్లు కాలక్షేపం చేశారు. కాని చట్టం వారిపై ఎట్టకేలకు ఉచ్చుబిగించింది. జగన్, అవినాశ్ రెడ్డిలు కూడా వారిపై నేరారోపణలు రుజువై కటకటాలు లెక్కపెట్టే దూరం ఎంతో లేదు. అయినా ఈ ఎన్నికల్లో జగన్ అరాచక పాలనను అంతం చేసేందుకు చేతులు కలిపిన టీడీపీ, జనసేన, బీజేపీ విజయం తర్వాత వైసీపీ కూడా బీఆర్ఎస్ మాదిరే అంతరించిపోయే పార్టీగా మారక తప్పదు. జగన్, షర్మిలల మధ్య మంచి అవగాహన ఉన్నదని, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలను వారిద్దరూ కలిసి నడుపుతున్నారని, ఎన్డీఏ ఓట్లను చీల్చేందుకే జగన్ షర్మిలను కాంగ్రెస్ పార్టీలో చేర్చారని ప్రధాని మోదీ ఆదివారం చేసిన ఆరోపణల్లో నూటికి నూరుపాళ్లు సత్యం ఉన్నది. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును కాంగ్రెస్‌కు మళ్లించేందుకే జగన్ కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. నిజానికి జగన్, షర్మిల మధ్య అవినీతి డబ్బు పంచుకోవడం విషయంలో వచ్చిన తగాదాలే కాని మరే వివాదాలు లేవు. బహుశా జగన్ ఆ తగాదాలను అంతర్గతంగా పరిష్కరించుకుని తన వ్యతిరేక ఓటును చీల్చేందుకు షర్మిలను కాంగ్రెస్ శిబిరంలో చేర్చి ఉంటారు. గతంలో కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న సోనియాగాంధీకి కూడా తన అవినీతి సొమ్మును పంచిపెట్టనందుకే ఆమె, జగన్‌పై కేసులు పెట్టించి ఉంటారు కాని వారి మధ్య పెద్ద విభేదాలు ఏమీ లేవు. ఈ అవినీతి శక్తులనన్నిటినీ తుదముట్టించి 400కు పైగా సీట్లను సాధించేందుకే తాను ఎన్డీఏను బలోపేతం చేస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ప్రజల గుండెల్లో మార్మోగుతున్నది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

రాజకీయ ప్రక్షాళన గురించి మోదీ మాట్లాడొచ్చా?

పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు సభలో చేసే ప్రసంగాలు, వేసే ఓటింగ్ మంచి చెడ్డలను విచారించే హక్కు (ఆ సమయంలో వారి అవినీతి, లంచగొండితనంపై క్రిమినల్ ప్రాసెక్యూషన్ చేపట్టే అధికారం) కోర్టులకు లేకుండా చేస్తూ వచ్చిన 1998 నాటి అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రద్దు చేస్తూ ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తాజాగా ఇచ్చిన తీర్పును ప్రధాని నరేంద్ర మోదీ వేనోళ్ల పొగిడారు. తీర్పు చాలా గొప్పదంటూ దానిని ప్రధాని స్వాగతించారు. రాజకీయాలను ప్రక్షాళన చేస్తుందని, వాటిపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని తీర్పు వెలువడిన వెంటనే 'X' (మాజీ ట్విట్టర్)లో వ్యాఖ్యానించారు.

కోర్టులకు ఈడుస్తారనే భయంతో నిర్భయంగా మాట్లాడడానికి, ఓటు వేయడానికి పార్లమెంటు, శాసన సభల సభ్యులు వెనుకాడుతారని, అందువల్ల ప్రజాస్వామ్యానికి జరగవలసిన మంచి జరగదనే దృష్టితో రాజ్యాంగ కర్తలు వారికి కోర్టుల జోక్యం నుంచి రక్షణ కల్పించారు. అందుకు రాజ్యాంగంలో 105(2), 194 అధికరణలను చేర్చారు. మహోన్నత పార్లమెంటరీ ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ రక్షణ దుర్గం 1991లో పి.వి. నరసింహారావు మైనారిటీ ప్రభుత్వాన్ని కాపాడడానికి ఝార్ఖండ్ ముక్తి మోర్చా సభ్యులకు లంచం ఇచ్చి ఓటు వేయించిన తప్పుడు పని వల్ల ఇప్పుడు కూలిపోయింది. ఈ రక్షణ కారణంగానే జేఎంఎం సభ్యులపై సీబీఐ కేసు నిలవలేదు. పార్లమెంటు సభ్యులు సభలో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు రాజ్యాంగ రక్షణ ఉన్నందున జేఎంఎంపై సీబీఐ కేసు చెల్లదని 1998లో అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 తేడాతో తీర్పు ఇచ్చింది. ఇప్పుడు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దానిని కొట్టివేసింది. పార్లమెంటులో గాని శాసనసభల్లో గాని సభ్యులు ప్రసంగానికి, ఓటు వేయడానికి లంచం తీసుకొంటే ఇక నుంచి వారికి ఎటువంటి రక్షణ ఉండబోదని తాజా తీర్పు స్పష్టం చేసింది. ప్రధాని మోదీ ఈ తీర్పును ప్రత్యేక ప్రశంసలతో ముంచెత్తడం హృద్యంగా ఉంది. స్వచ్ఛ రాజకీయాల పట్ల ఆయన పార్టీకి గల మక్కువను అది చాటింది. కానీ–

దేశ రాజకీయాల్లో బీజేపీ వ్యాపింపజేస్తున్న దుర్గంధాన్ని, నియమోల్లంఘన ధోరణిని గమనించే వారికి ఏమనిపిస్తుంది? రవ్వంత అవినీతికి కూడా చోటు లేకుండా రాజకీయాలను కడిగిపారేయాలని, అవి కింది నుంచి పైవరకు ప్రక్షాళనకు గురి కావాలని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా కోరుకొంటూ ఉంటే దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ అధికారం కోసం బీజేపీ అడ్డ దారులు తొక్కడమేమిటి అనే ప్రశ్న వేధించడం సహజం. 2017 మార్చ్‌లో గోవా, మణిపూర్‌లలో జరిగిన వాటిని పరిశీలిస్తే రాజ్యాంగ విహిత ప్రజాస్వామ్యానికి బీజేపీ ఎంత విరుద్ధమైన పార్టీయో అర్థమవుతుంది. అప్పుడు ఆ రెండు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలన్నింటి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకొని ఏకైక అతిపెద్ద పార్టీగా ఎన్నిక కాగా రాజ్‌భవన్‌లను ఉపయోగించుకొని దాని నోటి ముందరి అధికారాన్ని బీజేపీ తన్నుకుపోయింది. ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయతగినంత స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, మిగతా పార్టీలన్నిటి కంటే ఎక్కువ సీట్లు గెలుచుకొన్న ఏకైక అతి పెద్ద పార్టీని గవర్నరు ఆహ్వానించాలని ఎస్.ఆర్.బొమ్మై కేసులో తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంగా చెప్పింది. 2017లో గోవా, మణిపూర్‌లో ఈ రాజ్యాంగ విధిని బీజేపీ కాల రాసింది. కాంగ్రెస్ కంటే చాలా తక్కువ స్థానాలు గెలుచుకొని కూడా తానే అధికారాన్ని కైవసం చేసుకొన్నది. ఈ రెండు రాష్ట్రాల్లో బలం లేకుండా అధికారాన్ని చెరబట్టిన బీజేపీ అందులో నిలదొక్కుకోడానికి అవసరమైన బలాన్ని చేరుకోడానికి ఎన్ని అడ్డదారులు, అవినీతి మార్గాలు తొక్కి ఉంటుందో చెప్పనక్కరలేదు, నేరుగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, లాభసాటి పదవులను ఎర వేయడం వంటివి చేసి ఎన్నికల్లో ప్రజల మొగ్గును బుగ్గిపాలు చేసిన వైనం ప్రజాస్వామ్య క్రీడా నియమోల్లంఘనకు పరాకాష్ఠ. ఇంత ప్రత్యక్షంగా బహిరంగంగా ప్రజా తీర్పును మంటగలిపిన పార్టీ అధినేతగా ప్రధాని మోదీ రాజకీయాల ప్రక్షాళన గురించి ఎలా నీతులు చెప్పగలుగుతారు?



పార్లమెంటు, శాసనసభల సభ్యులు సభల్లో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఇస్తున్న ఏర్పాటును సుప్రీంకోర్టు రద్దు చేసినందుకు మహాదానంద పడిపోయిన ప్రధాని మోదీ పార్టీ, ప్రభుత్వమూ కర్ణుడిని చంపినట్టు ప్రజాస్వామ్యాన్ని అన్ని వైపుల నుంచీ కుళ్లబొడుస్తున్న తీరు, ప్రతిపక్షాన్నీ ప్రశ్ననూ వధిస్తున్న పద్ధతి భారతీయులమైనందుకు మనందరం సిగ్గుతో తలదించుకొనేలా ఉన్నది.

2019లో మహారాష్ట్రలో ముఖ్యమంత్రి పదవిపై విభేదాలతో బీజేపీతో పొత్తుకు శివసేన గుడ్‌బై చెప్పి ఎన్‌సీపీ – కాంగ్రెస్‌లతో మెజారిటీ కూటమిని ఏర్పాటు చేసినప్పుడు ఎన్‌సీపీ నుంచి అజిత్ పవార్‌ను దువ్వి బీజేపీ ఆడిన నాటకం తెలిసిందే. అప్పటికి ఎన్‌సీపీ శాసనసభా పక్ష నాయకుడుగా ఉన్న అజిత్ పవార్ నుంచి మొత్తం 54 మంది పార్టీ శాసన సభ్యుల మద్దతును ఇస్తున్నట్టు లేఖ రాయించుకొని, బీజేపీ తరఫున దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ఓ ఉదయం రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించారు. దీని వెనుక తన చేయి ఉన్నట్టు ప్రచారం జరగడంతో శరద్ పవార్ రంగప్రవేశం చేసి చక్రం తిప్పేసరికి ఆ రోజు సాయంత్రానికల్లా కథ అడ్డం తిరిగింది. ఎన్‌సీపీ శాసన సభ్యులు దాదాపు అందరూ శరద్ పవార్‌కు విధేయతను ప్రకటించడంతో బీజేపీ పన్నాగం నీరుగారిపోయి శివసేన – ఎన్‌సీపీ – కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడి కూటమి ప్రభుత్వ ప్రయోగం సఫలమయింది. రెండున్నర సంవత్సరాలపాటు ప్రజాభిమానం చవి చూస్తూ సాగిన ఈ ప్రభుత్వాన్ని ఏక్‌నాథ్ షిండేని ప్రయోగించి కేంద్రంలోని పెద్దలు కూల్చివేశారు. శివసేనను చీల్చి, ఫిరాయింపులను రక్తి కట్టించి ఈ ఘట్టాన్ని ఘనంగా జరిపించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టడానికి చేజిక్కిన ఏ చిన్న అవకాశాన్నీ మోదీ నీతిమంత పాలనలో బీజేపీ వదిలిపెట్టడం లేదు. చివరకు ఈడీని, సీబీఐనీ, ఆదాయపు పన్ను శాఖను సైతం బాహాటంగా దుర్వినియోగం చేస్తున్నది. బెంగాల్ నుంచి తమిళనాడు వరకు రాజ్‌భవన్‌ల దుర్వినియోగం జుగుప్సాకరంగా సాగిపోతున్నది. రాజ్యసభలో బలాన్ని దొడ్డిదారిలో పెంచుకోడానికి ఇటీవలి ఆ ఎన్నికల్లో పాల్పడిన అక్రమాలు తెలిసినవే. హిమాచల్‌ప్రదేశ్ నుంచి గల ఒకే ఒక ఖాళీ స్థానానికి జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి సునాయసంగా గెలిచి వుండాల్సింది. బీజేపీ మీద కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు ఉన్నాయి. తొమ్మిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడం వల్ల సింఘ్వి ఓడిపోయారు. బీజేపీ అభ్యర్థి హర్ష మహాజన్ గెలుపొందారు. ఇక్కడ విచిత్రమైన ఎన్నికల కమిషన్ నియమం ఒకటి కూడా కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేసింది. అభ్యర్థులిద్దరికీ చెరి 34 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయాల్సి వచ్చింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం డ్రాలో పైకి తీసిన చీటీలో పేరు గల వ్యక్తి ఓడిపోవాలి. ఆ విధంగా సింఘ్వి ఓటమి పాలయ్యారు. ఇది మామూలు లాటరీ పద్ధతికి విరుద్ధమైనది. మామూలు పద్ధతిలో, తీసిన చీటీలోని వ్యక్తి గెలుపొందుతారు. ఈ సందర్భంగా సింఘ్వి వెలిబుచ్చిన ఆవేదన మన భ్రష్ట క్రాస్ ఓటింగ్‌ను జరిపించేవారి చెంప చెళ్లు మనిపించింది. 'క్రాస్ ఓటింగ్ చేసిన ఆ తొమ్మిది మందికి కూడా (ఎమ్మెల్యేలు) కృతజ్ఞతలు తెలపదలిచాను. మానవ స్వభావం గురించి వారు నాకు చాలా నేర్పారు. ఓటింగ్ ముందు రోజు రాత్రి వారు నాతో కలిసి తాగారు, తిన్నారు. మరుసటి రోజే వ్యతిరేకంగా ఓటు వేశారు' అని సింఘ్వి అన్నారు. బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది అనడానికి హిమాచల్ ప్రదేశ్‌లో అది నడిపించిన దుష్ట రాజకీయమే ఉదాహరణ. ఈ విషయంలో ఎటువంటి ప్రజాస్వామిక మర్యాదలు నియమాలైనా దాని దృష్టిలో దిగదుడుపే. సక్రమ ఎన్నికల నిర్వహణ అంటే దానికి అక్కసు. వాటిని మొక్కుబడి స్థాయికి దిగజారుస్తున్నది.

ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఎన్నికలను పర్యవేక్షించే ఎన్నికల కమిషన్ సభ్యులను ఎంపిక చేయడానికి భారత ప్రధాన న్యాయమూర్తి, ప్రధాని, ప్రతిపక్షనేతతో కూడిన ఎంపిక కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చేసిన సూచనను దాని మొహం మీద కొట్టి పార్లమెంటు చట్టం ద్వారా ఏకపక్ష ఎంపిక కమిటీని నియమించిన పాలకులకు అవినీతి రహిత రాజకీయాల పట్ల గల మక్కువ ఎంతటిదో వివరించనక్కరలేదు. పార్లమెంటు, శాసనసభల సభ్యులు సభల్లో చేసే ప్రసంగాలకు, వేసే ఓటుకు ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఇస్తున్న ఏర్పాటును సుప్రీంకోర్టు రద్దు చేసినందుకు మహాదానంద పడిపోయిన ప్రధాని మోదీ పార్టీ, ప్రభుత్వమూ కర్ణుడిని చంపినట్టు ప్రజాస్వామ్యాన్ని అన్ని వైపుల నుంచీ కుళ్లబొడుస్తున్న తీరు, ప్రతిపక్షాన్నీ ప్రశ్ననూ వధిస్తున్న పద్ధతి భారతీయులమైనందుకు మనందరం సిగ్గుతో తలదించుకొనేలా ఉన్నది. చివరికి జాతీయ మీడియా నోరు కూడా నొక్కేసి ప్రజలకు మోదీ తప్ప ఇతః పరంబెరుగ అనే దిక్కు లేని స్థితిని కల్పిస్తున్న విధానం భయంకరమైనది.

● జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

రాయలసీమ భగీరథుడు!

మిగులు జలాల ఆధారంగా గల తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులను ముందుకు నడిపింది మహాశయుడు ఎన్.టి. రామారావు అయితే, వాటి రూపకర్త ప్రముఖ ఇంజనీర్ స్వర్గీయ డాక్టర్ కుడితిపూడి శ్రీరామ కృష్ణయ్య. 1983లో ఎన్టీఆర్ అధికారం చేపట్టే సరికి కృష్ణ నదిలో నికర జలాలు పూర్తిగా పంపకం జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో మిగిలిందల్లా మిగులు జలాలు మాత్రమే. పైగా బచావత్ ట్రిబ్యునల్ మిగులు జలాలను రెండు వేల సంవత్సరం వరకు ఉపయోగించుకొనేందుకు ఇచ్చిన 'స్వేచ్ఛ' అనే వెసులుబాటును ఉపయోగించుకొని శ్రీరామ కృష్ణయ్య మిగులు జలాల ఆధారంగా నిత్య క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమకు ఈ ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

రాయలసీమ చరిత్ర పుటలు తిరగేస్తే ఆసక్తికరమైన అనేక అంశాలు కనపడతాయి. ఈ రోజు రాయలసీమకు జీవనాడులుగా మిగిలిన మిగులు జలాల ఆధారంగా గల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్ రాయలసీమకు చెందిన నేత కాదని చెప్పనిలేదు. అలాగే ఈ ప్రాజెక్టుల రూపశిల్పి శ్రీరామ కృష్ణయ్య కూడా రాయలసీమ వాసి కాదు. ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా బేతపూడి గ్రామంలో 1926లో జన్మించారు. అంతే కాదు, దత్త మండలాలుగా అవమానకరమైన పారిభాషిక పదంతో పిలవబడుతుండిన ఈ ప్రాంతానికి రాయలసీమ అని నామకరణం చేసింది కూడా రాయలసీమవాసి కాదు. కోస్తా జిల్లాలకు చెందిన విద్యావేత్త చిలుకూరి నారాయణరావు 1928లో నంద్యాలలో జరిగిన ఒక సభలో రాయలసీమ ప్రాంతంగా నామకరణం చేశారు. 1953లో కర్నూలు రాజధాని కావడంలో ప్రకాశం పంతులు గైకొన్న నిర్ణయం కీలకమైనది. శ్రీశైలం జలాశయం జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టు కాకుండా దాని స్థానంలో సిద్దేశ్వరం వద్ద బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణం కోసం కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య పెద్ద పోరాటమే చేశారు. ఇంత కథనం ఎందుకంటే స్వతహాగా రాయలసీమ వాసులు కాని వారే కొన్ని కీలకమైన సమయాల్లో రాయలసీమ చరిత్ర పుటల్లో చెరిగిపోని పాత్ర పోషించారు.



బచావత్ ట్రిబ్యునల్ మిగులు జలాలను రెండు వేల సంవత్సరం వరకు ఉపయోగించుకొనేందుకు ఇచ్చిన 'స్వేచ్ఛ' అనే వెసులుబాటును ఉపయోగించుకొని డాక్టర్ కుడితిపూడి శ్రీరామ కృష్ణయ్య మిగులు జలాల ఆధారంగా నిత్య క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమకు తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

ఆ కోవకు చెందినవారే శ్రీరామ కృష్ణయ్య కూడా. శ్రీరామ కృష్ణయ్య దూరదృష్టికి, ఇంజనీరింగ్ నైపుణ్యతకు తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి పథకాల రూపకల్పన నిదర్శనం. హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి ఆ పేరు ఎందుకు పెట్టారో చాలామందికి ఈనాటికీ తెలియదు. తుంగభద్ర పాలారు నదుల అనుసంధానమే హంద్రీనీవా. అయితే ఈ రెండు నదులు అంతర్ రాష్ట్ర నదులైనందున ఇతర రాష్ట్రాలు అభ్యంతరాలు పెడతాయనే భావనతో తుంగభద్ర ఉపనది హంద్రీ పాలారు ఉపనది (చిత్తూరు జిల్లా) నీవా నదుల పేర్లను శ్రీరామ కృష్ణయ్య నిర్ధారణ చేశారు. కాగా తెలుగుగంగ పథకంలోని భారీ రిజర్వాయర్లు వెలుగోడు (16.95 టియంసిలు), బ్రహ్మంసాగర్ (17 టియంసిలు), తుదిగా 60 టియంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మింపబడిన కండలేరు శ్రీరామ కృష్ణయ్య రెక్కల కష్టమే. ఆసియాలోనే అతి పెద్ద ఎర్త్ డ్యాంగా 12 కిమీ పొడవుతో కండలేరు నిర్మాణం జరిగింది.

శ్రీరామ కృష్ణయ్య గురించి చెబుతున్నపుడు గాలేరు నగరి పథకం గురించి చెప్పక తప్పదు. శ్రీశైలం ప్రధాన కుడి కాలువకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ఉన్నా గాలేరు నగరి పథకానికి శ్రీశైలం జలాశయం నుంచి రెండవ ముఖద్వారాన్ని డాక్టర్ శ్రీరామ కృష్ణయ్య ప్రతిపాదించారు. శ్రీశైలం జలాశయం నుంచి ప్రత్యేక ముఖ ద్వారం నుంచి వచ్చే నీళ్లు పెన్నా నదిపై వున్న మైలవరం జలాశయంలో ఒక వేపు కలసి మరో వేపు నుంచి బయటికి వెళ్లునట్లు తొలి రోజుల్లో రూపకల్పన జరిగింది. కాని భూసేకరణ ఇతర అనేక కారణాలతో ఈ ప్రతిపాదన పక్కన పెట్టి గాలేరు నగరి పథకాన్ని శ్రీశైలం కుడి ప్రధాన కాలువతో అనుసంధానం చేశారు. ఒకవేళ డాక్టర్ శ్రీరామ కృష్ణయ్య ప్రతిపాదించినట్లు ఆ రోజుల్లో శ్రీశైలం జలాశయం నుండి మరొక ముఖ ద్వారం ఏర్పడి ఉంటే నేడు అవశేష ఆంధ్రప్రదేశ్ ఇంతలా వగచవలసి వుండేది కాదు. శ్రీశైలం జలాశయం నుండి మూడు ముఖ ద్వారాలు ఏర్పడేటివి.

అంతవరకే కాదు. మైలవరం జలాశయం నుండి మొదలయ్యే ప్రధాన కాలువ శేషాచల పర్వత శ్రేణులు దాటి నెల్లూరు జిల్లాలో ప్రవేశించి తదుపరి చిత్తూరు జిల్లాలో శేషాచల పర్వత శ్రేణులు వెంబడి పయనించగా రెండు జిల్లాల్లో పది రిజర్వాయర్లు నిర్మించి అనుసంధానింపబడునట్లు ఏర్పాటు చేశారు. కేవలం కృష్ణ నదీ జలాలే కాకుండా శేషాచల పర్వత శ్రేణుల్లో పడే భారీ వర్షాలతో వచ్చే వరద నీరు ఎక్కడికక్కడ ఒడిసి పట్టుకుని ఆయా రిజర్వాయర్లలో నిల్వచేసే విధంగా ప్రతిపాదించారు. ఫలితంగా సుదూర ప్రాంతాల్లో కూడా భూగర్భ జలాలు పెంపుదల లక్ష్యంగా శ్రీరామ కృష్ణయ్య భావించారు. అయితే తదుపరి 1989 ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో హోంమంత్రిగా పని చేసిన డాక్టర్ మైసూరారెడ్డి ప్రేరణతో మరొక ఇంజనీర్ శ్రీరామా రెడ్డి మొత్తం పథకాన్ని మార్చేశారు. అంతిమంగా జగన్మోహన్ రెడ్డి హయాంలో గాలేరు నగరి రెండవ దశ పథకం పూర్తిగా అటకెక్కింది. మరో విశేషమేమంటే గ్రావెటీ ద్వారా నీరు తరలించే గాలేరు నగరి పథకంలోని రిజర్వాయర్లను శ్రీరామ కృష్ణయ్య ఆఫ్ లైన్ పద్ధతిలో వేటికవిగా ప్రతిపాదించి నీటి ఎద్దడి రోజుల్లో ఆయా రిజర్వాయర్లకు దామాషా పద్ధతిలో నీటి కేటాయింపులు చేసే విధానం సిద్ధం చేయగా తదుపరి శ్రీరామా రెడ్డి మొత్తంగా మార్పుచేసి ఆన్‌లైన్ పద్ధతి ప్రవేశపెట్టారు. ఫలితంగా చివర భూములకు నీరు అందే పరిస్థితి లేకుండా చేశారు.

ఇంతటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించే సమయంలో కూడా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగానే శ్రీరామ కృష్ణయ్య కొనసాగారు గాని చీఫ్ ఇంజనీర్ అని గాని ఇంజనీరింగ్ చీఫ్ అని గాని తోకలు తగిలించుకోలేదు. నాణేనికి ఇదొక వేపు అయితే మరో వేపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీరామ కృష్ణయ్య ప్రతిభ గుర్తించి పలు బాధ్యతలను అప్పగించాయి. 1984 నుండి 1990 వరకు తెలుగు గంగ ఓయస్డీగా పని చేశారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ గౌరవ సలహాదారుగా వున్నారు. 1990–92 మధ్య కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మదింపు కమిటీ సభ్యులుగా పని చేశారు. 1995–97 మధ్య గోదావరి కృష్ణ పెన్నా నదుల డ్రైనేజీ బోర్డు ఛైర్మన్‌గానూ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ సభ్యులుగా కూడా పని చేశారు. అంతిమంగా 2002 మార్చి 20న కీర్తిశేషులైనా ఆయన మిగిల్చిపోయిన కృషి ఫలితం తరతరాలుగా క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమకు అందుతూనే ఉంది.


■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

(మార్చి 20: డాక్టర్ శ్రీరామకృష్ణయ్య వర్ధంతి)

ముస్లింలు నయా అస్పృశ్యులేనా?

'భారత రాజ్యాంగం విప్లకరమైనదే కానీ'... అంటూ ఫిబ్రవరి 6న ఆంధ్రజ్యోతిలో డానీ రాసిన వ్యాసంలో కొన్ని విషయాలు అసంబద్ధంగా, అసందర్భోచితంగా ఉన్నాయి. భారత రాజ్యాంగాన్ని నేనే తగలబెడతానని అంబేడ్కర్ అన్న మాటలను ఇటీవల కాలంలో జాతీయ వాదాన్ని వ్యతిరేకించే మేధావులు చాలా చోట్ల ప్రయోగిస్తున్నారు. ఈ ప్రయోగం వెనుక వారి ఉద్దేశ్యాలు ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదు. ఇక, భారత రాజ్యాంగాన్ని మార్క్సిస్టు, లెనినిస్ట్ సిద్ధాంతాలతో ప్రేరణ పొందినవారు అంగీకరించరు అంటూనే ఈ రాజ్యాంగం విప్లవకరమైనదని, మెచ్చుకోదగినదని చెప్పడం అసంబద్ధంగా లేదూ?

ఈ రాజ్యాంగం పనికిరానిది అంటూనే, పశ్చిమ బెంగాల్‌లో 32 సంవత్సరాలు, త్రిపురలో 27 సంవత్సరాలు, కేరళలో అర్ధ శతాబ్దిపైన వామపక్షవాదులు అధికారాన్ని అనుభవించారు. భారత రాజ్యాంగ హక్కులను కాలరాచి, ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీ ప్రభుత్వానికి వామపక్షాల్లోని ఒక వర్గం కొమ్ము కాసింది. వాస్తవంగా ఈ దేశంలోని వామపక్ష వాదుల్లో తాము నమ్మిన సిద్ధాంతం విషయంలో ఏకాభిప్రాయం లేదు. అందుకే వివిధ గ్రూపులు ఏర్పడ్డాయి. ఈ దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారం విషయాల్లో ఒక స్పష్టమైన అభిప్రాయం ఇప్పటికీ లేదు. ఈ దేశ ఉత్థాన పతనాలకు కారణమైన హిందువుల సంస్కృతి పట్ల వారికి గుడ్డి వ్యతిరేకత ఉంది.



ఇక వ్యాసంలో అతి ముఖ్యమైన అంశం స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ముస్లింలను నయా అస్పృశ్యులుగా మార్చారని చెప్పడం. ఈ దేశంలో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ముస్లింల ఓట్ల కోసం సాగిలపడడం, వారి మతపరమైన, అభివృద్ధి వ్యతిరేక ఆలోచనలకు మద్దతు ఇవ్వడం పరిపాటి అయింది. వారిని గట్టి మతవాదులుగా దృఢీకరించారు. అందుకే షాబానో కేసు తీర్పును అంగీకరించమని కరాఖండిగా చెప్పేశారు. వాస్తవంగా ప్రపంచంలో ఏ దేశంలో మైనారిటీలు అనుభవించలేని హక్కులను ఈ దేశంలో ముస్లింలు అనుభవిస్తున్నారు. ఆ సామాజిక వర్గం నుంచి నలుగురు రాష్ట్రపతులు, నలుగురు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఎన్నిక చేయబడ్డారు. సుప్రీంకోర్టుకు మొట్టమొదటి మహిళా న్యాయమూర్తి కూడా ఆ సామాజిక వర్గానికి చెందిన ఫాతిమా బీవీ. అటు పార్లమెంటులో, వివిధ రాష్ట్రాలలోని శాసనసభల్లో వారి ప్రాతినిధ్యం మతాలకు అతీతంగా ఉంది. ఈ దేశం మతం ఆధారంగా 1947లో మూడు ముక్కలయిందన్న వాస్తవాన్ని స్మృతి పథంలో ఉంచుకుంటే– మతం ఆధారంగా దేశాన్ని పంచుకోవాలని ప్రతిపాదన చేసింది ముస్లింలు. అందుకు మద్దతు ఇచ్చింది ముస్లింలు. ఈ విషయంలో హిందువుల ప్రమేయం ఏమీ లేదు. ముస్లింలు మెజారిటీగా ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనారిటీలైన హిందువుల మనుగడ ఎలా ఉందో నిష్పాక్షిక విశ్లేషణ చేయగలిగే సామర్థ్యం ఉంటే వాస్తవాలు బయటపడతాయి.

ఇక కాశ్మీరు లోయలో మూడు లక్షల మంది హిందువులను తరిమివేసిందీ, హిందువులను ఊచకోత కోసిందీ, అందుకు మద్దతు ఇచ్చిందీ ఎవరు? అస్పృశ్యులే అయితే వారికి ఇలాంటి పనులు సాధ్యమేనా? 15 నిమిషాలు పోలీసులను పక్కన పెడితే అంటూ ఈ దేశంలోని 100 కోట్ల మంది హిందువులను ఉద్దేశించి భీకర ప్రతిజ్ఞ చేసింది ఈ అస్పృశ్యులలోని వ్యక్తే కదా! ముస్లింలు మెజారిటీగా ఉండే దేశాలలో మైనారిటీలు ఇలాంటి మాటలు మాట్లాడి బతుకుతారా? ఈ దేశంలో వాస్తవాలు విరుద్ధంగా ఉన్నాయి.

రాజ్యాంగ నిర్మాతల ఆలోచన పరిధిలో లేని 'లౌకిక' అనే పదం ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగంలో చేర్చారు. ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపే వాళ్లకు ఇది ఒక అస్త్రంగా మారింది. వాస్తవం మాట్లాడితే ఈ దేశంలో ముస్లింలు, హిందువులు నిత్య జీవన వ్యవహారంలో సామరస్యంతోనే ఉంటున్నారు. రాజ్యాధికారం, కీర్తి కండూతితో లౌకికవాద ముసుగు వేసుకున్న రాజకీయ నాయకుల ఆలోచనలు హిందుత్వ రాజకీయాలకు ప్రేరణగా మారాయి. ఈ వాస్తవాన్ని ప్రజలకు వివరించగలిగే హితైషుల సంఖ్య ఈ దేశంలో పెరగాలి. ఇక షాహీన్‌బాగ్ ఉద్యమం, రైతు వ్యతిరేక చట్టాల ఉద్యమ సమయాలలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో అధికారంలో ఉండివుంటే– పరిస్థితులు భిన్నంగా ఉండేవి. హిజాబ్‌ను ఇరాన్‌లో వ్యతిరేకించిన మహిళలకు ఏ గతి పట్టిందో మనదేశంలో ఉద్యమకారులకు అలాంటి గతే పట్టేది. ఈ ఉద్యమాల వెనుక ఉండే విదేశీశక్తులు, దేశ అంతర్గత శత్రువుల కుట్రలను అధికార బీజేపీ పసిగట్టినందువల్లనే ఉద్యమ స్వరూపం మారిపోయింది. అక్రమ చొరబాటుదారులను ఈ దేశ పౌరులుగా మార్చాలన్న కుహనా లౌకికవాదుల ప్రేరణ షాహీన్‌బాగ్ ఉద్యమం వెనుక ఉన్నది అనేది వాస్తవం.


– ఉల్లి బాలరంగయ్య



తొలి అడుగు

కొత్త ఎన్టీఆర్ జిల్లాకు మొదటి ఎన్నికలు

కోటి ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలతో రెండు వత్సరాల కిందట ఉదయించింది నవ ఎన్టీఆర్ జిల్లా. కృష్ణాజిల్లా నుంచి విడి.. అన్న నందమూరి తారక రామారావు పేరు మీదుగా వడివడిగా అడుగులు వేసిన ఈ కొత్తజిల్లా ఆశించిన మేర అభివృద్ధివైపు మాత్రం పరుగులిడలేదు. పునర్విభజన జరిగి రెండేళ్లు కూడా కాకముందే వస్తున్న ఈ సార్వత్రిక ఎన్నికలు కొత్త జిల్లాకు కీలకమనే చెప్పాలి. ఎన్నో కలలకు ప్రధాన దారిగా, భవిష్యత్తు తరాలకు చుక్కానిగా నిలవనున్న ఎన్టీఆర్ జిల్లాకు ఈ ఎన్నికలు ఓ మైలురాయేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కదన రంగంలోకి అడుగు పెడుతున్న మన కొత్త జిల్లా భౌగోళిక స్వభావాలతో పాటు రాజకీయ ముఖచిత్రాన్ని ఒకసారి పరికిస్తే..



- మారిన భౌగోళిక స్వరూపాలు.. ముఖచిత్రం
- 3,316 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం
- ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గం
- 16 మండల పరిషత్తులతో ఉమ్మడి కృష్ణాలోనే జడ్పీ పాలన
- రెండు జిల్లాల్లో విస్తరించిన విజయవాడ రూరల్ మండలం
- కొత్త జిల్లా ఏర్పడినా.. అభివృద్ధి మాత్రం శూన్యం

ఈ ఎన్నికలే కీలకమంటున్న విశ్లేషకులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 2022, ఏప్రిల్ 4న ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి విడివడిన తర్వాత ఎన్టీఆర్ జిల్లా భౌగోళిక స్వరూప స్వభావాలు, రాజకీయ ముఖచిత్రాలు మారాయి. తూర్పున ఏలూరు జిల్లా, పశ్చిమాన గుంటూరు జిల్లా, ఉత్తరాన ఖమ్మం జిల్లా, దక్షిణాన కృష్ణాజిల్లా సరిహద్దుగా కలిగి ఉంది. 3,316 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మొత్తం 321 రెవెన్యూ గ్రామాలు, 288 పంచాయతీలు, 20 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. నందిగామ రెవెన్యూ డివిజన్‌లో 7 మండలాలు, తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 5 మండలాలు, విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఒక విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఉండగా, మునిసిపాలిటీలుగా కొండపల్లి, జగ్గయ్యపేట, తిరువూరు ఉన్నాయి.

మారిన రాజకీయ ముఖచిత్రం

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం ఉన్నాయి. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం అసెంబ్లీ స్థానాలు కాగా, విజయవాడ పార్లమెంట్ స్థానంగా ఉంది. ఇక.. కృష్ణాజిల్లా పరిధిలో ఉన్న గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలానికి చెందిన 16 గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలోనే అంతర్భాగంగా ఉన్నాయి. ఈ 16లో ఏడు మైలవరం, తొమ్మిది గన్నవరం నియోజకవర్గాల్లోకి వస్తాయి.

చదరపు కిలోమీటర్లు	- 3,316
రెవెన్యూ గ్రామాలు	- 321
పంచాయతీలు	- 288
మండలాలు	- 20
రెవెన్యూ డివిజన్లు	- 3
ఓటర్లు	- 16,74,995
మహిళలు	- 8,57,361
పురుషులు	- 8,17,484

విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి, వైఎస్సార్ గ్రామ పంచాయతీ, రామరాజ్యనగర్, కొత్తూరు తాడేపల్లి గ్రామాలు మైలవరం నియోజకవర్గంలోకి, విజయవాడ రూరల్ మండలంలోని గూడవల్లి, నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం పంచాయితీలు గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోకి వస్తాయి. రామరాజ్యనగర్, వైఎస్సార్ గ్రామం కిందటి పంచాయతీ ఎన్నికలకు ముందే ఏర్పడ్డాయి. అయితే, వీటికి ఎన్నికలు జరగలేదు. విజయవాడ రూరల్ మండలంలో అత్యధికంగా 1.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇది కృష్ణాజిల్లాలోని పెడన నియోజకవర్గం ఓటర్లతో సమానం. అందుకే విజయవాడ రూరల్‌ను ఎప్పటి నుంచో ప్రత్యేక నియోజకవర్గం చేయాలన్న డిమాండ్ వస్తోంది.

జిల్లా జనాభా.. ఓటర్ల వివరాలు..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 22.18 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో పురుషులు 11.14 లక్షల మంది, మహిళలు 11.04 లక్షల మంది. ప్రతి 1,000 మంది పురుషులకు 991 మంది మహిళల చొప్పున జిల్లాలో లింగ నిష్పత్తి ఉంది. 4.06 లక్షల మంది షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) జనాభా, 82 వేల మంది షెడ్యూల్డ్ తెగల జనాభా నివసిస్తున్నారు. ఇటీవల కులగణన జరిగినప్పటికీ ఆ వివరాలను వెల్లడించలేదు. తుది ఓటర్ల జాబితా ప్రకారం చూస్తే.. ఎన్టీఆర్ జిల్లాలో 16,74,995 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా మహిళా ఓటర్లు 8,57,361 మంది ఉంటే, పురుష ఓటర్లు 8,17,484 మంది. థర్డ్‌జెండర్ ఓటర్లు 150 మంది, సర్వీసు ఓటర్లు 386 మంది ఉన్నారు. తిరువూరులో 2,54,476 మంది, విజయవాడ పశ్చిమలో 2,48,849 మంది, విజయవాడ సెంట్రల్‌లో 2,73,754 మంది, విజయవాడ తూర్పులో 2,64,778 మంది, మైలవరంలో 2,76,409 మంది, నందిగామలో 2,03,322 మంది, జగ్గయ్యపేటలో 2,02,407 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రస్తుతం ఉమ్మడి జడ్పీనే..

జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆమోదం లేకపోవటం, కేంద్ర గజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవటం వల్ల రాజ్యాంగబద్ధమైన సంస్థలకు సంబంధించి విభజన పూర్తి కాలేదు. ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్తుకు ఎన్నికలు జరిగాయి. జడ్పీ కొలువుదీరిన తర్వాత కాలంలో ఎన్నికలు జరగటంతో ప్రస్తుతం ఉమ్మడి జడ్పీగానే కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 16 మండల పరిషత్తులు ఉన్నాయి. ఇవన్నీ కూడా ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లా జడ్పీ పరిధిలో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు ముగిశాక వచ్చే జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల్లో వేర్వేరుగా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.



పటమటలోని జడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు రాసేందుకు క్యూలో వెళ్తున్న విద్యార్థులు, సమయం మించిపోతుందన్న తొందరలో పరుగు పెడుతున్న ఓ విద్యార్థి

• పది పరీక్షలు ప్రారంభం

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 178 కేంద్రాల్లో పరీక్షలు మొదలయ్యాయి. ఈనెల 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

- 6లో..

అవినీతి డిపో

వీఎంసీ వెహికల్ డిపోలో అడుగడుగునా అవినీతి



- నెలకు 500 లీటర్ల డీజిల్ పక్కదారి
- మరమ్మతుల పేరుతో దోపిడీ
- నామినేషన్ పనుల పేరుతో రూ.కోట్లు హాంఫట్
- ఏసీబీ దాడిలో అసలు సూత్రధారి ఎవరు..?
- కిందిస్థాయి ఉద్యోగిని కావాలనే ఇరికించారా?

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వెహికల్ డిపో అక్రమాలకు నిలయంగా మారింది. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి వాహనాలు కొనుగోలు చేస్తున్నా, వాటి నిర్వహణ విషయంలో అవినీతి తాండవిస్తోంది. వాహనాల నిర్వహణకు ఏటా రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకూ ఖర్చు చేస్తున్నారు. ఇందులో అధికశాతం అధికారుల జేబుల్లోకి చేరుతుండగా, స్క్రాప్ వేలం నుంచి ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ వరకు, వాహనాల మరమ్మతుల నుంచి డీజిల్ దోపిడీ వరకు అన్నింటా డబ్బు పక్కదారి పడుతోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : నగరంలోని హనుమాన్‌పేటలో వీఎంసీ వెహికల్ డిపో ఉంది. 2017 నాటికి వీఎంసీ పరిధిలో 14 డంపర్ ప్లేసర్లు, 9 చిన్న టిప్పర్లు, 2 ట్రాక్టర్లు, 2 హుక్ లోడర్లు, 4 పెద్ద టిప్పర్లు, చెత్త సేకరణ వాహనాలు కలిపి సుమారు 140 వాహనాలు ఉండేవి. ఆ తర్వాత పెరిగిన అవసరాల నిమిత్తం కొత్త వాహనాల కొనుగోలుతో ఆ సంఖ్య 200 పైచిలుకుకు చేరింది. నిత్యం 5వేల లీటర్ల డీజిల్ వినియోగం జరుగుతోంది. డీజిల్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో వాహనానికి 8 నుంచి 12 లీటర్ల డీజిల్‌ను ఫిల్లింగ్ చేసి 10 నుంచి 20 లీటర్లుగా రికార్డుల్లో రాస్తున్నారని తెలుస్తోంది. డీజిల్‌ను అధికారులు రెడ్ హ్యాండెండ్‌గా దోచేసిన ఉదంతం సుమారు ఐదేళ్ల క్రితం వెలుగులోకి వచ్చింది. అయినా రోజుకు సుమారు 500 లీటర్లకుపైగా డీజిల్ పక్కదారి పడుతోంది.

నామినేషన్ పనుల పేరుతో దోపిడీ

ఓవైపు చిన్నచిన్న మరమ్మతులకు సైతం వేలాది రూపాయలు లాగేస్తున్నారు. మరోవైపు ఆ చిన్నచిన్న మరమ్మతులకు సైతం నెలలు తరబడి సమయం తీసుకుంటూ ఆ వాహనం స్థానంలో ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకుని కమీషన్లు కొట్టేస్తున్నారు. వాహనాల మరమ్మతులు, ఇతర పనులకు సంబంధించి రూ.5 లక్షల్లోపు అయితే వీఎంసీ కమిషనర్ ఆమోదం లేకుండా నామినేషన్‌పై పనులు చేయించవచ్చు. దీన్ని ఆసరాగా చేసుకుని ఇటీవల సుమారు 50 పైచిలుకు పనులను నామినేషన్ పద్ధతిపై రూ.3 కోట్ల వరకు చేశారు. ఈ మొత్తంలో కోటి రూపాయలకు పైగా అధికారుల జేబుల్లోకి వెళ్లిందన్న ఆరోపణలు ఉన్నాయి. వెహికల్ డిపోలో అనుభవం ఉన్న మెకానిక్‌లు ఉన్నారు. కానీ, నిర్వాహకులు కావాలనే వాహనాలను మరమ్మతుల నిమిత్తం ఆటోనగర్ పంపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

స్క్రాప్ పేరుతో దోపిడీ

హనుమాన్‌పేటలో ఉన్న వెహికల్ డిపోను 2022లో ఆధునికీకరించారు. ఆ సమయంలో డిపోలో పేరుకుపోయిన స్క్రాప్‌ను వేలానికి పెట్టారు. సుమారు పదేళ్లుగా పేరుకుపోయిన స్క్రాప్‌ను అతి తక్కువ ధరకు ఇచ్చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పారదర్శకంగా వేలాన్ని నిర్వహించామని చెబుతున్నా, భారీ గోల్‌మాల్ జరిగిందని వెహికల్ డిపో సిబ్బందే చెబుతున్నారు. నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరుడికి కారుచౌకగా ఈ కాంట్రాక్టును కట్టబెట్టారని, ఫలితంగా వెహికల్ డిపో అధికారులకు పెద్ద మొత్తమే ముట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ టెండర్లు వెహికల్ డిపోలో ప్రధాన అధికారి బినామీలకు తప్ప వేరొకరికి దక్కవన్న ప్రచారం ఉంది.

బాస్‌కు తెలియకుండానే జరిగిందా?

వెహికల్ డిపో ఇన్‌చార్జి ఏఈ తోట ఈశ్వర్‌ను రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఎస్ ఎకో మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ తరఫున విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడానికి వర్క్ ఆర్డర్ ప్రకారం ఒప్పందాన్ని ప్రాసెస్ చేయడానికి వెహికల్ డిపో అధికారులు లంచం డిమాండ్ చేయడంతో సదరు సంస్థ వారు ఏసీబీని ఆశ్రయించారు. అయితే, ఈ వ్యవహారంలో వెహికల్ డిపో బాస్ ప్రమేయం లేకుండానే చిరుద్యోగిగా ఉన్న ఈశ్వర్ లంచం తీసుకోగలుగుతాడా అనే ప్రశ్న తలెత్తుతోంది. వార్డు సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న ఈశ్వర్‌ను వెహికల్ డిపోలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి ఏఈగా నియమించారు. అతనిపై గతంలో ఎలాంటి ఆరోపణలు లేవు. ఉన్నతాధికారులు చెప్పింది మాత్రమే చేస్తాడన్న పేరు ఉంది. అలాంటి వ్యక్తిని ఇరికించి అసలు సూత్రధారి తప్పించుకున్నాడని వెహికల్ డిపో ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు.

ఏసీబీ వలలో అవినీతి అధికారి

రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వెహికల్ డిపో ఇన్‌చార్జి ఏఈ

- 6లో..

పెనమలూరు తెరపైకి కొత్త పేర్లు

పరిశీలనలో ఆలపాటి రాజా, దేవినేని చందు

- మైలవరంపై వీడిన సస్పెన్స్
- వసంత కృష్ణ ప్రసాద్ పేరు ప్రకటన లాంఛనమే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) పెనమలూరు నియోజక వర్గం నుంచి బరిలోకి దిగే టీడీపీ అభ్యర్థి ఎవరన్న దానిపై ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. తాజాగా అభ్యర్థి ప్రకటనపై జాప్యం జరుగుతుండటంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బోడె ప్రసాద్‌కు ఈసారి అవకాశం కల్పించలేకపోతున్నామని పార్టీ అధినేత స్వయంగా తెలపడంతో ఇక్కడి నుంచి ఎవరు బరిలో దిగుతారన్న అంశంపై సస్పెన్స్ నెలకొంది. తాజాగా పెనమలూరు తెరపైకి తెనాలి నియోజకవర్గ టీడీపీ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేరు వచ్చింది. ఆయనతోపాటు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని చందు పేరునూ పరిశీలిస్తున్నట్టు సమాచారం. యువ ఓటర్లకు సంబంధించి పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించడంలో చందు చురుగ్గా ఉన్నారు. టీడీపీ యువనేత నారా లోకేశ్‌తోనూ ఆయనకు మంచి అనుబంధమే ఉంది. దీంతో పెనమలూరు టికెట్ తనకు కేటాయించాలని చందు పార్టీ పెద్దలను కోరుతున్నారు. ఇప్పటికే ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ రేసులో ఉన్నారు.



ఆలపాటి రాజా



దేవినేని చందు



వసంత కృష్ణప్రసాద్

ఈ ముగ్గురిలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సీనియర్ నాయకుడు. తెనాలి నియోజకవర్గం నుంచి బరిలో దిగాల్సిన ఆయన పొత్తులో భాగంగా తన స్థానాన్ని జనసేనకు త్యాగం చేశారు. ఆ స్థానం నుంచి నాదెండ్ల మనోహర్ బరిలోకి దిగుతున్నారు. దీంతో ఆలపాటిని ఏదో ఒక స్థానం నుంచి బరిలో నిలపాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పెనమలూరు సీటు ఈ ముగ్గురు నేతల్లో ఎవరిని వరిస్తుందో అన్న విషయం రెండుమూడు రోజుల్లో తేలిపోనుంది.

వసంతకు లైన్ క్లియర్

మైలవరం నుంచి వసంత కృష్ణప్రసాద్‌కు లైన్ క్లియర్ అయినట్టేనని సమాచారం. ఈ మేరకు పార్టీ పెద్దలకు ఆయనకు సమాచారం ఇచ్చారు. కృష్ణప్రసాద్ పేరు ప్రకటించడం లాంఛనమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వసంత ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తూ టీడీపీ నాయకులను కలుస్తూ ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించిన తర్వాత దేవినేని ఉమాతో భేటీ అవ్వాలని వసంత భావిస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు కలిస్తే మైలవరంలో టీడీపీ గెలుపు నల్లేరు మీద నడకేనని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.



పదో తరగతి పరీక్షలు ఇలా ప్రారంభమయ్యాయో లేదో 1 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు అలా ఒంటిపూట బడులు మొదలైపోయాయి. శుక్రవారం పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రకటించగానే.. సీతానగరంలోని ఓ స్కూల్ నుంచి ఆనందంతో ఎగురుకుంటూ వస్తున్న ప్రైమరీ స్కూల్ విద్యార్థులు.

దుర్గమ్మ దర్శన టికెట్లు రీసైక్లింగ్

ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు

- 6లో..

రూ.8 లక్షలు స్వాధీనం

గరికపాడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

కోడ్ ఉల్లంఘనా..!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) బృందాలు రంగంలోకి దిగాయి. ఈ బృందాల కన్నుగప్పి ఎక్కడైనా ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తుంటే ఎంసీసీ బృందాల దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను జాతీయ, రాష్ట్రస్థాయిలో రోజూ సమీక్షిస్తారు. కాబట్టి మోడల్ కోడ్ ఉల్లంఘనలను ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఈ ఫిర్యాదు చేయొచ్చు. 22 భాషలకు ఇది సహకరిస్తుంది. కాల్ చేసేటపుడు మీ భాషను ఎంచుకోమని చెబుతుంది. ఇది కేవలం ఫిర్యాదులకే కాదు. దరఖాస్తులకు సంబంధించిన విజ్ఞప్తులు కూడా పెట్టుకోవచ్చు. ఓటరు లిస్టులో మీ పేరు ఉందో లేదో చూసుకోవచ్చు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (మంగళ)
సహర్ (ఉదయం) : 5-00 (బుధ)



కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం


గవర్నర్‌పేటలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

- కృష్ణాలో 95.07 శాతం హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఉన్నతాధికారులు

మచిలీపట్నం టౌన్/కృష్ణలంక, మార్చి 18 : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎక్కడా ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. కృష్ణాజిల్లాలో 151 పరీక్షా కేంద్రాల్లో 22615 మంది విద్యార్థులకు 21499 మంది పరీక్షకు హాజరయ్యారు. 95.07శాతం నమోదైంది. జేసీ గీతాంజలి మచిలీపట్నం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్, నిర్మలా హైస్కూల్‌ను సందర్శించారు. ఆమె వెంట డీఈవో తాహెరాసుల్తానా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, గట్టిపోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహించామన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ దిల్లీరావు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సోమవారం ఉదయం గవర్నరుపేటలోని చుండూరు వెంకటరెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్‌ఫోన్లు, ఏవిధమైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తీసుకురాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు, అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా 178 కేంద్రాల్లో ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.


సాయిబాబా పాదాలకు నమస్కరిస్తున్న విద్యార్థులు

హై లైఫ్ ఎగ్జిబిషన్



విజయవాడ నగర ప్రజలకు అందుబాటులో వరుణ్ నోవాటెల్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో హైలైఫ్ ఎగ్జిబిషన్ (జ్యూయలరీ, బ్రైడల్ కలెక్షన్, ఫ్యాషన్ డిజైన్లు) సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీతార తేజస్వి మాదివాడ, సంస్థ నిర్వాహకులతో కలిసి జ్యోతి వెలిగించి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.


కేశినేని శివనాథ్, సౌమ్య సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ!

- కేశినేని చిన్ని సమక్షంలో భారీగా చేరికలు

విద్యాధరపురం/నందిగామ, మార్చి 18 : ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతోందని విజయవాడ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. సోమవారం గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నందిగామ వైసీపీ కౌన్సిలర్‌లు, నాయకులు, విజయవాడ 7వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం చిన్ని మాట్లాడుతూ, నందిగామ మునిసిపాలిటీలో వలసల పర్వం ప్రారంభమైందన్నారు. మే13న జరగనున్న పోలింగ్‌తో తాడేపల్లి ప్యాలెస్ గోడలు బద్దలవుతాయని స్పష్టం చేశారు. చిలకలూరిపేట సభతోనే ప్యాలెస్‌లో పిల్లికి ముచ్చెమటలు పట్టాయని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లాలో జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతుందని చెప్పారు. కౌన్సిలర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న మొండితోక బ్రదర్స్‌కు పతనం మొదలైందని, నందిగామ మునిసిపాలిటీని త్వరలో టీడీపీ కైవసం చేసుకుంటుందన్నారు. 80శాతం వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి స్వచ్ఛందంగా రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో 4వ వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గద్దె రమేశ్, 13వ వార్డు కౌన్సిలర్ గద్దె శేషుకుమారి, మారం సత్యవతి, 13వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ గద్దె నరసింహరావులతో పాటు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. సౌమ్య మాట్లాడుతూ, నందిగామలో ఈ పరిణామం ఒక సంచలనమని పేర్కొన్నారు. టీడీపీలో చేరిన కౌన్సిలర్‌లకు, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు కోగంటి బాబు, రాము, కాకర్ల లక్ష్మీనారాయణ, శాకమూరి స్వర్ణలత, కామసాని సత్యవతి, మండవ కృష్ణకుమారి, ఏచూరి రత్నకుమారి, కత్తురోజ్ శ్రీనివాసాచారి, శాకమూరి వంశీధర్, షేక్ రాజా తదితరులు పాల్గొన్నారు. విజయవాడ 7వ డివిజన్ వైసీపీ నుంచి సొంగా సంజయ్ వర్మ ఆధ్వర్యంలో పెంటు అనీల్‌కుమార్, కిమ్మం దుర్గాభవాని, వేణుగోపాల్, పోలేటి రవితేజ, దరిశినపు రమేష్‌లతో పాటు పదుల సంఖ్యలో పార్టీలో చేరారు.

కేశినేని చిన్ని మంత్రాంగం..

నందిగామ నియోజకవర్గంపై పూర్తిస్థాయి దృష్టి సారించిన కేశినేని చిన్ని పట్టణంతో పాటు పలు గ్రామాలలో వైసీపీ పట్ల అంతృప్తితో ఉన్న నేతలను గుర్తించి టీడీపీలో చేరుస్తున్నారు. చాపక్రింద నీరులా కేశినేని చిన్ని, తంగిరాల సౌమ్యలు వైసీపీ అసంతృప్తిని క్యాష్ చేసుకుంటున్నారు. వైసీపీ కౌన్సిలర్లతో టచ్‌లోకి వెళ్లిన చిన్ని ఆ పార్టీని కోలుకోలేని దెబ్బతీశారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు చిన్ని బృందంతో టచ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి బలమైన నేతలను తమ వైపు తిప్పుకున్న చిన్ని, సౌమ్యలు రానున్న రోజుల్లో వైసీపీని దెబ్బకొట్టే వ్యూహంతో ఉన్నట్టు సమాచారం. అరవై శాతం టీడీపీ కేడర్‌ను వైసీపీలోకి చేరుస్తానన్న కేశినేని నాని వ్యాఖ్యలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చిన్ని అదేస్థాయిలో వైసీపీని ఖాళీ చేస్తాడంటూ టీడీపీ నాయకులు చెప్పుకొస్తున్నారు.

ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టిన జగన్ : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, మార్చి 18 : చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభ విజయవంతం కావడంతో వైసీపీ పాలన పట్ల ప్రజలకు ఉన్న వ్యతిరేకత తేలిపోయిందని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ కార్యాలయం, రైతు బజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలల ఆస్తులను తనఖా పెట్టిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కొనకళ్ల ఎద్దేవా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం కేంద్రం సహకారంతో 72 శాతం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయగా.. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు పనులను కొనసాగించలేదన్నారు. వైసీపీ పాలన అంతా ఆర్థిక దుర్వినియోగం, అవినీతి కార్యక్రమాలకు మారుపేరుగా మారిందన్నారు. ప్రజాగళంసభకు లక్షల్లో జనం వచ్చి వైసీపీ ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకతను మరోసారి చాటి చెప్పారన్నారు.

గుడివాడకు రెండు నెలల్లో విముక్తి : వెనిగండ్ల

గుడ్లవల్లేరు, మార్చి 18 : అభివృద్ధికి దూరమైన గుడివాడ నియోజకవర్గానికి మరో రెండు నెలల్లో విముక్తి కలగనుందని, కూటమి ప్రభుత్వం రాగానే ప్రజావసరాలను తీర్చే బాధ్యత తమదని టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు మండలం కూరాడగ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో కాపీలను పంపిణీ చేశారు. రాబోయేది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. అనంతరం లాక్‌డౌన్ నుంచి ప్రవహించే పంటకాల్వలో వ్యర్థాలతో నిండిపోవడంతో పరిశీలించిన రాము సెల్ఫీ చాలెంజ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, వల్లభనేని బాబూరావు, గుడివాడ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కళ్యాణపు నవాబు, బాసా శ్రీరామచంద్రమూర్తి, పులిరమేష్, ప్రసాద్, శీరం రమేష్, సాయిన పుష్పావతి, జంగం మోహనరావు, సాయిన బాబూరావు, కృష్ణారావు, ఆకుల శివయ్య, సమ్మెట సాంబయ్య, గోపాల్, నాని, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వ్యర్థాలతో పూడిపోయిన పంటకాల్వను పరిశీలిస్తున్న వెనిగండ్ల రాము


పోతిన మహేశ్‌కు టికెట్ కోరుతూ నిరసన తెలుపుతున్న జనసేన నేతలు

పోతినకు టికెట్ కోరుతూ కార్యకర్తల నిరసన

వన్‌టౌన్ : జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్‌కు సీటు కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని జనసేన యువనాయకులు ప్రకటించారు. మహేశ్‌కు టికెట్ ఇవ్వకపోవడంపై సోమవారం జనసేన యువత ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. నాయకులు, ముస్లిం మహిళలు మహేశ్‌కు టికెట్ ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తపేట నుంచి సామారంగం చౌక్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు, పోలీసు కమిషనర్ రాణా

పటిష్ఠ సమన్వయానికి కమాండ్ కంట్రోల్

- ఎన్నికల విధులపై అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు సమీక్ష

కృష్ణలంక, మార్చి 18 : ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని (ఐసీసీసీ) ఏర్పాటు చేయడం జరిగిందని, అధికారులు బృంద స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ దిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, పోలీస్ కమిషనర్ కాంతి రాణాతో కలిసి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం కార్యకలాపాలను పరిశీలించారు. సీ-విజిల్, కాల్‌సెంటర్, ఎన్నికల వ్యయ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్), ఎంసీసీ, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ తదితర విభాగాల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఫ్లయింగ్‌స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్‌స్క్వాడ్స్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, స్వీప్ కార్యక్రమాలు తదితరాల మధ్య పటిష్ఠ సమన్వయ సాధనకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం కీలకమన్నారు. సీ విజిల్, నేషనల్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ సిస్టమ్ (ఎన్‌జీఆర్ఎస్), 1950 తదితర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడం ఎంత ముఖ్యమో సరైన విధంగా నివేదికల్లో పొందుపరిచి ఏరోజుకారోజు సమర్పించడం ముఖ్యమన్నారు. క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు అనుసంధానమవుతూ ఖచ్చితమైన నివేదికలు రూపొందించాలన్నారు. విధుల నిర్వహణలో వేగంతో పాటు ఖచ్చితత్వం కూడా ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్.నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు వున్నారు.

పెయిడ్ ఆర్టికల్స్‌పై నిఘా పెట్టండి

ప్రచార మాధ్యమాల్లో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా పెట్టాలని, ఈ విషయంలో ప్రచార మాధ్యమాల ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిల్లీరావు అన్నారు. ప్రచార మాధ్యమాలు అనుసరించాల్సిన విధివిధానాలపై జేసీ పిసంపత్‌కుమార్‌తో కలిసి సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను మీడియా పాటించాలన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని మాధ్యమాల ప్రతినిధులు సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి పెయిడ్ న్యూస్ అంశాన్ని సునిశితంగా పరిశీలించాలన్నారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) పటిష్ఠ పర్యవేక్షణతో పనిచేయాలన్నారు. నిర్దేశించిన రేట్ కార్డు ప్రకారం పెయిడ్ న్యూస్‌ను గణించి, ఆ వ్యయాన్ని సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. పెయిడ్ న్యూస్‌గా నిర్ధారణ అయిన ఆర్టికల్స్‌కు సంబంధించి రేటు కార్డు ప్రకారం ఖరారు చేయబడిన సొమ్మును సంబంధిత అభ్యర్థికి అనుమతించి వ్యయం కింద జమచేయడం జరుగుతుందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఎఫ్ఎం, కేబుల్‌నెట్‌వర్క్‌లో పెయిడ్ న్యూస్ విషయంలో సంబంధిత ఆర్వో నోటీసులు జారీ చేస్తారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ పరిధిపై కలెక్టర్ మాట్లాడుతూ, ప్రింట్ మీడియాలో ప్రకటనలకు ముందస్తుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి అవసరం లేదని, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్, బల్క్ ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ యాడ్స్‌కు ఎంసీఎంసీ అనుమతి అవసరమని వివరించారు. అనుమతిపొందిన ఆర్డరు కాపీ నెంబరును కూడా సంబంధిత ప్రకటనపై సూచించాల్సి వుంటుందన్నారు. ఈ విషయాన్ని అన్ని ప్రచార మాధ్యమాలు తప్పనిసరిగా గమనించాలని ఆయన కోరారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రకటనలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పరిగణిస్తూ చట్టం ప్రకారం తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ దిల్లీరావు తెలిపారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమాచారశాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్

చట్టసభలకు ఎర్రజెండా పార్టీలను పంపండి

- రెండు జిల్లాల జనరల్ బాడీ సమావేశంలో సీపీఐ రామకృష్ణ

భవానీపురం, మార్చి 18 : ప్రజా సమస్యలపై నిత్యం గొంతెత్తే ఎర్రజెండాల పార్టీల ప్రతినిధులను చట్టసభలకు పంపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సితార ప్రాంతంలోని ఓ కన్వెన్షన్ హాల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సీపీఐ సమితుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ లోక్‌సభ,రాజ్యసభల్లో వైసీపీ ఎంపీలు అన్ని అంశాల్లో మోదీకి మద్దతు ఇచ్చారని, ఇప్పుడు పొత్తుతో మైండ్‌గేమ్‌ను ఏపీలో ఆడుతున్నారన్నారు. ప్రాంతీయ పార్టీలను మింగేయడమే బీజేపీ అజెండా ఉందన్నారు. సీఎం జగన్‌కు ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేదని రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో 49 సీట్లు రెడ్డి సామాజిక వర్గానికి రెడ్డి కులస్తులు జీవిత భాగస్వామిగా ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీలకు మాత్రమే సీట్లు ఇచ్చారని దీనినే జగన్ సామాజిక న్యాయం పాటిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. విజయవాడ పశ్చిమలో సీపీఐ గెలుపు ఖాయమని, రాష్ట్రంలో బీజేపీ ఓట్లు వేయరని రామకృష్ణ స్పష్టం చేశారు. పశ్చిమ నుంచి అభ్యర్థిని నిలుపుతున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లి విల్సన్ మాట్లాడుతూ విజయవాడ పశ్చిమం నుంచి 2004లో ఉన్న వామపక్షాల కూటమి ఈ సారి పోటీ చేస్తే విజయం సాధించవచ్చునన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి టి. తాతయ్యలు మాట్లాడారు.జాతీయకార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, పంచదార్ల దుర్గాంబ, సీపీఐ సీనియర్ నాయకులు కొరగంజి జగన్‌లు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సార్వత్రిక విద్యా పీఠం పరీక్షలకు 93 శాతం హాజరు

- టెన్త్ పరీక్ష రాస్తూ పట్టుబడిన విద్యార్థి

వన్‌టౌన్, మార్చి 18 : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక విద్యాపీఠం టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు టెన్త్‌లో మాతృభాషలలో, ఇంటర్‌లో హిందీ, తెలుగు, ఉర్దులలో పరీక్షలు జరిగాయి. సింగ్‌నగర్‌లోని చైతన్య స్కూల్ సెంటర్‌లో పదో తరగతి పరీక్ష రాస్తున్న నకిలీ విద్యార్థిని ఇన్విజిలేటర్ పట్టుకున్నారు అసలు విద్యార్థి సీతారామయ్యకు బదులు మరో విద్యార్థి జోసఫ్ పరీక్ష రాస్తుండగా అధికారులు గుర్తించి జోసఫ్‌పై పోలీసులకు పిర్యాదు చేశారు. సీతారామయ్యను డిబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా టెన్త్, ఇంటర్‌లో మొత్తం 4862 మందికి గాను 306 మంది హాజరు కాలేదు 93.4 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీసీ బాబూరావు తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

- కేశినేని చిన్ని



పాయకాపురం, మార్చి 18 : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కేశినేని చిన్ని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేశినేని చిన్ని ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైకో జగన్ పాలన నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకురావాలంటే మళ్లీ నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమా, విశ్వబ్రాహ్మణ సామాజిక నేతలు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శన టికెట్లు రీసైక్లింగ్

- రోజుకు రూ. లక్ష పైనే స్వాహా
- ఈవో తనిఖీల్లో వెలుగుచూసిన వైనం
- ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు

వన్‌టౌన్, మార్చి18 : దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఉద్యోగుల చేతివాటం తగ్గడం లేదు. గతంలోనూ పలుమార్లు దర్శన టికెట్ల రీసైక్లింగ్ విషయంలో ఉద్యోగులను తప్పించిన వైనం తెలిసిందే. తాజాగా ఈవో తనిఖీల్లో దర్శన టికెట్లు రీసైకిలింగ్ చేసినట్టు గుర్తించారు. దేవస్థానంలో అమ్మవారి అంతరాలయ దర్శనానికి రూ.500, ముఖద్వార దర్శనానికి రూ.300, సాధారణ దర్శనానికి రూ.100 చొప్పున టికెట్ల రుసుములు ఉన్నాయి. దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకోవడానికి శుక్ర, ఆదివారాలు, పర్వదినాలలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఇదే అదనుగా ఉద్యోగులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న వైనం బయటపడింది. రెండురోజుల క్రితం గర్భాలయం వెనుకవైపున టికెట్ కౌంటర్‌లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆదినారాయణ, శర్మలు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీఐపీ దర్శనానికి ఐదుగురు భక్తులు రూ.500 టికెట్లను కొనుగోలు చేశారు. అయితే స్కానింగ్ చేయకుండా డైరెక్ట్‌గా ఆలయంలోకి తీసుకుని వెళ్లారు. ఆ సమయంలో అంతరాలయం వద్ద క్యూలను నియంత్రిస్తున్న ఈవో వారిని గమనించి వారి వద్ద దర్శన టికెట్‌లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈక్రమంలో దర్శన టికెట్లను స్కానింగ్ చేయకపోవడాన్ని ఆయన గుర్తించారు. అయితే అంతరాలయానికి వచ్చే గేటువద్ద సిబ్బంది టికెట్‌లను పరిశీలించి కౌంటర్ ఫాయిల్ కట్ చేయాల్సి ఉంటుంది. కానీ కౌంటర్ ఫాయిల్ కట్ చేయకుండా టికెట్లను నేరుగా మళ్లీ కౌంటర్‌లోకి పంపించిన వైనాన్ని విచారణలో ఈవో గుర్తించారు. దీంతో మొత్తం ఆరాతీయగా చాలా పర్యాయాలు రద్దీ ఉన్న సమయంలో ఇలా జరుగుతోందని గుర్తించి ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనను ఆలయ అధికారులు గోప్యంగా ఉంచారు. రోజుకు కనీసం లక్ష రూపాయలకు పైగా అమ్మవారి సొమ్ము అక్రమ మార్గంలో చేతివాటం ప్రదర్శిస్తున్న ఉద్యోగుల జేబులలోకి వెళుతున్నట్టు గుర్తించారు. స్కానింగ్ పాయింట్ వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఈవో రామారావు ఆదేశాలు జారీ చేశారు. ఈఈ రమాదేవి క్షేత్రస్థాయిలో పరిశీలించి సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.



ఏసీబీ వలలో అవినీతి అధికారి

- రూ.50 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం



చిట్టినగర్, మార్చి 18 : నగరపాలక సంస్థ హెహికల్ డిపోకు చెందిన ఇన్‌చార్జి ఏఈ ఈశ్వర్ కుమార్ సోమవారం రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. న్యూ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన షేక్ సద్దాం హుస్సేన్.. ఏఎస్ ఎకో మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ తరపున నగరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించే కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. వర్క్ ఆర్డర్ ప్రకారం అగ్రిమెంట్‌ను ప్రాసెస్ చేయడానికి హెహికల్ డిపో ఇన్‌చార్జి ఈశ్వర్ కుమార్‌ను సంప్రదించగా, రూ.50 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులు సోమవారం ఈశ్వర్ కుమార్ తన కార్యాలయంలో సద్దాం నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ బంగార్రాజు సిబ్బందితో ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారిని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

కీచక తండ్రికి జీవితఖైదు

- పోక్సో కోర్టు న్యాయాధికారి సంచలన తీర్పు


విజయవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కళ్ల నిండా కామం నింపుకుని కన్న కుమార్తెను గర్భవతిని చేసిన తండ్రికి న్యాయస్థానం యావజ్జీవ ఖైదు విధించింది. దీనికి సంబంధించిన తీర్పును సోమవారం వెల్లడించింది. విజయవాడ కొత్తపేటకు చెందిన 36 సంవత్సరాల వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 15 ఏళ్ల వయసు ఉన్న పెద్ద కుమార్తె సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. మిగిలిన ఇద్దరు పిల్లలు ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. పెద్ద కుమార్తెకు వాంతులు కావడం, నీరసంగా ఉండడాన్ని తల్లి గమనించింది. గడచిన ఏడాది జూలై రెండున ఆమెను తల్లి సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి ఆమె గర్భవతి అని నిర్ధారించారు. ఆమెను కుటుంబంలోని పెద్దలు ప్రశ్నించడంతో ఆ బాలిక అసలు నిజం చెప్పింది. తండ్రి తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని, ఈ విషయం బయట ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడని చెప్పింది. పెద్దలు అంతా కలిసి బాలిక తండ్రిని నిలదీశారు. దీనికి అతడు "నా చెట్టు కాయను నేను తినడంతో తప్పేంటి" అని వాదించారు. దీనిపై బాలిక తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును విచారించిన పోక్సో కోర్టు న్యాయాధికారి డాక్టర్ రజని నిందితుడికి యావజ్జీవ ఖైదు, రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పును ఇచ్చారు. ఇది కాకుండా మరో రూ.5 లక్షల పరిహారం బాధితురాలికి అందేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థను ఆదేశించారు. కేసును ప్రాసిక్యూషన్స్ తరపున గుజ్జుల నాగిరెడ్డి వాదించారు.


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న రంగన్నగూడెం సర్పంచ్ రంగామణి తదితరులు

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

- డీఆర్వోకు సర్పంచ్ వినతి

మచిలీపట్నం టౌన్, మార్చి 18 : బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామశివారు సింగన్నగూడెంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ కార్యదర్శి ఆల కల్యాణి ప్రోద్బలంతో వైసీపీ నాయకులు సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించారని డీఆర్వో చంద్రశేఖర్‌కు సర్పంచ్ కుసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ వి.లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కోడ్‌ను ఉల్లంఘించిన పంచాయతీ కార్యదర్శి, వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వోను కలిసిన వారిలో గన్నవరం నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, మొవ్వ శ్రీనివాసరావు, సింగన్నగూడెం మరీదు కృష్ణకుమారి ఉన్నారు.


ఎన్టీఆర్ జిల్లా బాధ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న టీజీ వెంకటేశ్

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి

- టీజీ వెంకటేశ్

వత్సవాయి : ఆర్యవైశ్యులు వ్యాపారరంగాల్లోనే కాకుండా అన్ని రంగాల్లోను ముందుండాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. వత్సవాయిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అంబికా కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావులతో కలిసి పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితమైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా బొగ్గవరపు రాజారావు ఎన్నికయ్యారని ఆయన సేవా నిరతిని ప్రశంసించారు. పెనుగొండ సుబ్బారాయుడు, జయంతి వెంకటేశ్వర్లు, కొప్పురావూరి రజిని తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	108, 117, 128
చికెన్ విత్ స్కిన్	202
చికెన్ స్కిన్‌లెస్	212

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

టెన్త్ పరీక్షా కేంద్రాల్లో ఏసీపీ ఆకస్మిక తనిఖీ



సత్యనారాయణపురం, మార్చి 18: పదవ తరగతి పరీక్ష సందర్భంగా సోమవారం సత్యనారాయణపురంలోని పలు పరీక్షా కేంద్రాలను ఏసీపీ ప్రసాద్, సీఐ వెంకట నారాయణలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని పది పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పోలీసు బందోబస్తును తనిఖీ చేసి భద్రతా పరమైన సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అందరూ సహకరించాలన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించండి

బూత్ కన్వీనర్లకు గద్దె దిశానిర్దేశం

పటమట, మార్చి 18 : టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను నిరంతరం ప్రజల్లోకి తిరుగుతూ బూత్ కన్వీనర్లు వివరించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దిశానిర్దేశం చేశారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో 2, 8, 17, 18, 19 డివిజన్ల బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జులతో ఎమ్మెల్యే సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇటీవల ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. ప్రస్తుతం జగన్ ఇచ్చే పథకాలకు, టీడీపీ అధికారంలోకి వస్తే ఇచ్చే సంక్షేమ పథకాల వ్యత్యాసాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏ బూత్‌కు ఆ బూత్ కన్వీనర్‌దే పూర్తి బాధ్యత అన్నారు. ప్రతీ డివిజన్‌లో జనసేన, బీజేపీ శ్రేణులను కూడా పూర్తిస్థాయిలో కలుపుకుని ముందుకు సాగాలన్నారు. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిచూసుకోవాలని తెలిపారు. బొప్పన భవకుమార్, ముమ్మనేని ప్రసాద్, సిద్ధం నాగేంద్రరెడ్డి, చెన్నుపాటి ఉషారాణి, సొంగా సంజయ్‌శర్మ, రాయి రంగమ్మ, గోగుల రమేష్, భాగం సాయి ప్రసాద్, జనసేన నాయకులు హరిప్రసాద్‌లు పాల్గొన్నారు.



బూత్ కన్వీనర్ల సమావేశంలో గద్దె రామ్మోహన్

పోస్టర్ ఆవిష్కరణ

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత క్రిస్టియన్, మైనార్టీలకు అందించే సూపర్‌సిక్స్ పథకాలతో రూపొందించిన పోస్టర్‌ను సోమవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌లో క్రిస్టియన్, మైనార్టీలకు అందించే పథకాలను ప్రతీ ఇంటికి తీసుకువెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. క్రిస్టియన్ సెల్ నాయకులు కామా దేవరాజ్, బొప్పన భవకుమార్, ముమ్మనేని ప్రసాద్, సిద్ధం నాగేంద్రరెడ్డి, దాసరి గాబ్రియేల్ పాల్గొన్నారు.

సుబ్బారావు కాలనీలో ఆత్మీయ సమావేశం

భారతీనగర్: 4వ డివిజన్‌లోని సుబ్బారావు కాలనీలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్థానికులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె , జిల్లా మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్ పాల్గొన్నారు. గద్దె మాట్లాడుతూ అమరావతి రాజధాని వద్దని పార్టీలో పోటీ చేసేవారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ రాష్ట్రం కోసం కష్టపడిన చంద్రబాబుకు జరిగిన అవమానం ప్రతిఫలంగా మన చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, టీడీపీ నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, శశికళ, రామచంద్రరావు, వెలగపూడి సుబ్బారావు, రెడ్డి సూర్యారావు జాలా రాజారావు, పాల్గొన్నారు.

ఆంధ్రుల ఉజ్వల భవిష్యత్ టీడీపీతోనే

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, మార్చి 18 : ఐదు కోట్ల ఆంధ్రుల ఉజ్వల భవిష్యత్ కోసం వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అందరూ ఓట్లు వేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పిలుపునిచ్చారు. 10వ డివిజన్ పరిధిలో మారుతీ కో-ఆపరేటివ్ కాలనీలో సోమవారం గద్దె అనురాధ, ఆమె తనయుడు రాజేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వారు ప్రజలకు వివరించారు. టీడీపీ-జనసేన-బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మహిళలు, యువత అంతా చంద్రబాబు నాయుడుకు అండగా ఉండాలన్నారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పొన్నం శ్రీనివాస్, మండవ నాగేశ్వరరావు, యలమంచిలి శ్రీనివాస్, సీహెచ్.వాసు, బొర్రా రవీంద్రబాబు పాల్గొన్నారు.


ప్రచారంలో గద్దె అనురాధ, దేవినేని అపర్ణ

ఊర్మిళానగర్ వద్ద అన్న క్యాంటీన్

భవానీపురం, మార్చి 18 : టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో 43వ డివిజన్ ఊర్మిళానగర్ పార్కు వద్ద సోమవారం మొబైల్ అన్నక్యాంటీన్ ద్వారా పేద కార్మికులకు అన్నదానం నిర్వహించారు. 43వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన రాంబాబు, పశ్చిమ తెలుగుయువత అధ్యక్షుడు ఆర్. మాధవలు ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చిన శివనాథ్‌ను ప్రజలందరూ ఆదరించాలన్నారు. ఐటీడీపీ కో-ఆర్డినేటర్ గూడేల మహేష్, బత్తుల వెంకటేశ్వరావు, కొండ, అచ్చిరెడ్డి, కాకర్ల కోటి, తెల్లగడ్ల దుర్గారావు, మోడీ రాజు, వేల్పుల నరసింహారావు, మైలపల్లి అప్పన్న పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న రాంబాబు, మాధవ

వినియోగదారులకు హక్కులపై అవగాహన ఉండాలి

వైవీ రావు

వన్‌టౌన్, మార్చి 18: వినియోగదారులకు తమ హక్కులపై అవగాహన ఉండాలని వైవీ రావు అసోసియేట్స్ అధినేత వైవీ రావు అన్నారు. కేబీఎన్ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం వినియోగదారులకు అండగా ఉంటుందన్నారు. వీటిపై ముఖ్యంగా విద్యార్థులకు, ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. హక్కులు, బాధ్యతలు, వివాద పరిష్కార మార్గాలు, పాలనా పరిధి, నష్టపరిహారాలు, చట్టపర ఉపశమనాలను వివరించారు. క్లబ్ కన్వీనర్ విజయబాబు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎన్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వైవీ రావు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

మొగల్రాజపురం, మార్చి 18: విద్యుత్ మరమ్మతులు మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు మొగల్రాజపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ సబ్ స్టేషన్, 11కేవీ జవ్వులచెట్టు ఫీడర్ పరిధిలో మధుగార్డెన్ ఏరియా, ఏఎస్ రామారావు రోడ్డు, శాంతి నగర్, జవ్వులచెట్టుసెంటర్, ఉడ్‌పేట, బాడవ పేట, వాటర్ ట్యాంకు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పొట్టి శ్రీరాములు విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

వన్‌టౌన్, మార్చి 18: కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ నెల 12 నుంచి 16 వరకు కళాశాల సైన్స్, హ్యూమనిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఏ.రమాదేవి ఆధ్వర్యంలో కే.భానుచందర్ పర్యవేక్షణలో బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం, హిందుస్థాన్ ఏరోనాటికల్, పరిశ్రమలను సందర్శించారు. 2017లో ఇస్రో ఛైర్మన్ కర్త కుమార్ ఏర్పాటు చేసిన స్పేస్ టెక్నాలజీ గ్యాలరీని సందర్శించి వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సెన్సార్ స్క్రీన్ ముందు విద్యార్థులు నిలబడగానే వాళ్లు ధరించిన వస్తువుల పేర్లను, వాటి వివరాలను తెలియజేసే ప్రక్రియ ఎంతో ఆకట్టుకుంది. ఇండస్ట్రియల్ విజిట్ చేసిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ పరుచూరి లక్ష్మణస్వామి అభినందించారు. ప్రిన్సిపాల్ జే.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రానున్న రోజులలో తమ విద్యార్థులు నూతన ఆవిష్కరణలలో ముందుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ టి.శాంతిశ్రీ, డాక్టర్ పి.నరేష్, బి.అనిల్‌కుమార్, వి.నాగమల్లిక, పూర్ణశర్మ తదితరులు విద్యార్థుల విజిట్‌లో పాల్గొన్నారు.


విద్యార్థుల పారిశ్రామిక, సాంకేతిక పర్యటన

కన్నుల పండువగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చిట్టినగర్, మార్చి 18: ఆంజనేయవాగు వడ్డెరపేటలో సోమవారం కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. పేటకు చెందిన వారంతా కుటుంబ సమేతంగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారి విగ్రహాన్ని తీసుకొని ఊరేగింపుగా కృష్ణానదికి వెళ్లి జలాలను తీసుకొచ్చి పూజలు చేశారు. 1008 మంది మహిళలు కలశాలతో కృష్ణాజలాలను తీసుకొచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, వివిధ సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ పాల్గొని పూజలు చేశారు.


ఊరేగింపుగా కృష్ణా జలాలను తీసుకువస్తున్న పేట యువకులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాయకాపురం, మార్చి 18 : చికిత్స పొందుతూ ఓ మహిళ సోమవారం మృతి చెందింది. వివరాల ప్రకారం మోహనరావు హోటల్ సెంటర్ ప్రాంతానికి చెందిన లిల్లి(22), భర్త సంతోష్ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. గత మూడు రోజుల క్రితం లిల్లి పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా దాడి చేసి కొట్టారని ఫిర్యాదు

వన్‌టౌన్, మార్చి 18: అకారణంగా ముగ్గురు వ్యక్తులు తనను, తన స్నేహితుడిపై దాడి చేసి కొట్టినట్లు కృష్ణలంక వల్లూరివారి వీధికి చెందిన చెత్త వ్యాపారి బోయిన ధనుంజయ్ కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం మెట్లబజార్ వాసవీ కల్యాణమండపం వద్ద తాను, తన స్నేహితుడు కృష్ణారెడ్డి కలిసి మాట్లాడుతుండగా క్రాంతి, శశి(నేపాల్), ఏసు అను ముగ్గురు వ్యక్తులు వచ్చి తమతో అకారణంగా గొడవపడి దుర్భాషలాడారని, తమతో పాటు తమ నాయకుడు దేవినేని అవినాష్‌ను కూడా దుర్భాషలాడారని ధనుంజయ్ ఫిర్యాదు చేశారు. గొడవ ఎందుకని తాము వెళ్లిపోతుండగా మళ్లీ అటకాయించి చేతులతో కొట్టి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అకారణంగా గొడవపడిన ముగ్గురు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ స్టార్ ఆఫ్ ఇండియాకు నలంద విద్యార్థి


శ్రీనును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ

విజయవాడ స్పోర్ట్సు, మార్చి 18 : నలంద డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీబీఏ చదువుతున్న కె. శ్రీను ఈ నెల 10 నుంచి 14 వరకు బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో జరిగిన 68వ జూనియర్ నేషనల్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీలో సత్తా చాటాడు. జట్టులో అత్యుత్తమ ప్రదర్శనతో స్టార్ ఆఫ్ ఇండియాకు సెలక్టయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు. కె. శ్రీనును నలంద విద్యాసంస్థల చైర్మన్ అట్లూరి విజయ్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వరరావులు అభినందించారు.

ప్రజాగళం సభతో బులుగు బ్యాచ్ గుండెల్లో దడ

● టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి

విద్యాధరపురం, మార్చి 18: ప్రజాగళం సభతో గ్రాఫిక్ సభలతో బతికే బులుగు బ్యాచ్ గుండెల్లో గునపం దిగిందని టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం కేంద్రం నుంచి ఏం సాధించిందో సభలో మోదీ ప్రకటించారన్నారు. గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ఏం తెచ్చిందో చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఏం చేశాడో చెప్పాలని విభజన హామీలు, ప్రత్యేక హోదా గురించి అడుగుతున్న టిక్ టాక్ తిక్కల ఎంపీని అడుగుతున్నట్లు తెలిపారు. జగన్‌రెడ్డి అరాచక విధానాలు, దుర్మార్గపు పాలనతో అభివృద్ధి అడుగంటి పాతిక సంవత్సరాలు వెనుకకుపోయామన్నారు. మళ్లీ రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులు పెట్టాలంటే ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడడం అవశ్యమన్నారు. ఎన్‌డీఏ గద్దెనెక్కిన తక్షణమే అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు.

అజిత్‌సింగ్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్


స్ట్రీట్‌వాక్ చేస్తున్న డీసీపీ హరికృష్ణ

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 18 : మేమున్నాం.. ధైర్యంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోండి అంటూ నగర పోలీసు సిబ్బంది సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. డీసీపీ హరికృష్ణ 200 మంది సిబ్బందితో అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ వాక్ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ హరికృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే పోలీసు స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించామని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐలు గురుప్రకాష్, ఎన్. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లయోలలో పుస్తక సమీక్ష

భారతీనగర్, మార్చి 18: లయోల కళాశాలలో ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో ప్రముఖ రచయిత చేతన్ భగత్ రచించిన ది గర్ల్ ఇన్ రూమ్105 అనే పుస్తకంపై సోమవారం సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరీక్ష పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఫాదర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. పీజీ లైబ్రేరియన్ టి.రోజా మణి, సెక్రటరీ డాక్టర్ జి.ఎ. ప్రసాద్ రావు, చందన కావ్య, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మణరావు మృతి

చిట్టినగర్, మార్చి 18: 47వ డివిజన్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చొక్కర లక్ష్మణరావు (64) సోమవారం ఉదయం చిట్టినగర్ గూడెల రామువీధి ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. 0 మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ నాయకుడు కె. నాగుల్‌మీరా,నాగోతి రామారావు, సీపీఐ నాయకులు జీ. కోటేశ్వరరావు తదితరులు లక్ష్మణరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఆయన నివాసం నుంచి స్వర్గపురి వరకు అంతిమ యాత్ర కొనసాగుతుంది.


నివాళులర్పిస్తున్న బుద్దా వెంకన్న, టీడీపీ నాయకులు

కారు డ్రైవర్‌కు జైలు

గన్నవరం, మార్చి 18 : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు సోమవారం గన్నవరం 12వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జక్కులనెక్కలంకు చెందిన కాట్రు ఉమామహేశ్వరరావు 2019 సెప్టెంబరు 8న మరొకరితో కలసి విజయవాడ వైపు వెళుతున్నాడు. గూడవల్లి క్రాస్ అయ్యే సమయంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ఉమామహేశ్వరరావుకు తీవ్రగాయాలు అయ్యి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పర్రె శివప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా నేరం రుజువు కావటంతో గన్నవరం 12వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి నిందితుడికి ఆరు నెలల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వాహనాల తనిఖీ

కంకిపాడు, మార్చి 18 : ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం చేసింది. మండలంలోని వివిధ గ్రామాల్లో నియోజకవర్గం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కనకమహాలక్ష్మి పునాది పాడులో వాహనాలు విస్తృతంగా తనిఖీ చేశారు. పునాదిపాడు నుంచి విజయవాడ, గన్న వరం వైపు వెళ్లే వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఎక్కడికి వెళ్తున్నారు.. వాహ నాల డిక్కీ, డాష్ బోర్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కనక మహాలక్ష్మి మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో విస్తృతంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

పెనమలూరు, మార్చి 18 : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం తరపున ఏడురోజుల ప్రత్యేక శిబిరాన్ని సోమవారం నుంచి ప్రారంభించినట్టు ప్రోగ్రాం అధికారి కొల్లా నరేంద్ర తెలిపారు. తాడిగడపలో ప్రారంభమైన ఈ ప్రత్యేక శిబిరాన్ని జేఎన్‌టీయూ కాకినాడ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ శ్యాం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ, ప్రజలకు ఉప యోగపడేలా టెక్నాలజీని వాడాలని విద్యార్థులు వారి జ్ఞానాన్ని సమాజహి తం కోసం వాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మజానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ పాల్గొన్నారు.



అవును...
మేం విడిపోయాం!

శీతల్

'పెళ్లి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటుడు పృథ్వీరాజ్ ఆ తర్వాత కొన్ని సినిమాల్లో, సీరియల్స్‌లో నటించారు. మంచి నటుడిగా గుర్తింపు పొందిన పృథ్వీ వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే ఆయన తన మొదటి భార్య బీనాకు 2022లో విడాకులు ఇచ్చారు. ఆ తర్వాత వెంటనే శీతల్ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. పృథ్వీ కంటే వయసులో శీతల్ చాలా చిన్నది కావడంతో సోషల్ మీడియాలో అది వైరల్ అయింది. ఆ ప్రచారాన్ని నిజం చేస్తూ ఈ జంట కలసి దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేసింది. . వయసు రీత్యా తామిద్దరి మధ్య ఎంతో తేడా ఉన్నా, దీనికి అతీతమైన ప్రేమబంధం ఇద్దరిదీ అని వివరణ ఇచ్చారు పృథ్వీ, శీతల్. అయితే ఇంతలో ఏమైందో తెలియదు కానీ వారిద్దరూ విడిపోతున్నట్లు రూమర్స్ జోరుగా వినిపిస్తున్నాయి. శీతల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పృథ్వీరాజ్ ప్రపోజ్ చేసిన వీడియోను తొలిగించడం కూడా ఈ వదంతులకు బలాన్ని ఇచ్చాయి. తాజాగా తమ ప్రేమ వ్యవహారం గురించి శీతల్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో క్లారిటీ ఇచ్చారు. "ఈ మధ్య చాలా మంది నా జీవితంలో ఏం జరుగుతోందని ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. నా పరిస్థితిని ఏ మాత్రం అర్థం చేసుకోకుండా ఏవేవో ఊహాగానాలు ప్రచారం చేస్తున్నారు. అందరికీ చెప్పేదేంటంటే.. నేను, పృథ్వీరాజ్ పెళ్లి చేసుకోలేదు. కొన్నాళ్లు సహజీవనం చేశామంతే! మేము కలలు కన్న విధంగా మా బంధం ముందుకు సాగలేకపోయింది. అయితే, ఈ చిన్నపాటి బాంధవ్యంలో మేము ఎన్నో మధుర స్మృతులు పంచుకున్నాం. ఎన్నో సంతోష క్షణాలు కలసి అనుభవించాం. కొన్నివిషయాల్లో మా ఇద్దరి మధ్య సఖ్యత కుదరకపోవడంతో కొద్ది నెలల క్రితమే విడిపోయాం. జరిగిందేదో జరిగిపోయింది. ఇక నుంచైనా మా నిర్ణయాన్ని గౌరవిస్తూ.. మా పరిస్థితిని అర్థం చేసుకుని, వ్యక్తిగత గోప్యతకు ఎలాంటి భంగం కలిగించరని ఆశిస్తున్నాను" అని శీతల్ పేర్కొంది. అయితే, తన ఖాతాలో స్టోరీ పెట్టిన కొద్దిసేపటికే శీతల్ ఆ పోస్టును తొలగించడం గమనార్హం.

గోదావరి తీరంలో భీమునిపట్నం



కంచర్ల ఉపేంద్ర, అపర్ణాదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న '1920 భీమునిపట్నం' చిత్రం షూటింగ్ ప్రస్తుతం గోదావరి తీరంలో జరుగుతోంది. అవార్డు చిత్రాల దర్శకుడు నరసింహ నంది దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రాజమండ్రి, మునికొడవలి, పూడిపల్లి, దేవీ పట్నం, గండి పోచమ్మ గుడి ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'రామోజీ ఫిల్మ్ సిటీలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. ప్రస్తుతం గోదావరి తీరంలో షూటింగ్ జరుగుతోంది. సాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో సీతారామ్, సుజాత పాత్రల మధ్య నడిచే ప్రేమకథను దర్శకుడు అద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాగారు అందించే సంగీతం మా చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది.' అని చెప్పారు. సాతంత్ర్య పోరాట ఉద్యమ సమయంలో జరిగిన కొన్ని సంఘటలను ప్రేరణగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు నరసింహ నంది చెప్పారు. ఇందులో హీరో ఉపేంద్ర బ్రిటీష్ ప్రభుత్వ పోలీస్ అధికారి పాత్రను, హీరోయిన్ అపర్ణాదేవి సాతంత్ర్య సమరయోధుడి పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, ఫొటోగ్రఫీ: ఎస్.మురళీమోహనరెడ్డి, సహ నిర్మాతలు: కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత.



'ఓ మై లిల్లీ'

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ నెల 29న ఈ చిత్రం విడుదలవుతోంది. సోమవారం ఈ చిత్రం నుంచి థర్డ్ సింగిల్ 'ఓ మై లిల్లీ' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ "ఓ మై లిల్లీ పాట మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను. విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కావడంతో ఈ సినిమా మొదలైనప్పుడే ఎంతో బాధ్యత, ఒత్తిడి ఉందని అర్థమైంది. మీ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు చేసే సమయంలో ప్రేక్షకుల్లో సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. కానీ 'టిల్లు స్క్వేర్' పై ప్రేక్షకుల్లో ఎన్నో అంచనాలు ఉన్నాయి. అందుకే చాలా జాగ్రత్తగా, మొదటి భాగాన్ని మించేలా సినిమాని రూపొందించాం. టిల్లు పాత్ర అలాగే ఉంటుంది. కానీ కథ మాత్రం వేరేలా ఉంటుంది" అని చెప్పారు. కథానాయిక అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ "ఈ చిత్ర విడుదల కోసం మేము ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాం" అని అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "మొదటి భాగంలాగే, 'టిల్లు స్క్వేర్' కూడా యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పిస్తుంది" అని అన్నారు.

రామ్‌చరణ్ పుట్టిన రోజున
మగధీర



దర్శక దిగ్గజం రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన తొలి చిత్రం 'మగధీర'. గీతా ఆర్ట్స్ బేనరుపై అల్లు అరవింద్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ఘన విజయం సాధించి, వసూళ్ల పరంగా కొత్త రికార్డులు సృష్టించింది. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 26న 'మగధీర' చిత్రం మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. యర్రంశెట్టి రామారావు. అరిగెల కిశోర్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ 'తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్లలో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. 'మగధీర' ను రీ రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత అల్లు అరవింద్‌గారికి కృతజ్ఞతలు. ఈ సినిమాను మరో సారి హిట్ చేసి హీరో రామ్‌చరణ్‌కు బర్త్ డే గిఫ్ట్ ప్రేక్షకులు ఇవ్వాలని కోరుకుంటున్నాం' అన్నారు.

కొండా విజయ్‌కుమార్ 'అహం'



నితిన్ హీరోగా 'గుండెజారి గల్లంతయ్యిందే', నాగచైతన్య హీరోగా 'ఒక లైలా కోసం' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలు రూపొందించిన దర్శకుడు కొండా విజయ్ కుమార్ ప్రస్తుతం మరో భారీ చిత్రాన్ని రూపొందించే సన్నాహాల్లో ఉన్నారు. ఈ సినిమాకు 'అహం' అనే టైటిల్ నిర్ణయించారు. ఓ ప్రముఖ నిర్మాత తనయుడిని ఈ సినిమాతో హీరోగా పరిచయం చేయనున్నారని సమాచారం. అలాగే నటుడు శివాజీ ఇందులో విలన్‌గా నటిస్తారనీ, ఆయన లుక్ చాలా డిఫరెంట్‌గా ఉండేట్లు దర్శకుడు విజయ్‌కుమార్ కేర్ తీసుకుంటున్నారనీ చెబుతున్నారు. ఈ సినిమా కోసం అనూప్ రూబెన్స్‌ను సంగీత దర్శకుడిగా ఎన్నుకున్నారనీ, ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంతో జరుగుతున్నాయనీ సమాచారం. త్వరలోనే 'అహం' చిత్రం షూటింగ్ ప్రారంభం కానున్నదని అంటున్నారు.

పొలిటికల్ బ్యాక్ డ్రాప్‌లో..



కన్నడ ఇండస్ట్రీలోని ప్రముఖ నటుల్లో ఒకరైన కోమల్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం యమధీర. మాజీ క్రికెటర్, కేరళ స్పీడ్‌స్టార్ శ్రీశాంత్ ఇందులో నెగిటివ్ రోల్ పోషించారు. శంకర్ ఆర్ దర్శకత్వం వహించారు. వేదాల శ్రీనివాస్ నిర్మించారు. నాగబాబు, ఆలీ, సత్యప్రకాశ్, మధుసూధన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాను ఈ నెల 23న విడుదల చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ " 'యమధీర' టైటిల్ చాలా క్యాచీగా ఉంది. కోమల్ కుమార్ పోలీస్ ఆఫీసర్‌పాత్రలో చాలా అద్భుతంగా నటించారు. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా అత్యున్నత టెక్నికల్ వాల్యూస్‌తో ఈ సినిమాని మన ముందుకు తీసుకొస్తున్నారు" అని అన్నారు. చిత్ర నిర్మాత వేదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఈ సినిమాని మంచి సక్సెస్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ : సి రవిచంద్రన్, కెమెరామెన్: రోష్ మోహన్ కార్తీక్, సంగీత దర్శకుడు:వరుణ్ ఉన్ని.

చరణ్‌తో మాట్లాడా.. ఇప్పుడంతా క్లియర్

తరుణ్‌భాస్కర్





'కీడా కోలా' చిత్రంలో అనుమతి లేకుండా దివంగత గాయకుడు ఎస్పీ బాలు పాటను ఏఐ (కృత్రిమ మేథ)తో రీక్రియేట్ చేసినందుకు దర్శకుడు తరుణ్ భాస్కర్, చిత్ర యూనిట్‌పై బాలు తనయుడు, గాయకుడు ఎస్పీ చరణ్ లీగల్ నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ సినిమా ఈవెంట్‌లో ఈ వివాదంపై తరుణ్ భాస్కర్ స్పందించారు. "ఈ సమస్యంతా గాయకుడు ఎస్పీ చరణ్, నాకూ మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల వచ్చిందే. ఒక ఫిల్మ్‌మేకర్‌గా ఎప్పుడూ కొత్తదనంతో ప్రేక్షకులను అలరించటానికే తాపత్రయపడుతుంటా. అందులో భాగంగానే లెజెండరీ కళాకారులను గౌరవించాలనే ఉద్దేశంతో 'కీడాకోలా'లో దివంగత గాయకుడు. ఎస్పీ బాలు పాటను ఏఐ సాయంతో రీ క్రియేట్ చేశాం. ఈ ప్రయత్నం ఎవరినో కించపరచటానికో, అగౌరవపరచటానికో చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త నటులతో చిన్న సినిమాలే చేస్తుంటాను. పేరుమోసిన బడా స్టార్స్‌తో సినిమాలు చేయాలని ప్రయత్నించట్లేదు, కోరుకోవట్లేదు. కొత్తగా ప్రయత్నించాం. ఏఐకు ఉన్న పరిమితులు తెలుసు. ప్రస్తుతం మన అందరి ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయి. ఏ క్షణం ఏమవుతుందో ఎవ్వరికీ తెలియని పరిస్థితి. ఇలాంటి తరుణంలో మనం చేయగలిగిందల్లా.. అన్నిటినీ గౌరవించటం.. ప్రయోగాలు చేయడం మాత్రమే. అలాంటి ప్రయత్నమే 'కీడాకోలా'లో చేశాం. ఇది కమర్షియల్ అడ్వాంటేజ్ కోసం కాదు. ఒక్కోసారి కొత్తగా ప్రయత్నించేటప్పుడు పొరపాట్లు జరగటం సహజం. దాదాపు ఇలాంటి పరిస్థితుల్లోనే ఎస్పీ చరణ్‌తో కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది. కానీ ఇప్పుడంతా క్లియర్. ఈ విషయంపై నేను ఆయనతో మాట్లాడా" అని వివరించారు.

అందుకే లంబసింగి నిర్మించా

కల్యాణ్ కృష్ణ



భరత్‌రాజ్, దివి జంటగా నటించిన 'లంబసింగి' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. నవీన్‌గాంధీ దర్శకత్వంలో కల్యాణ్ కృష్ణ నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ నిర్వహించింది. కల్యాణ్ కృష్ణ మాట్లాడుతూ 'నాకు దర్శకుడిగా అవకాశం రావడానికి ఏడేళ్లు పట్టింది. ప్రతిభ ఉండీ అవకాశాలు రాని సహ దర్శకులు పడే వేదన నాకు తెలుసు. అందుకే అలాంటి వారిని ప్రోత్సహించాలని చిత్ర నిర్మాణంలోకి అడుగుపెట్టాను. నవీన్‌గాంధీ కథను అద్భుతంగా తెరకెక్కించారు. చిత్రబృందం కష్టానికి ఈ రోజు తగిన ఫలితం లభించింది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'లంబసింగి' సినిమా చూసిన ప్రేక్షకులు బరువైన హృదయంతో థియేటర్ బయటకు వస్తున్నారు. మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు రుణపడి ఉంటాను' అని చెప్పారు. వీరబాబు పాత్ర ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది అని భరత్‌రాజ్ తెలిపారు.

మళ్లీ వస్తున్న ప్రభుదేవా 'ప్రేమికుడు'



ప్రభుదేవా నగ్మా హీరోహీరోయిన్లుగా 30 ఏళ్ల క్రితం వచ్చిన మ్యూజికల్ బ్లాక్‌బస్టర్ 'ప్రేమికుడు' చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. . టాప్ డైరెక్టర్ శంకర్ రెండో ప్రాజెక్ట్‌గా ఇది 1994లో రిలీజై ఆ తరం యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని కే.టి కుంజుమోన్ నిర్మించారు. ఏ. ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందించారు. గానగంధర్వుడు, స్వర్గీయ ఎస్. పీ. బాలసుబ్రమణ్యం, వడివేలు, రఘువరన్, గిరీష్ కర్నాడ్ కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఈ సినిమా రీ రిలీజ్ రైట్స్ కొన్న నిర్మాతలు రమణ, మురళీధర్ సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా దర్శకుడు ముప్పలనేని శివ మాట్లాడుతూ "30 సంవత్సరాల క్రితం వచ్చిన ప్రేమికుడు సినిమా ఇప్పుడు రీ రిలీజ్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. అప్పట్లో ప్రభుదేవా డాన్సులు చూసి స్ప్రింగ్‌లు ఏమన్నా మింగారా అని అనుమానపడేవాళ్లం. అందరితోపాటు ఈ సినిమా కోసం నేనూ ఆతృతగా ఎదురు చూస్తున్నాను" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా రీ రిలీజ్‌లో కూడా సూపర్‌డూపర్ హిట్ అవుతుంది. ఇందులో గానగంధర్వుడు ఎస్. పి. బాలసుబ్రమణ్యం నటన అద్భుతంగా ఉంటుంది. ప్రభుదేవా నటన, డాన్సులు నగ్మా అందాలు ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ" అని చెప్పారు. రీ రిలీజ్ చేస్తున్న రమణ, మురళీధర్ మాట్లాడుతూ "30 ఏళ్ల క్రితం సెన్సేషన్ సృష్టించిన సినిమాను మేము రీ రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అతి త్వరలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించి, ప్రభుదేవాను ముఖ్య అతిథిగా పిలవాలనుకుంటున్నాం" అని చెప్పారు.

మాట వినే హీరోలు దొరికారు

'పంపిణీదారుడిగా కంటే నిర్మాతగా జర్నీ బాగుంది. నచ్చిన కథతో ప్రయాణం చేసే వెసులుబాటు నిర్మాతకు ఉంటుంది' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. హాస్య మూవీస్ బేనర్‌పై పలు సినిమాలు నిర్మిస్తున్న ఆయన పుట్టినరోజు (మంగళవారం) సందర్భంగా సోమవారం మీడియాతో ముచ్చటించారు. కొత్త ప్రాజెక్టుల గురించి వివరించారు.




● 'స్వామిరారా' చిత్రంతో పంపిణీదారుడిగా ప్రయాణం ప్రారంభించి ఇప్పటికి దాదాపు 82 సినిమాలు విడుదల చేశా. 'ఒక్క క్షణం', 'నాంది' చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించా. అనిల్ సుంకర్‌తో జర్నీ మొదలుపెట్టి 'ఊరిపేరు భైరవకోన', "సామజవర గమన' సినిమాలు తీశా. ప్రస్తుతం. సుబ్బు దర్శకత్వంలో 'బచ్చలమల్లి' సినిమా తీస్తున్నా. 90వ దశకంలో జరిగిన కథతో 'బచ్చలమల్లి' చిత్రం తీస్తున్నాం. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అన్నవరం, తుని పరిసర ప్రాంతంలో షూటింగ్ చేస్తున్నాం. మే 10 నుంచి జరిగే సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేస్తాం. 'అల్లరి' నరేశ్ చిత్రం యాభై శాతం పూర్తయింది. ఆ తర్వాత సందీప్ కిషన్, కిరణ్ అబ్బవరం చిత్రాలు ఉంటాయి. వీరు కాకుండా మరో హీరోతో సినిమా చేయబోతున్నా. వివరాలు త్వరలో చెబుతా.

● నేను చేసే హీరోలు నాకు పర్సనల్ ఫ్రెండ్స్. అన్నీ స్టడీ చేసి సినిమా ప్లాన్ చేస్తుంటా. నా అదృష్టం కొద్దీ నా మాట వినే హీరోలు దొరికారు. కథ, ప్రీ ప్రొడక్షన్, మేకింగ్.. అన్నింటిలో నా ప్రమేయం ఉంటుంది. పంపిణీదారుడిగా ఉన్న అనుభవం నాకు ఉపయోగపడుతోంది.

● హాస్య మూవీస్ బేనర్‌లో తీసే చిత్రాలకు కొత్త కథలు, మంచి కథాంశాలు ఎన్నుకుంటున్నాం. ఇప్పటివరకూ అలాంటివే తీశాం. దర్శకుడు త్రినాథ్‌తో తీసే సినిమా కూడా భిన్నమైన కథాంశంతో ఉంటుంది. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. అందుకే నా సినిమాలో యాక్షన్ పార్ట్ కథానుగుణంగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటా.అలాగే పాన్ ఇండియా హీరో, కథ లభిస్తే వచ్చే ఏడాది పాన్ ఇండియా సినిమా తీస్తా. అలాగే ఓ పెద్ద హీరోతో వచ్చే ఏడాది పెద్ద సినిమా తీస్తున్నా. అది ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

ఫాస్టింగ్

పొట్టకు రెస్ట్



ఎలాంటి యంత్రానికైనా విశ్రాంతి అవసరం. అలాగే మన పొట్టకు కూడా! అందుకోసం ఉపవాసం ఉండడం మంచి లక్షణం. అయితే ఏ కారణంతో ఉపవాసం చేసినా, దాంతో ఆరోగ్య ఫలాలు దక్కాలంటే, కొన్ని నియమాలు తప్పక పాటించాలి అంటున్నారు వైద్యులు!

ఉపవాసం కచ్చితంగా పరమౌషధమే! తెరిపి లేకుండా పని చేసే జీర్ణ వ్యవస్థకు విరామం ఇవ్వడం అవసరం. కాబట్టే అన్ని మతాలు, సంస్కృతుల్లో ఉపవాసం ఒక తప్పనిసరి సంప్రదాయంగా మారింది. ఉపవాసంతో జీర్ణశక్తి మెరుగవుతుంది. శరీరం శక్తిని ఖర్చు చేసే వేగం పెరుగుతుంది. పోషక శోషణ కూడా పెరుగుతుంది. అలాగే ఉపవాసంతో అధిక బరువు తగ్గే అదనపు ప్రయోజనం కూడా పొందవచ్చు. అయితే ఉపవాసం ప్రయోజనం దక్కాలంటే, అనుసరించే ఉపవాసం క్రమం తప్పకుండా, ఒక పద్ధతి ప్రకారం కొనసాగాలి. రాత్రి హెవీగా బిరియానీ తినేసి, మరుసటి రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేసే వాళ్లుంటారు. లేదంటే కొన్ని రోజులు రెండు పూటలు లేదా ఒక్క పూట భోజనానికే పరిమితమైపోయేవాళ్లూ ఉంటారు. కానీ ఇలా నచ్చినట్టు, నచ్చినప్పుడు ఉపవాసాలు ఉండడం వల్ల శరీరం అల్లకల్లోలానికి గురవుతుంది. ఎప్పుడు ఆహారం అందుతుందో, ఎప్పుడు ఆహార కొరతను ఎదుర్కోవాలో ఊహించలేక శరీరం అయోమయానికి లోనవుతుంది. అస్తవ్యస్థ ఉపవాసాల ఫలితంగా కొన్ని దుష్ప్రభావాలను కూడా భరించవలసి వస్తుంది.

అస్తవ్యస్థ ఉపవాసంతో...

సమయానికి తినకపోవడం మూలంగా గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తవచ్చు. కడుపు ఉబ్బరం, అసిడిటీ వేధించవచ్చు. అలాగే బలహీనత, మానసిక సంతులనం కోల్పోవడం లాంటి లక్షణాలు కూడా వేధిస్తాయి. బరువు తగ్గడం కోసం ఉపవాసాన్ని ఆశ్రయించేవాళ్లు, అవగాహన లేమితో కొనసాగించే అస్తవ్యస్థ ఉపవాసాల వల్ల బరువు తగ్గకపోగా, పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది. ఇలాంటి ఉపవాసాలతో మెటబాలిజం దెబ్బతిని బరువు అదుపు తప్పుతుంది. అలాగే ఉపవాసంతో కడుపు నకనకలాడుతూ గంటల తరబడి ఆకలితో అల్లాడిపోయిన తర్వాత, ఒకేసారి ఎక్కువ పరిమాణంలో ఆహారం తినేస్తూ ఉంటారు. బరువు పెరగడానికి ఇదీ ఒక కారణమే! మరీ ముఖ్యంగా ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ చేసే వాళ్లు ఆహారం తీసుకునే విండో టైమ్‌లో నచ్చినవన్నీ తినేస్తూ ఉంటారు. రోజంతా తినడం లేదు కాబట్టి విండో టైమ్‌లో ఏం తిన్నా ఫర్వాలేదు అని సర్దిచెప్పుకుంటూ ఉంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు.

వారానికో రోజు

వారంలో ఒక రోజు లేదా పక్షంలో ఒక రోజు ఉపవాసం ఉండడం ఆరోగ్యకరం. ఇలాంటి ఉపవాసంతో శరీరానికి పూర్తి విశ్రాంతి దక్కి, మెటబాలిజం పెరుగుతుంది. శరీరం డిటాక్స్‌పై అవడంతో పాటు, కొత్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. అయితే ఉపవాసం చేయడం కంటే, అందుకోసం శరీరాన్ని సిద్ధం చేయడం అంతకంటే ముఖ్యం. మరుసటి రోజు ఉపవాసం చేయబోతున్నప్పుడు, ముందు రోజు శరీరానికి తేలికపాటి ఆహారాన్ని అందించాలి. మరీముఖ్యంగా శరీరంలో పిహెచ్ విలువలు తగ్గకుండా చూసుకోవాలి. సాధారణంగా మనం ఉడికించిన పదార్థాలనే తింటూ ఉంటాం. ఇలా వండడం వల్ల ఆ పదార్థాలన్నీ ఆమ్లత్వాన్ని సంతరించుకుంటాయి. మన పొట్టలో ఉండే హైడ్రోక్లోరిక్ యాసిడ్ కూడా జీర్ణక్రియకు తోడ్పడుతుందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఉపవాసంలో ఉన్నప్పుడు ఈ ఆమ్లం ఉత్పత్తి కాకుండా ఆపడం కోసం ముందు రోజు నుంచే క్షార గుణం కలిగిన ద్రవాలను, పదార్థాలనూ తీసుకోవడం అవసరం. అందుకోసం కొబ్బరినీళ్లు, పళ్లు, సలాడ్లు తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి. ఈ నియమాలు పాటించడం వల్ల ఉపవాసానికి శరీరం చక్కగా సహకరించి, నీరసించిపోకుండా ఉంటుంది. ఇలా వారంలో లేదా పక్షంలో ఒక రోజు ఉపవాసం ఉండడం ఆరోగ్యకరం.

వీళ్లకు ఉపవాసం వద్దు

ఫ్యాటీ లివర్ డిసీజ్ ఉన్నవాళ్లు, కాలేయ సమస్యలున్న వాళ్లు, బరువు తగ్గాలనుకునేవాళ్లకు ఉపవాసం సత్ఫలితాన్నిస్తుంది. పెద్ద పేగు, చిన్న పేగు కేన్సర్ల నుంచి రక్షణ పొందడం కోసం కూడా ఉపవాసం ఉంటూ శరీరాన్ని శుద్ధి చేసుకుంటూ ఉండాలి. అయితే ఉపవాసం చేయకూడని వాళ్లు కూడా ఉంటారు.

- **మధుమేహుల్లో చక్కెర స్థాయిలు హెచ్చుతగ్గులకు గురవుతూ ఉంటాయి. కాబట్టి వీళ్లు ఉపవాసానికి బదులుగా ఆహార పరిమాణాన్ని తగ్గించి తినాలి.**
- **సర్జరీ నుంచి కోలుకుంటున్న వాళ్లు ఉపవాసాలు చేయకూడదు**
- **మూత్రపిండాలు, ఇతరత్రా తీవ్ర ఆరోగ్య సమస్యలున్న వాళ్లు ఉపవాసం చేయకూడదు.**

ఉపవాసం డైట్ ఫ్యాడ్ కాదు

ఉపవాసం రోజు శక్తి నిల్వలకు తగినట్టు మన దైనందిన జీవితాన్ని కొనసాగించాలి. ఉపవాసం చేసే సమయంలో కదలకుండా ఇంట్లో ఉంటే ఎనర్జీ లెవల్స్ సమంగా ఉండి, నీరసించిపోకుండా ఉంటాం. విశ్రాంత స్థితిలో ఎనర్జీ మెటబాలిజం నెమ్మదించి, శరీరం డిటాక్స్‌పై అవుతుంది. అలా కాకుండా, ఉపవాసాన్ని ఒక డైట్ టెక్నిక్‌గా అనుసరిస్తూ, అన్ని పనులు చేసుకుంటూపోతే, ఆ ప్రభావం శరీరం మీద కచ్చితంగా పడుతుంది. మరీ ముఖ్యంగా ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌ను అనుసరించేవాళ్లు ఇదే పొరపాటు చేస్తూ ఉంటారు. ఒకవేళ ఈ ఉపవాస ప్రక్రియతో ప్రతిఫలం పొందాలనుకుంటే, ఇదే ప్రక్రియను జీవితాంతం కొనసాగించగలిగేలా ఉండాలి. రెండు, మూడు నెలల పాటు ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ చేసేసి, బరువు తగ్గిన తర్వాత అన్నీ తినేద్దాం అనుకోవడం పొరపాటు. మన శరీరం ఒక లయతో పని చేస్తుంది. ఆ సర్కేడియం రిథమ్‌ను మనం జీవితాంతం మెయింటెయిన్ చేసుకోవాలి. నిద్ర లేవడం, తినడం, పడుకోవడం.. ఇలాంటి పనులన్నిటికీ మనం నియమిత వేళలను అనుసరించాలి. బదులుగా ఈ వేళలన్నీ మార్చేసి, నచ్చిన సమయానికి తింటానంటే శరీరం అందుకు సహకరించకపోవచ్చు. గ్యాస్ట్రిక్ సమస్యలే వేధించవచ్చు. కాబట్టి మన దైనందిన జీవితానికి తగిన దీర్ఘకాల ఉపవాస ప్రక్రియను అలవాటు చేసుకోవాలి. ఒకవేళ బరువు తగ్గడం లక్ష్యమైతే ఉపవాసానికి బదులుగా, తీసుకునే పదార్థ పరిమాణాలను, కొవ్వులు, పిండి పదార్థాలనూ తగ్గించుకోవాలి.



ఉపవాస విరమణ ఇలా

ఉపవాసాన్ని భారీ భోజనానికి బదులుగా ద్రవాలతో విరమించాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ లేదా నిమ్మరసాలు తీసుకోవచ్చు. తీపి పదార్థాలు, ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలతో ఉపవాసాన్ని విరమించకూడదు. విశ్రాంత స్థితిలో ఉన్న శరీరం సాధారణ స్థితికి రావడం కోసం శరీరానికి మొదట ద్రవ పదార్థాలు, తర్వాత పండ్లు తిని, ఆ తర్వాతే భోజనం తినాలి.

ఇవీ ఉపవాసాలే!

ఏమీ తినకుండా కడుపు ఖాళీగా ఉంచడం ఒక్కటే ఉపవాసం కాదు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలకు దూరంగా ఉండడం కూడా ఉపవాసమే! జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండడం, తీపి పదార్థాలను దరి చేరనివ్వకపోవడం.. ఇవి కూడా ఉపవాసాలే! వీటితో కూడా బరువు తగ్గవచ్చు. ఆరోగ్యాన్ని మెరుగు చేసుకోవచ్చు. వారంలో లేదా పక్షంలో ఒక రోజు వండిన పదార్థాలకు బదులుగా పండ్లు, పచ్చికూరగాయలను తినడం కూడా ఒక రకమైన ఉపవాసమే! ఇలా ఫ్రూట్ ఫాస్టింగ్ ఉండాలనుకున్నప్పుడు మూడు పూటలా సలాడ్ లేదా పళ్లు తీసుకోవచ్చు. మజ్జిగ, పళ్ల రసం, లేదా నిమ్మరసం తాగవచ్చు.

ఎనిమిది గంటల విరామం

తిన్న ఆహారం పూర్తిగా జీర్ణమైన తర్వాతే రెండోసారి ఆహారం తీసుకోవడం ఆరోగ్యకరం. ఇందుకు మీల్‌కూ మీల్‌కూ మధ్య 8 నుంచి 12 గంటల విరామం సరిపోతుంది. దీన్ని కూడా ఉపవాసంగా పరిగణించవచ్చు. ఇన్ని గంటల విరామం పాటించగలిగితే, మునుపు తిన్న ఆహారమంతా పూర్తిగా జీర్ణమై, మరుసటి భోజనానికి శరీరం సన్నద్ధమవుతుంది. ఇలాంటి పద్ధతిని పాటించగలిగితే, స్వతఃసిద్ధంగా కొవ్వును కరిగించుకునే శరీర స్వభావం మెరుగవుతుంది. అలాగే జీర్ణశక్తి కూడా పెరుగుతుంది. తగినంత పీచు తీసుకోకపోవడం మూలంగా పెద్ద పేగుల్లో ఇరుక్కుపోయిన విసర్జకాలు కూడా ఈ విరామ సమయంలో క్లియర్ అయిపోతాయి.

సరైన ఆహారాన్ని సరైన పద్ధతిలో తినకపోవడం మన దేశంలో పెద్ద పేగు కేన్సర్లు పెరగడానికి ఒక ప్రధాన కారణం. ఆహార వేళలు పాటించకపోవడం, నిల్వ పదార్థాలు, కృత్రిమ రంగులు, రసాయనాలు జోడించిన పదార్థాలు తినడం వల్ల కూడా కోలన్ కేన్సర్లు పెరుగుతున్నాయి. శరీరంలో పేరుకుపోయే టాక్సిన్లను తొలగించుకోకపోవడం వల్ల కాలేయం పనితీరు నెమ్మదించి కొలెస్ట్రాల్ కూడా పెరుగుతూ ఉంటుంది. ఇది చివరకు గుండె జబ్బులకు దారి తీయవచ్చు. కాబట్టి ఆహారశైలి క్రమం తప్పకుండా చూసుకోవాలి.



డాక్టర్ సుజాత స్టీఫెన్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్,
మలక్ పేట, హైదరాబాద్.

హ్యాంగ్జయిటీ

మత్తుతో చిత్తే!

రాత్రి మద్యం మత్తులో తూగేటప్పుడు పర్యవసనాల గురించి ఎవరూ ఆలోచించరు. మరుసటి ఉదయం నిద్ర లేచిన తర్వాత, హ్యాంగోవర్‌తో పాటు, అర్థం లేని ఆందోళన, భయాలు వేధిస్తాయి. ఈ ఆందోళనే 'హ్యాంగ్జయిటీ'!



రాత్రి తాగిన మద్యం మత్తు తెల్లవారేసరికి పూర్తిగా దిగినా, దిగకపోయినా అపరాధభావన మాత్రం వేధించడం మొదలుపెడుతుంది. ఈ మానసిక స్థితికి కారణం వెనక భౌతిక వాస్తవాలున్నాయి. మద్యం తాగి, ఆ మత్తు నుంచి బయటపడే సమయంలో ప్రతి వ్యక్తి మెదడులో కొన్ని మార్పులు చోటు చేసుకుంటాయి. తక్కువ పరిమాణాల్లో మద్యం తీసుకున్న వాళ్లలో అయోమయం లాంటి లక్షణాలు కనిపిస్తే, ఎక్కువ మోతాదుల్లో తాగేసే వాళ్లలో మరుసటి ఉదయం ఆందోళన, భయం, మానసిక గందరగోళం లాంటి లక్షణాలు మొదలవుతాయి. బిడియాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసే మద్యం మరుసటి ఉదయానికి చిత్రమైన మానసిక అసంతులనానికి లోను చేస్తుంది. మెదడులోని న్యూరో ట్రాన్స్‌మీటర్లలో ఏర్పడే మార్పులే ఇందుకు ప్రధాన కారణం. ప్రధానంగా నిద్ర, ఒత్తిడులకు సంబంధించిన గామా అమీనోబ్యుటైరిక్ యాసిడ్ కేంద్ర నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచుతుంది. మద్యంతో ఈ ట్రాన్స్‌మీటర్ మోతాదు తగ్గుతుంది. దీనికి తోడు మెదడులోని మరొక ట్రాన్స్‌మీటర్ గ్లూటామేట్ మీద కూడా మద్యం ప్రభావం పడుతుంది. ఈ గ్లూటామేట్ తగ్గడంతో, మెదడు మీద మద్యం ప్రభావం మరింత పెరిగి, ఆందోళనను ప్రేరేపించే రసాయనం ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా మద్యం తాగిన మరుసటి ఉదయం ఆందోళన, భయం మొదలవుతాయి. అరుదుగా తాగేవాళ్లలో హ్యాంగ్జయిటీ సమస్య ఒక్క రోజులోనే అదుపులోకి వచ్చేస్తుంది. కానీ క్రమం తప్పకుండా మద్యం తాగేవాళ్లలో ఈ న్యూరోట్రాన్స్‌మీటర్ల మధ్య సంతులనం దెబ్బతిని, హ్యాంగ్జయిటీ నుంచి కోలుకునే వేగం తగ్గుతుంది. ఏ లక్షణాలను కప్పి పుచ్చడం కోసం మద్యం తాగారో, మరుసటి రోజు అవే లక్షణాలు రెట్టింపు తీవ్రతతో విరుచుకుపడతాయి. హ్యాంగోవర్ నుంచి ఉపశమనం పొందడం కోసం కొందరు మరుసటి ఉదయం స్వల్పంగా మద్యం తీసుకునే పాతకాలపు చిట్కాను అనుసరిస్తూ ఉంటారు. ఈ రిలీఫ్ డ్రింకింగ్ వల్ల మరింత వ్యసనానికి దారి తీసే ప్రమాదం ఉంది.

వెయిట్ లాస్

బరువు తగ్గించే సూత్రాలు

అధిక బరువును తగ్గించుకోవడం కోసం తెలిసిన దార్లన్నీ అనుసరిస్తూ ఉంటాం. కానీ కొన్ని తేలికపాటి చిట్కాలతో బరువును తగ్గించుకోవచ్చని ప్రముఖ సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుతా దివేకర్ అంటోంది. ఆ చిట్కాలేంటంటే...

ఆహారం: లోకల్, సీజనల్, ట్రెడిషనల్... తినే ఆహారం పరంగా ఈ మూడు నియమాలు పాటించాలి. తాజా ఫుడ్ ట్రెండ్‌ను గుడ్డిగా అనుసరించకుండా, స్థానికంగా పండిన ఉత్పత్తులు, కాలనుగుణమైన, సంప్రదాయ పదార్థాలనే తినాలి.

ప్రాసెస్డ్ ఫుడ్: ప్యాకేజ్డ్ ఫుడ్‌ను పూర్తిగా మానేయాలి. ఒకవేళ తినాలనిపిస్తే, వీలైనంత పరిమితంగా తీసుకోవాలి.

మైండ్‌ఫుల్‌గా: భోజనం చేసే సమయంలో మనసు, ఆలోచనలు భోజనం మీదే కేంద్రీకరించాలి. టివి, మొబైల్ ఫోన్ చూస్తూ తినకూడదు. ఇంద్రియాలన్నింటినీ నియంత్రణలో ఉంచుకుని, రోజూ భోజనానికి ఒకే చోట కూర్చుంటూ, ఆహారంలోని రుచులను, కమ్మదనాన్నీ ఆస్వాదించాలి.

వ్యాయామం: వారంలో వ్యాయామం 150 నిమిషాలకు తగ్గకూడదు. ఎముకలు, కండరాలు ఆరోగ్యంగా ఉండడం కోసం వ్యాయామం చేయడం అవసరం. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలపాటైనా వ్యాయామం చేయాలి. అలాగే ఎక్కువ గంటలు కూర్చుని పని చేసేవాళ్లు ప్రతి 30 నిమిషాలకూ లేచి కనీసం మూడు నిమిషాలపాటైనా లేచి నిలబడుతూ ఉండాలి.



యూరాలజీ

అటు రోగికీ, ఇటు వైద్యులకూ సౌలభ్యంగా ఉండే రొబొటిక్ చికిత్సలతో కచ్చితత్వంతో కూడిన సర్జరీలు సాధ్యపడుతున్నాయి. మూత్ర వ్యవస్థ సంబంధ సమస్యల పరంగా కూడా రొబొటిక్ చికిత్సలు సత్ఫలితాలను అందిస్తున్నాయి.

సమర్థమైన రొబొటిక్ సర్జరీలు

కొన్ని అంతర్గత అవయవాలు క్లిష్టమైన ప్రదేశాల్లో ఉంటాయి. వాటిలో మూత్రాశయం దిగువన ఉండే ప్రోస్టేట్ గ్రంథి ఒకటి. వీటిలో ఏర్పడే కేన్సర్ గడ్డలను తొలగించాలంటే, గురి తప్పకుండా నేరుగా ఆ ప్రదేశానికి చేరుకోగలిగిన సాంకేతికత అవసరమవుతుంది. కేన్సర్ సోకిన ప్రోస్టేట్‌ను తొలగించి, మూత్రాశయాన్నీ, యురెత్రాల్లోని సమస్యలను చక్కదిద్దడం కోసం కటి ప్రదేశంలో ఏర్పరిచిన ఒకటి నుంచి ఒకటిన్నర



అంగుళాల రంధ్రం గుండా సర్జరీ చేయవలసి ఉంటుంది. ల్యాప్రోస్కోపీ, లేదా ఓపెన్ సర్జరీల పరంగా ఇదెంతో క్లిష్టమైన చికిత్స. కానీ రొబొటిక్‌పరంగా ఈ చికిత్స చేయడం ఎంతో సులువు. రొబొటిక్స్‌లో వైద్యులు కన్సోల్‌ను సులువుగా ఆపరేట్ చేయగలగడంతో పాటు, సర్జరీ చేసే సమయంలో మణికట్టును వీలైనంత మేరకు కదిలించే వెసులుబాటు ఉంటుంది. ఫలితంగా అంతర్గతంగా కుట్లను కచ్చితత్వంతో వేయగలుగుతారు. దీనివల్ల మూత్రం లీక్ అయ్యే అవకాశాలు బాగా తగ్గుతాయి.

రోగులకు ప్రయోజనకరం

రొబొటిక్ సర్జరీ చేయించుకున్న రోగుల్లో మూత్రం లీక్స్ పెద్దగా ఉండకవు. పైగా సర్జరీ తర్వాత తేలికగా లేచి నడవగలుగుతారు. ల్యాప్రోస్కోపీలో ఇలాంటి ప్రయోజనాలు ఉండవు. ల్యాప్రోస్కోపీ సర్జరీ నాలుగు రెట్ల మాగ్నిఫికేషన్ కలిగి ఉంటే, రొబొటిక్స్‌లో అంతర్గత అవయవాలను పదింతలు పెద్దగా చూడగలిగే సౌలభ్యం ఉంటుంది. దాంతో సర్జరీలో పొరపాట్లకు ఆస్కారం ఉండదు. పైగా ఇది త్రీడీ వ్యూయర్ కావడంతో, వైద్యులు సులువుగా సర్జరీ చేయగలుగుతారు. ప్రోస్టేట్ కేన్సర్‌తో పాటు, బ్లాడర్ కేన్సర్‌లకు కూడా ఈ సర్జరీ తోడ్పడుతుంది. కటి ప్రదేశంలో ఎంతో లోతులో ఉండే కేన్సర్ సోకిన మూత్రాశయాన్ని తొలగించడంలో రొబొటిక్స్ ఎంతో మెరుగ్గా సహాయపడతాయి. మూత్రపిండాల నుంచి మూత్రాశయానికి దారి తీసే నాళాలు కొన్నిసార్లు పూడుకుపోతూ ఉంటాయి. కొందర్లో ఈ సమస్య పుట్టుకతోనే సంక్రమించవచ్చు. ఈ సమస్యలను సరిదిద్దడం కోసం చేసే పైలోప్లాస్టీ చికిత్సలో రొబొటిక్స్‌తో కుట్లను కచ్చితంగా వేయగలుగుతారు. ఈ చికిత్సలో సమస్య ఉన్న నాళాన్ని కత్తిరించి, తొలగించి, తిరిగి జోడించవలసి ఉంటుంది. జోడించే సమయంలో వేసే కుట్లు సక్రమంగా లేకపోతే మూత్రం లీక్ అయ్యే ప్రమాదం ఉంటుంది. సర్జరీ విఫలమై సమస్య తిరగబెట్టే అవకాశాలు ఉండవు. కాబట్టి ఇలాంటి సమస్యల్లో రొబొటిక్స్ ఎంతో సహాయపడతాయి.

మూత్రపిండాలు దెబ్బతినకుండా...

అల్ట్రాసౌండ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ట్యూమర్లు ప్రారంభ దశల్లోనే బయటపడుతున్నాయి. ఇంతకు పూర్వం 10 నుంచి 15 సెంటీమీటర్ల మేరకు గడ్డలు పెరిగేవరకూ తెలిసేది కాదు. కానీ ఇప్పుడు రెండు నుంచి మూడు సెంటీమీటర్ల ట్యూమర్లు కూడా స్కాన్‌లలో బయల్పడుతున్నాయి. ఇలాంటి చిన్న ట్యూమర్లను కనిపెట్టడం వల్ల కిడ్నీని తొలగించవలసిన అవసరం లేకుండా, కేవలం ట్యూమర్‌ను మాత్రమే తొలగించి కుట్లు వేయగలుగుతున్నారు. ఇలాంటి చిన్నపాటి ట్యూమర్లను తొలగించడంలో కూడా రొబొటిక్స్ ప్రయోజనకరంగా మారాయి. సాధారణంగా మూత్రపిండాల్లోని ట్యూమర్లను తొలగించే సమయంలో, కిడ్నీకి రక్త సరఫరా జరగకుండా క్లాంప్ వేస్తారు. ఈ సందర్భంలో సర్జరీని వీలైనంత త్వరగా ముగించవలసి ఉంటుంది. సర్జరీ ఎంత త్వరగా ముగిస్తే, మూత్రపిండాలు కూడా అంతే త్వరగా కోలుకుంటాయి. కాబట్టి ఇలాంటి పార్షియల్ నెఫ్రక్టమీ సర్జరీల్లో రొబొటిక్స్ అక్కరకొస్తున్నాయి.

భవిష్యత్తు టెలి రొబొటిక్స్‌దే!

ప్రస్తుతం టెలి రొబొటిక్స్ ప్రయగాత్మక స్థాయిలో ఉన్నాయి. భవిష్యత్తులో ఇవి అందుబాటులోకొస్తే, వైద్యులు ఆన్‌లైన్‌లో ప్రపంచంలోని ఏ ప్రాంతంలో ఉన్న రోగికైనా సర్జరీ చేయగలుగుతారు. అలాగే భవిష్యత్తులో రొబొటిక్ యంత్రాల పరిమాణం కూడా తగ్గే అవకాశాలున్నాయి. ప్రస్తుతం వాటిని ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తీసుకువెళ్లగలిగే సౌలభ్యం లేకపోయినప్పటికీ, భవిష్యత్తులో ఈ సౌలభ్యం కూడా అందుబాటులోకి రావచ్చు. అలాగే భవిష్యత్తులో సర్జరీ సమయంలో వైద్యులను గైడ్ చేసేలా కృత్రిమ మేథస్సును కూడా రొబొటిక్స్‌కు జోడించే అవకాశాలున్నాయి. ఇలాంటి సౌలభ్యం వల్ల సర్జరీల్లో పొరపాట్లకు ఆస్కారమే లేకుండా పోతుంది.



డాక్టర్ ఎ.వి. రవి కుమార్
యూరాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.

వచ్చే ఏడాదీ ఐటీకి కష్టాలే



నియామకాలూ అంతంత మాత్రమే

లాభాలకు మాత్రం ఢోకా ఉండదు.. ఇక్రా రేటింగ్స్

ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) కూడా దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి కలిసొచ్చేలా లేదు. ఈ కాలానికి భారత ఐటీ కంపెనీల ఆదాయ వృద్ధి రేటు 3 నుంచి 5 శాతం మించకపోవచ్చు. దేశీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఇక్రా రేటింగ్స్' సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఆదాయ వృద్ధి పెద్దగా లేక పోవడంతో ఐటీ కంపెనీలు పెద్దగా నియామకాల జోలికీ పోకపోవచ్చని ఆ నివేదిక పేర్కొంది.

తగ్గనున్న వలసలు

పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండడంతో ఒక కంపెనీ నుంచి మరొక కంపెనీకి మారే ఉద్యోగుల సంఖ్యా 12-13 శాతం మించకపోవచ్చని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి తొమ్మిది నెలల్లో ఐటీ కంపెనీల స్థూల ఆదాయాలు 9.2 శాతం పెరిగినా, నికర ఆదాయాల వృద్ధి రేటు 2 శాతం మించలేదు. పరిశ్రమ అంచనా వేసిన 3-5 శాతం కంటే ఇది తక్కువ.

లాభాలకు ఢోకా లేదు

ఆదాయాల వృద్ధి రేటు అంతంత మాత్రంగానే ఉన్నా 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ ఐటీ కంపెనీల లాభాలకు ఢోకా ఉండదని ఇక్రా రేటింగ్స్ తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం భారత ఐటీ కంపెనీల నిర్వహణ లాభాలు 21 నుంచి 22 శాతం ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇన్ని ఆటుపోట్లు ఉన్నా భారత ఐటీ కంపెనీల స్థిరత్వానికి ఢోకా లేదని పేర్కొంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) కంపెనీల నుంచి ప్రాజెక్టుల ఆర్డర్లు తగ్గినా.. కీలకమైన టెక్నాలజీ నిర్వహణ ఆర్డర్లు ఇంకా వస్తూనే ఉన్నట్టు తెలిపింది.

అడ్డంకులున్నాయ్..

భారత ఐటీ కంపెనీలకు అమెరికా, కెనడా, యూరప్ దేశాలు ప్రధాన మార్కెట్లు. ప్రస్తుతం ఈ దేశాలన్నీ అధిక ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లతో సతమతమవుతున్నాయి. తప్పనిసరైతేనే వ్యాపార విస్తరణకు పోవడం లేదు. దీంతో ఆ కంపెనీలు ఐటీ ఖర్చులూ తగ్గించుకున్నాయి. ఆర్థిక పరిస్థితులు కుదుటపడితే తప్ప ఈ దేశాల నుంచి భారత ఐటీ కంపెనీలకు ఇదివరకటిలా ఆర్డర్లు పెద్దగా వచ్చే అవకాశం లేదు.

జీతాల పెంపు అంతంత మాత్రమే

పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవడంతో దేశీయ ఐటీ కంపెనీలు ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఇందులో భాగంగా గత ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా జీతాల పెంపు 8.4 శాతం నుంచి 9 శాతం మించక పోవచ్చని భావిస్తున్నారు. మళ్లీ ఈ పెంపు ఉద్యోగులు అందరికీ ఉంటుందా? లేక కొందరికేనా? అనేది పెద్ద డౌట్. ఎందుకంటే గత ఏడాది ప్రముఖ ఐటీ కంపెనీలు జూనియర్లు, ఫ్రెషర్స్‌ను పక్కన పెట్టి సీనియర్లకు మాత్రమే జీతాలు పెంచాయి. ఈ సంవత్సరం కూడా ఐటీ కంపెనీలు అదే విధానం అనుసరిస్తాయని భావిస్తున్నారు.

మనవడికి నారాయణ మూర్తి నజరానా

రూ.240 కోట్ల విలువైన షేర్ల బహుమతి



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ఆర్ నారాయణ మూర్తి తన నాలుగు నెలల మనవడికి పెద్ద బహుమతే ఇచ్చారు. రూ.240 కోట్ల విలువైన 15 లక్షల ఇన్ఫోసిస్ షేర్లను మనవడు ఏకగ్రాహ్ రోహన్ మూర్తికి బహుమతిగా ఇచ్చారు. ఇది ఇన్ఫోసిస్ ఈక్విటీలో 0.04 శాతానికి సమానం. ఆఫ్ మార్కెట్ లావాదేవీ ద్వారా నారాయణ మూర్తి ఈ షేర్లను తన మనవడికి బదిలీ చేశారు. ఈ బదిలీతో ఇన్ఫోసిస్ ఈక్విటీలో నారాయణ మూర్తి వాటా 0.36 శాతానికి పడిపోయింది. ఏకగ్రాహ్ రోహన్ మూర్తి.. నారాయణ మూర్తి కుమారుడు రోహన్ మూర్తి కుమారుడు.

- రిలయన్స్ ట్రెండ్స్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా తిరుపతిలోని కరకంబాడి రోడ్డులో ఐదో స్టోర్‌ను ఏర్పాటు చేసింది. ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ స్టోర్‌ను ప్రారంభించింది.
- ఈ-కామర్స్ పోర్టల్ అమెజాన్ ఇండియా.. హోలీ పండగను పురస్కరించుకుని హోలీ షాపింగ్ స్టోర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. హోలీకి సంబంధించిన అన్ని ఉత్పత్తులతో పాటు ఇతర ఫ్యాషన్, కిరాణా, స్మార్ట్‌ఫోన్స్ ఇంకా మరెన్నో ఉత్పత్తులు ఈ నెల 25 వరకు ఈ షాపింగ్ స్టోర్‌లో అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

టీసీఎస్‌లో టాటా సన్స్ వాటా విక్రయం!

రూ.9,200 కోట్ల విలువైన వాటా విక్రయించే చాన్స్!

ముంబై: టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్.. తన గ్రూప్ ప్రధాన కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో స్వల్ప వాటాను బ్లాక్ డీల్స్ ద్వారా బహిరంగ మార్కెట్లో విక్రయించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. టీసీఎస్‌లో 0.64 శాతం వాటాకు సమానమైన 2.3 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ రూ.4,001 చొప్పున విక్రయించవచ్చని సమాచారం. సోమవారం టీసీఎస్ షేరు బీఎస్ఈలో 1.72 శాతం నష్టపోయి రూ.4,144.75 వద్ద ముగిసింది. ఈ ముగింపు ధరతో పోలిస్తే, బ్లాక్ డీల్స్ ద్వారా షేర్లను 3.5 శాతం తక్కువకు విక్రయించనుంది. తద్వారా టాటా సన్స్‌కు రూ.9,202 కోట్లకు పైగా నిధులు సమకూరే అవకాశం ఉంది. గత ఏడాది డిసెంబరు చివరినాటికి టీసీఎస్‌లో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ కంపెనీలు 72.41 శాతం వాటా కలిగి ఉన్నాయి. అందులో 72.38 శాతం వాటా టాటా సన్స్ చేతుల్లో ఉంది. టాటా గ్రూప్‌లోని 29 లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్ అయిన టాటా సన్స్.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా నిబంధనలకు లోబడేందుకు 2025 సెప్టెంబరు నాటికల్లా పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ) రావచ్చన్న అంచనాలున్నాయి.

అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) మూడేళ్లలోగా స్టాక్ మార్కెట్లో షేర్లను నమోదు చేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. దేశంలోని 15 అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీల్లో టాటా సన్స్ ఒకటి.

ఒడుదుడుకుల్లోనూ లాభాలు

ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం తీవ్ర ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, చివరికి లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 104.99 పాయింట్లు పెరిగి 72,748.42 వద్దకు చేరుకుంది. ఇంట్రాడేలో సూచీ 72,314 నుంచి 72,985 స్థాయిల మధ్య ఊగిసలాడింది. నిఫ్టీ 32.35 పాయింట్ల లాభంతో 22,055.70 వద్ద క్లోజైంది. సోమవారం మధ్యాహ్నం నుంచి మెటల్, ఆటో, కమోడిటీ రంగ షేర్లలో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపించగా.. ఐటీ, టెక్ షేర్లలో అమ్మకాలు లాభాలను పరిమితం చేశాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఇంట్రాడే కనిష్ఠం నుంచి 1.5 శాతానికి పైగా రికవరీ అయింది. సెన్సెక్స్, నిఫ్టీ మొత్తం లాభాల్లో అధిక వాటా ఈ షేరుదే.

దేశీయ స్టార్టప్‌ల రంగంలోకి ఈ ఏడాది రూ.లక్ష కోట్ల నిధులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది దేశీయ స్టార్టప్‌లు 800-1,200 కోట్ల డాలర్ల (రూ.66,500-99,600 కోట్లు) వరకు నిధులు సమీకరించవచ్చని వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థ పీక్ ఎక్స్‌వీ మేనేజింగ్ డైరెక్టర్ రాజన్ ఆనంద్ అన్నారు. ప్రపంచంలోకెల్లా భారత స్టార్టప్ రంగమే ప్రస్తుతం చురుకుగా ఉందని సోమవారం ప్రారంభమైన స్టార్టప్ మహాకుంభ్ సదస్సులో ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 2,000 కోట్ల డాలర్ల మేర ప్రైవేట్ మూలధనం పెట్టుబడికి అందుబాటులో ఉందని.. భారత ప్రైవేట్ రంగం, స్టార్టప్‌ల్లో పెట్టుబడి అవకాశాల కోసం చూస్తోందన్నారు. 2021కి ముందు భారత స్టార్టప్‌ల్లోకి వార్షిక పెట్టుబడులు 800-1,000 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండేవని.. 2021,2022 సంవత్సరాల్లో

పీక్స్ ఎక్స్‌వీ ఎండీ రాజన్ ఆనంద్



మొత్తం 6,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు ఈ రంగంలోకి వచ్చాయన్నారు. గత ఏడాదిలో ఫండింగ్ 700 కోట్ల డాలర్లకు పరిమితమైంది. దేశీయ స్టార్టప్ రంగ అభివృద్ధికి ఏటా 1,000 కోట్ల డాలర్ల ఫండింగ్ సరిపోతుందన్నారు. ప్రస్తుతం దేశంలో 20 స్టార్టప్‌లు స్టాక్ మార్కెట్లో ట్రేడవుతున్నాయని, వచ్చే 7-8 ఏళ్లలో ఈ సంఖ్య 100కు చేరుకోవచ్చన్నారు.

స్వీయ నియంత్రణకు కట్టుబడి ఉండాలి: కాంత్

దేశీయ స్టార్టప్‌లు పారదర్శకత, నైతిక ప్రవర్తన కోసం స్వీయ నియంత్రణ వ్యవస్థకు కట్టుబడి ఉండాలని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ, జీ-20 షెర్పా అమితాబ్ కాంత్ అన్నారు. స్టార్టప్‌ల రంగంలో కంపెనీల విలువను పెంచుకునే ప్రయత్నాలు పాలన ప్రమాణాల అతిక్రమణకు దారితీస్తోందన్నారు. దేశంలో చురుకైన స్టార్టప్‌ల వ్యవస్థ ఏర్పాటుకు నియంత్రణ జోక్యం ఉండకూడదని, ప్రభుత్వ నియంత్రణ ఆవిష్కరణలను అణిచివేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌ల వ్యవస్థను ఏర్పాటు చేయగలిగిందని, వచ్చే ఐదేళ్లలో నం.1 స్థాయికి చేర్చడమే ప్రభుత్వం ముందున్న సవాలు అని కాంత్ పేర్కొన్నారు.

త్వరలో డీప్ టెక్ స్టార్టప్ పాలసీ

డీప్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాలసీపై అంతర మంత్రిత్వ శాఖ చర్చలు తుది దశకు చేరుకున్నాయని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య డిపార్ట్‌మెంట్ (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. త్వరలోనే ఈ పాలసీని అమలు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఏడాదిలో జొమాటోను వించిపోనున్న బ్లింకిట్

క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ (గతంలో గ్రోఫర్స్) సైజు జొమాటో ఫుడ్ డెలివరీ బిజినెస్‌ను మించిపోనుందని ఈ రెండు కంపెనీల సీఈఓ దీపిందర్ గోయల్ అన్నారు. 2022లో బ్లింకిట్‌ను జొమాటో 57 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. ప్రస్తుతం కంపెనీ మొత్తం ఆదాయంలో జొమాటో ఫుడ్ డెలివరీ వ్యాపార వాటా 56 శాతంగా ఉంది. కంపెనీ తదుపరి వృద్ధికి బ్లింకిట్ చోదకం కానుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. బ్లింకిట్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించి పూర్తి స్థాయి ఈ-కామర్స్ కంపెనీగా మార్చే దిశగా జొమాటో ఆలోచిస్తోంది.

బీమాలోకి తొమ్మిదేళ్లలో రూ.54,000 కోట్ల ఎఫ్‌డీఐ

న్యూఢిల్లీ: బీమా రంగంలోకి గత తొమ్మిది సంవత్సరాల కాలంలో రూ.54,000 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయి. విదేశీ నిధుల నిబంధనలు ప్రభుత్వం సరళీకరించడం ఇందుకు దోహదపడిందని ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి వివేక్ జోషి అన్నారు. బీమా రంగంలోకి ఎఫ్‌డీఐ పరిమితి 2014 సంవత్సరంలో 26 శాతం ఉండగా 2015లో 49 శాతానికి, 2021లో 74 శాతానికి పెంచినట్టు ఆయన చెప్పారు. అలాగే బీమా రంగానికి చెందిన ఇంటర్మీడియేటరీల్లో ఎఫ్‌డీఐ పరిమితి 2019లో నూరు శాతానికి పెంచినట్టు ఆయన తెలిపారు. ఈ సంస్కరణల ఫలితంగా 2014 డిసెంబరు నుంచి 2024 జనవరి నెలల మధ్య కాలంలో బీమా రంగంలోకి రూ.53,900 కోట్ల విలువ గల ఎఫ్‌డీఐలు వచ్చాయన్నారు. ఇదే కాలంలో దేశంలో బీమా కంపెనీల సంఖ్య 53 నుంచి 70కి పెరిగిందని చెప్పారు. 2013-14 నుంచి 2022-23 మధ్య కాలంలో బీమా వ్యాప్తి 3.9 శాతం నుంచి 4 శాతానికి, బీమా సాంద్రత (తలసరి ప్రీమియం) 52 డాలర్ల నుంచి 92 డాలర్లకు పెరిగిందన్నారు. అంతే కాదు బీమా కంపెనీల నిర్వహణ లోని ఆస్తుల విలువ 2013-14 నుంచి మూడింతలు పెరిగి రూ.21.07 లక్షల కోట్ల నుంచి రూ.60.04 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,870 ▼	60,380 ▼	80,000 ▼
ముంబై	65,612 ▲	60,100 ▲	74,156 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ		విజయవాడ	423
హైదరాబాద్	410	విశాఖపట్నం	430
19వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	478	దజను గుడ్లు రూ.72	
గోదావరి	423		



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	గోదావరి	101
వరంగల్	99	విజయవాడ	101
కరీంనగర్	99	గుంటూరు	105
మహబూబ్‌నగర్	99	ఒంగోలు	105
కర్నూలు	99	చిత్తూరు	105
విశాఖపట్నం	98		



స్పోర్ట్స్

3 ఐపీఎల్ రోజుల్లో

పంజాబ్.. అయ్యేనా కింగ్?



గత ఏడాది ఐపీఎల్ ప్రారంభంలో చక్కటి విజయాలు సాధించిన పంజాబ్ కింగ్స్ టైటిల్ రేసులో ఉన్నానని చాటిచెప్పింది. కానీ టోర్నీ సాగిన కొద్దీ ఆ జట్టు ఆట తీరు గాడి తప్పింది. కెప్టెన్ ధవన్ గాయంతో అందుబాటులో లేకపోవడమూ పంజాబ్‌ను దెబ్బ తీసింది. ఇక.. 2014లో రన్నరప్‌గా నిలిచిన ఈ జట్టు అప్పటినుంచి తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ట్రోఫీని మాత్రం ముద్దాడలేకపోయింది. ఈమారు వేలంలో స్టార్ బౌలర్ హర్షల్ పటేల్‌తో పాటు దేశీ క్రికెటర్లను కొనుగోలు చేసి జోరుమీదున్న ధవన్ బృందం.. ఇకనైనా లీగ్ కింగ్‌గా అవతరిస్తుందేమో చూడాలి.

ఐపీఎల్ ఆరంభం నుంచి ఉన్న జట్లలో ఒకటైన పంజాబ్ కింగ్స్ ఈసారి ఎలాగైనా టైటిల్ పట్టేయాలన్న లక్ష్యంతో సిద్ధమైంది. ఈ క్రమంలో స్టార్లతో పాటు దేశీ క్రికెటర్లను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసింది. పైగా..కొత్తగా నిర్మించిన మహారాజా యదవీంద్ర సింగ్ స్టేడియం తమకు అచ్చివస్తుందన్న నమ్మకంతో ఉంది.

బలాలు: పొట్టి క్రికెట్‌కు సరిగ్గా సరిపోయే బౌలర్లతో పంజాబ్ జట్టు కళకళలాడుతోంది. కోట్లు కుమ్మరించి దక్కించుకున్న ఇంగ్లండ్ యువ పేసర్ సామ్ కర్రాన్, క్రిస్ వోక్స్, అర్ష్‌దీప్ సింగ్, రబాడ, నాథన్ ఎలిస్, రాహుల్ చాహర్, సికిందర్ రజాలతో పటిష్ఠంగా ఉంది జట్టు బౌలింగ్ యూనిట్. మ్యాచ్ ఏ సమయంలోనైనా ప్రత్యర్థులకు కళ్లెం వేయగల బౌలర్లు వారు. కెప్టెన్ ధవన్, బెయిర్ స్టో, హార్డ్ హిట్టర్ లివింగ్‌స్టోన్ సత్తా మేరకు బ్యాటింగ్ చేస్తే పంజాబ్ 'కింగ్' అయ్యే అవకాశాలు లేకపోలేదు.

బలహీనతలు: ఎక్కువగా విదేశీ స్టార్లే ఉండడం పంజాబ్‌కు ప్రతికూలం కానుంది. ప్రముఖులైన భారత క్రికెటర్లు లేకపోవడం జట్టు సమతూకాన్ని దెబ్బ తీయనుంది. తుది జట్టులో నలుగురే విదేశీ క్రికెటర్లకు చాన్సు ఉండడంతో బ్యాటింగ్ బలహీనం కానుంది.

పంజాబ్ కింగ్స్ జట్టు

ధవన్ (కెప్టెన్), జితేశ్ శర్మ, బెయిర్ స్టో, ప్రభ్‌సిమ్రన్, లివింగ్ స్టోన్, హర్‌ప్రీత్ భాటియా, రీలీ రూసో, హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, వోక్స్, అర్ష్‌దీప్, సామ్ కర్రాన్, రబాడ, ఎలిస్, సికిందర్, శశాంక్, విశ్వనాథ్, అశుతోష్, తనయ్ త్యాగరాజన్, టైడే, రిషి ధవన్, శివమ్ సింగ్, ప్రిన్స్ చౌధురి, హర్‌ప్రీత్ బ్రార్, కావేరప్ప.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)


శ్రేయాస్ అయ్యర్

కోల్‘కథ’ మారుతుందా!

గౌతమ్ గంభీర్ నాయకత్వంలో రెండుసార్లు విజేతగా నిలిచిన ఘనత కోల్‌కతా నైట్‌రైడర్స్‌ది. ఆ తర్వాత ఒక్కసారి మాత్రమే ఫైనల్‌కు రాగలిగిన ఆ జట్టు..తరచూ కెప్టెన్లను మారుస్తూ వస్తున్నా 'కథ' మాత్రం మారడంలేదు. దాంతో గంభీర్‌నే ఈ సీజన్‌లో జట్టు మెంటార్‌గా నియమించుకుంది ఫ్రాంచైజీ. మరి.. అతడి మార్గదర్శనంలో యువ క్రికెటర్ శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో రైడర్స్ టైటిల్ కొడుతుందేమో చూడాలి. మూడోసారి ఐపీఎల్ ట్రోఫీని పట్టేయాలని పట్టుదలగా ఉన్న కేకేఆర్ ఈసారి వేలంలో కళ్లు చెదిరే రీతిలో రూ. 24.75 కోట్లు వెచ్చించి ఆస్ట్రేలియా స్టార్ పేసర్ స్టార్క్‌ను కొనుక్కుంది.

కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు: శ్రేయాస్ (కెప్టెన్), భరత్, పాండే, గుర్బాజ్, రమణ్‌దీప్, నితీశ్, రూథర్‌ఫోర్డ్, రఘువంశీ, సాల్ట్, రింకూ, వెంకటేశ్, నరైన్, అనుకూల్, రస్సెల్, వైభవ్, చమీర, హర్షిత్, ముజీబుర్, సకారియా, సుయాష్, హసన్స్.

బలాలు: రస్సెల్, రింకూ సింగ్‌ల పవర్ హిట్టింగ్‌కు ఫిల్ సాల్ట్ తోడవడం జట్టుకు అదనపు బలం. సాల్ట్, గుర్బాజ్, వెంకటేశ్ డాషింగ్ బ్యాటింగ్‌తో అదిరే ఆరంభం ఇవ్వగలరు. ఆపై శ్రేయాస్, నితీశ్ రాణా సత్తా చాటితే రైడర్స్‌కు తిరుగుండదు. నరైన్, వరుణ్ చక్రవర్తి, ముజీబుర్, సుయాష్‌తో కూడిన స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు సవాలే. నిప్పులు చెరిగే బౌలింగ్‌తో బ్యాటర్లను బెంబేలెత్తించేందుకు స్టార్క్ ఎలాగూ ఉన్నాడు.

బలహీనతలు: డెత్ ఓవర్లలో స్టార్క్‌కు అండగా నిలిచే పేసర్ లేకపోవడం కోల్‌కతాకు దెబ్బ. దీంతో యువ పేసర్లు చేతన్ సకారియా, హర్షిత్ రాణా, వైభవ్ అరోరా రాణించడం కీలకం. మ్యాచ్ విన్నర్ ఆండ్రీ రస్సెల్ ఫామ్ కూడా రైడర్స్‌కు ఆందోళన కలిగిస్తోంది.

నిలకడ లోపం.. రాజస్థాన్‌కు శాపం!


సంజూ శాంసన్

షేన్ వార్న్ సారథ్యంలో ఆరంభ ఐపీఎల్‌లోనే చాంపియన్‌గా నిలిచి రాజస్థాన్ రాయల్స్ సంచలనం సృష్టించింది. ఇక, సంజూ శాంసన్ కెప్టెన్సీలో రెండు సంవత్సరాల కిందట టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా వహ్..వా..అనిపించింది. అయితే బట్లర్, శాంసన్, అశ్విన్, బౌల్ట్ వంటి అగ్రశ్రేణి క్రికెటర్లున్న ప్రస్తుత జట్టు.. నిరుడు ప్లేఆఫ్స్‌కు కూడా క్వాలిఫై కాకపోవడం జట్టు దిగజారిన ఫామ్‌కు అద్దంపట్టింది. దీంతో సుదీర్ఘ విరామం తర్వాత రెండోసారి విజేతగా నిలవాలని సంజూసేన ఉవ్విళ్లూరుతోంది.

బలాలు: బ్యాటింగ్ విభాగమే రాయల్స్ ప్రధాన ఆయుధం. జైస్వాల్, బట్లర్, శాంసన్, హెట్‌మయెర్, జురెల్, పొవెల్, పరాగ్‌లాంటి బ్యాటర్లు ఆ జట్టు సొంతం. వీరు చెలరేగితే ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యం నిర్దేశించడమైనా, టార్గెట్‌ను ఛేదించడమైనా రాజస్థాన్‌కు కష్టం కాబోదు. వరల్డ్ క్లాస్ స్పిన్నర్లు అశ్విన్, చాహల్, జంపా, అత్యంత సీనియర్ బౌల్ట్, యువ పేసర్ అవేశ్ ఖాన్ విజృంభిస్తే ప్రత్యర్థులకు తిప్పలే.

బలహీనతలు: బ్యాటింగ్, బౌలింగ్‌లో బలీయంగా ఉన్నా..రెండు విభాగాల్లోనూ నిలకడలేమి జట్టును దెబ్బ తీస్తోంది. ఇది నిరుడు స్పష్టంగా కనిపించింది. పైగా..2022లో ఆ జట్టు అద్భుత విజయాల్లో ముఖ్యభూమిక పోషించిన పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ గాయంతో వరుసగా రెండో ఏడాదీ టోర్నీకి దూరం కావడం రాయల్స్‌కు కోలుకోలేని దెబ్బ. ఏదేమైనా..నిలకడలేమిని అధిగమిస్తే 'రాయల్'గా నిలిచే చాన్సుంది.

రాజస్థాన్ రాయల్స్ జట్టు: సంజూ శాంసన్ (కెప్టెన్), బట్లర్, హెట్‌మయెర్, జైస్వాల్, జురెల్, పరాగ్, డొనొవాన్ ఫెరీరా, కునాల్, అశ్విన్, కుల్దీప్ సేన్, సైనీ, సందీప్ శర్మ, బౌల్ట్, చాహల్, జంపా, అవేశ్ ఖాన్, పొవెల్, శుభమ్ దూబే, కోహ్లర్, ఆబిద్, నంద్రే బర్గర్.



రోహిత్ చేయి.. ఎల్లప్పుడూ నా భుజంపైనే!

ముంబై ఇండియన్స్ కొత్త కెప్టెన్ హార్దిక్

ముంబై: ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన సారథుల్లో ఒకడిగా నిలిచిన రోహిత్‌ను పక్కనబెట్టి ఈసారి ముంబై ఇండియన్స్ జట్టు పగ్గాలను హార్దిక్ పాండ్యాకు అప్పగించిన విషయం తెలుసుగా! దీంతో మైదానంలో ఇరువురి సంబంధాలపై అభిమానుల్లో చర్చ సాగుతున్న నేపథ్యంలో.. జట్టు కెప్టెన్‌గా తొలిసారి ప్రెస్‌మీట్‌కు హాజరైన పాండ్యా ఇదే విషయమై స్పష్టతనిచ్చాడు. 'నా సారథ్యంలో ఆడేందుకు రోహిత్‌కు ఇబ్బంది ఉండదు. నేను కూడా చాలాకాలంగా అతని నాయకత్వంలో ఆడాను. ఇప్పటికీ రోహిత్ టీమిండియా కెప్టెనే. అతడి సహాయం, సూచనలతోనే జట్టును నడిపిస్తా. ఈ సీజన్ మొత్తం అతడి చేయి నా భుజంపై ఉంటుందని భావిస్తున్నా. కెప్టెన్సీ మార్పుపై అనేక మంది రకరకాలుగా స్పందించారు. వారి భావోద్వేగాలను గౌరవిస్తా. ఏదేమైనా రోహిత్ సాధించిన విజయాలను నేనూ కొనసాగిస్తా' అని హార్దిక్ అన్నాడు.

రెజ్లింగ్‌పై మళ్లీ బ్రిజ్‌భూషణ్ నీడ?

- అడ్‌హాక్ కమిటీని రద్దు చేసిన ఐఓఏ
- సంజయ్ సారథ్యంలోని సమాఖ్యకు పూర్తి అధికారం



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) పాలనాధికారం మళ్లీ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అనుయాయ వర్గం చేతుల్లోకి వెళ్లింది. భూపీందర్ సింగ్ బజ్వా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల రెజ్లింగ్ అడ్‌హాక్ కమిటీని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సోమవారం రద్దు చేసింది. డబ్ల్యూఎఫ్ఐపై విధించిన నిషేధాన్ని యునైటెడ్ రెజ్లింగ్ సమాఖ్య ఎత్తివేయడంతో.. తాత్కాలిక కమిటీ అవసరం ఇక లేదని ఐఓఏ తెలిపింది. ఒలింపిక్ క్వాలిఫికేషన్ టోర్నీకి సంబంధించిన సెలెక్షన్ ట్రయల్స్‌ను అడ్‌హాక్ కమిటీ పూర్తి చేయడం కూడా ఈ నిర్ణయం తీసుకోవడానికి దోహదం చేసిందని పేర్కొంది. దీంతో డబ్ల్యూఎఫ్ఐపై ఇప్పటికే అధ్యక్షుడిగా ఎన్నికైన సంజయ్ సింగ్ అండ్ కోకు మళ్లీ పూర్తిస్థాయి అధికారం దక్కింది. స్పోర్ట్స్ కోడ్‌ను ఉల్లంఘించడంతో గత డిసెంబరులో రెజ్లింగ్ సమాఖ్యపై క్రీడా శాఖ సస్పెన్షన్ విధించింది. ఆ స్థానంలో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా ఐఓఏకు సూచించింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ అప్పటి అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగట్, సాక్షి మాలిక్, బజ్‌రంగ్ నేతృత్వంలో ఆందోళన చేయడం.. అనంతరం జరిగిన సమాఖ్య ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ అనుచరుడైన సంజయ్ అధ్యక్షుడిగా ఎన్నికైన సంగతి తెలిసిందే.

బంగ్లాదే వన్డే సిరీస్

ఛట్టోగ్రామ్: శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో బంగ్లాదేశ్ దక్కించుకుంది. సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో బంగ్లా 4 వికెట్లతో నెగ్గింది. ముందుగా లంక 50 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. లియనగె (101 నాటౌట్) శతకం సాధించాడు. అనంతరం బంగ్లా 40.2 ఓవర్లలో 6 వికెట్లకు 237 పరుగులు చేసి నెగ్గింది.

ఆర్సీబీ శిబిరంలో కోహ్లీ



బెంగళూరు: విరాట్ కోహ్లీ రెండు నెలల విరామం తర్వాత ప్రాక్టీస్ ఆరంభించాడు. ఐపీఎల్ కోసం అతను సోమవారం బెంగళూరు (ఆర్సీబీ) జట్టు శిబిరంలో చేరాడు. 'ఐపీఎల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. బెంగళూరులో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది' అని కోహ్లీ ఈ సందర్భంగా తెలిపాడు.

సింధు పుంజుకొనేనా?

నేటినుంచి స్విస్ ఓపెన్



బాసెల్ (స్విట్జర్లాండ్): గతవారం ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లోనే వెనుదిరిగిన ఏస్ షట్లర్ పీవీ సింధు.. మళ్లీ పుంజుకోవాలనుకొంటోంది. మంగళవారం నుంచి జరిగే స్విస్ ఓపెన్‌లో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. తొలి రౌండ్‌లో యొవన్నీ లీ (జర్మనీ)తో సింధు తలపడనుంది. సింగిల్స్‌లో లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, ప్రియాంశు, కిరణ్ జార్జ్.. డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా, ట్రీసా జాలీ-గాయత్రి, రితుపర్ణ-శ్వేతపర్ణ జోడీలు బరిలో ఉన్నాయి.

సర్ఫరాజ్, జురెల్‌లకు సెంట్రల్ కాంట్రాక్ట్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో విశేషంగా రాణించిన సర్ఫరాజ్, కీపర్ ధ్రువ్ జురెల్‌లకు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. సోమవారం జరిగిన బోర్డు అపెక్స్ కౌన్సిల్‌లో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో వీరికి వేతనం కింద ఏడాదికి రూ.కోటి దక్కనుంది. ఇక, డిసెంబరు, జనవరిలో ఉత్తరాదిన మంచు, వెలుతురు లేమి సమస్య ఉంటుంది కాబట్టి ఆ సమయాల్లో అక్కడ రంజీ మ్యాచ్‌లు నిర్వహించకూడదని బోర్డు యోచిస్తోంది.

జ్యోతికకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియా ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జ్యోతికశ్రీ కాంస్య పతకం సాధించింది. సోమవారం తిరువనంతపురంలో జరిగిన ఈ పోటీల్లో 400 మీటర్ల రేసును జ్యోతిక 52.73 సెకన్లలో పూర్తి చేసి, తృతీయ స్థానంలో నిలిచింది.

ఈ ఐపీఎల్‌లో కొత్త రాహుల్‌ను చూస్తాం


ఎమ్మెస్కే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఈ ఐపీఎల్‌లో కొత్త కేఎల్ రాహుల్‌ను చూస్తామని మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. సోమవారం స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ప్యానెల్ ఎక్స్‌పర్ట్స్ పరిచయ కార్యక్రమంలో ఎమ్మెస్కే మాట్లాడుతూ.. రాహుల్ పూర్తి సత్తాను బయటకు తీసేందుకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లాంగర్ ప్రయత్నిస్తున్నాడని, మూడు నెలలుగా వీరిద్దరు ఈ సీజన్ ఐపీఎల్ కోసం కసరత్తు చేస్తున్నారని చెప్పాడు. రాహుల్ గాయం నుంచి కోలుకున్నాక వన్డే వరల్డ్‌కప్‌లో బ్యాటింగ్, కీపింగ్‌లో అదరగొట్టాడని గుర్తు చేశాడు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా రాహుల్ పూర్తి సామర్థ్యం బయటపెడితే ఈ ఐపీఎల్‌లో లఖ్‌నవూ జట్టుకే కాకుండా భవిష్యత్‌లో టీమిండియాకు కూడా అది ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు.

బాపట్ల ఎంపీ సీటుకు ఎమ్మెస్ రాజు ఖరారు

- పెనమలూరుకు పరిశీలనలో ఆలపాటి రాజా?
- చీపురుపల్లిలో బొత్సపై పోటీకి గంటానే...



అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బాపట్ల (ఎస్సీ) లోక్‌సభ సీటుకు పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు పేరును తెలుగుదేశం పార్టీ ఖరారు చేసింది. సోమవారం ఇక్కడ ఆ పార్టీ అధినేత చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం జరిగినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఎస్సీలకు రిజర్వు అయిన ఈ పార్లమెంటు సీటుకు మాదిగ ఉప కులానికి చెందిన మంచి అభ్యర్థి కోసం ఆ పార్టీ కొంత కాలంగా అన్వేషిస్తోంది. పార్టీ దళిత విభాగానికి అధ్యక్షుడిగా ఉండి బాగా పనిచేసినందుకు గుర్తింపుగా రాజుకు ఈ సీటును ఇస్తే బాగుంటుందని సమావేశంలో పార్టీ నేతలు అభిప్రాయపడినట్లు సమాచారం. రాజు స్వస్థలం అనంతపురం జిల్లా. కాగా, పెనమలూరు సీటుకు తాజాగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరు పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. రాజేంద్రప్రసాద్ గతంలో గుంటూరు జిల్లా తెనాలి నుంచి ప్రాతినిధ్యం వహించారు. కూటమి సీట్ల సర్దుబాటులో ఈ సీటు జనసేన పార్టీలో ముఖ్య నేత నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. దీనితో రాజా పేరును ఈ సీటుకు పరిశీలిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో వినవస్తోంది. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేరును విజయనగరం జిల్లా చీపురుపల్లికి ఎంపిక చేసినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రెండు రోజుల కిందట చంద్రబాబును గంటా కలిసి మాట్లాడారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని గంటా హామీ ఇచ్చినట్లు సమాచారం. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన నేతలు పెద్ద సంఖ్యలో సోమవారం ఇక్కడ చంద్రబాబును కలిశారు. తమ వర్గానికి అనంతపురం జిల్లా పుట్టపర్తి సీటు కేటాయించాలని వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. పరిశీలిస్తానని చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు.

కూటమికే ఎమ్మార్పీఎస్ మద్దతు

- చంద్రబాబు హయాంలోనే మాదిగలకు మేలు : మంద కృష్ణమాదిగ



ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : మాదిగల వ్యతిరేకి జగన్మోహన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ఓడించి, టీడీపీ, జనసేన, బీజేపీల కూటమిని గెలిపించడానికి మాదిగ రిజర్వేషన్ సమితి (ఎమ్మార్పీఎస్) సిద్ధంగా ఉందని ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. సోమవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాదిగలకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతుంటే రాష్ట్రం తరఫున ఒక్క లాయర్‌ను కూడా నియమించకపోవడం దుర్మార్గమన్నారు. మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వకుండా తీరని అన్యాయం చేసిందన్నారు. వర్గీకరణ జరిగితే మాదిగలకు, విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. అయితే మాదిగలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 22వేల మందికి ఉద్యోగాలు రావడంతోపాటు, సంక్షేమం, రాజకీయంగా మేలు జరిగిందన్నారు. ఈ ఐదేళ్లలో జగన్‌రెడ్డి దళితద్రోహిగా మిగిలిపోయారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎస్సీల కోసం ప్రవేశపెట్టిన పథకాలను నిలిపివేయడం దారుణమన్నారు. ముఖ్యంగా విదేశీ విద్య పథకానికి ఉన్న అంబేడ్కర్ పేరును తొలగించి, జగన్ విదేశీ విద్య అని పెట్టడం సిగ్గుచేటు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఎన్డీఏ ప్రభుత్వం అనుకూలంగా ఉందని, ఇప్పటికే మోదీ ఇచ్చిన హామీలపై తమకు విశ్వాసముందని తెలిపారు. త్వరలోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను కలవనున్నట్లు కృష్ణమాదిగ తెలిపారు.

కూటమి గెలుపే లక్ష్యం కావాలి: నాగబాబు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో జనసేన - టీడీపీ - బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కే నాగబాబు సూచించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి కృష్ణ, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, గోదావరి జిల్లాలకు చెందిన పలువురు నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ప్రచారం కోసం రావాలని నాగబాబును కోరారు. తప్పనిసరిగా వస్తానని హామీ ఇచ్చిన ఆయన మాట్లాడుతూ, 'ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో పోటీకి అవసరమైన ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాల ప్రణాళికలు ముమ్మరం చేయాలి. జనసేన పార్టీ పోటీ చేస్తున్న నియోజకవర్గాలతో పాటు పొత్తు ధర్మంలో భాగంగా బీజేపీ, టీడీపీ అభ్యర్థులు పోటీ చేసే నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన బాధ్యత మనపై ఉంది. పొత్తులో భాగంగా పలువురు నాయకులకు సీట్లు సర్దుబాటు చేయలేకపోయారు. విశాల దృక్పథంతో ఆలోచన చేసి కూటమి విజయంలో భాగస్వాములు కావాలి. పార్టీ కోసం నిలిచిన వారికి కూటమి ప్రభుత్వంలో తగిన గౌరవం, గుర్తింపు ఇస్తారు' అని స్పష్టం చేశారు.

అసుర గణం తుడిచిపెట్టుకుపోవడం ఖాయం

- సీబీఐ చార్జ్‌షీట్ ఆధారంగా వివేకా బయోపిక్: రఘురామరాజు

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో మే 13న సీఎం జగన్ పీడ విరగడవుతుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌తో పాటు ఆయనను నమ్ముకున్న కొంతమంది అసుర గణం తుడిచిపెట్టుకుపోవడం ఖాయం' అని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'చిలకలూరిపేటలో టీడీపీ కూటమి అధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయింది. సభకు జనం లక్షలాదిగా స్వచ్ఛందంగా తరలి వచ్చారు. జగన్ తరహాలో సారా, డబ్బులు పంపిణీ చేయలేదు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపేసి, మనల్ని మనం కాపాడుకోవాలన్న కసి ప్రజల్లో స్పష్టంగా కనిపించింది. సీబీఐ చార్జ్‌షీట్‌లో పొందుపరిచిన అంశాల ఆధారంగా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి బయోపిక్‌ను రూపొందించినట్లుగా మేకర్స్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం వేదికగా దాని టీజర్‌ను విడుదల చేశారు. ఈ నెల 22న యూట్యూబ్ మాధ్యమంలో ఆ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లుగా చెప్పారు. ఈ చిత్రం ద్వారా ప్రజలకు కొన్ని నమ్మలేని నిజాలు, సాక్షి రాతలు అబద్ధాలని తెలిసే అవకాశం ఉంది' అని అన్నారు.

చెప్పుతో కొట్టినట్టే చెప్పిస్తాం: ఆదినారాయణరెడ్డి

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ డైరెక్ట్‌గా చెప్పలేదని వైసీపీ వాళ్లు మాట్లాడుతున్నారు. అంటే చెప్పుతో కొట్టినట్లు చెప్పలేదనా..! చెప్పుతో కొట్టినట్టే చెప్పిస్తాం. ఇంకా 50 రోజులు ఉంది. చాలా సార్లు వస్తారు రాష్ట్రానికి.. డబుల్‌ఇంజన్ ప్రభుత్వం అంటే అర్థం కాదా?' అంటూ మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి మండిపడ్డారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. 'సొంత చెల్లెళ్లే మా అన్నకు ఓటెయ్యొద్దని చెపుతున్నారంటే ఇంతకు మించిన అవమానం జగన్‌రెడ్డికి ఏముంటుంది? నీ తల్లిని నీచంగా మాట్లాడిన బొత్స సత్యనారాయణ, నిన్ను ఉరి తీయాలన్న ధర్మాన నీ దగ్గరే మంత్రులు. చంద్రబాబు రాష్ట్రం కోసం ఎన్డీఏ నుంచి బయటికి వెళ్లి మళ్లీ కలిస్తే తప్పా? సొంత చిన్నాన్నను గుండెపోటుతో నీ టీవీలో చంపేశావ్... సీబీఐ గొడ్డలి పోటని తేల్చింది... అయినా సిగ్గు లేకుండా నిందితుడికి కడప ఎంపీ టికెట్ ఇచ్చావ్' అంటూ ఫైర్ అయ్యారు.

'ప్రజాగళం'లో పోలీస్ నిర్లక్ష్యం

- ప్రధాని పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యం.. విచారణ జరగాలి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: నాదెండ్ల మనోహర్

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాల్గొన్న 'ప్రజాగళం' సభలో పోలీసు శాఖ నిర్లక్ష్య వైఖరి అడుగడుగునా కనిపించిందని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'ప్రధాని పాల్గొన్న సభకు జారీ చేసిన కీలక పాసుల విషయంలో పోలీసులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఎటువంటి వివరాలూ నింపకుండా ఖాళీ పాసులను జిల్లా అధికారులు సంతకాలు చేసి జారీ చేయడం భద్రతా డొల్లతనాన్ని సూచిస్తోంది. ఇది కలెక్టర్ కార్యాలయ అధికారులు, పోలీస్ శాఖ తప్పిదమే. సభ జరుగుతున్న సమయంలోనూ భద్రతా వైఫల్యాలు స్పష్టంగా కనిపించాయి. జనాన్ని నియంత్రించే దిశగా పోలీసు శాఖ ఎక్కడా చర్యలు చేపట్టలేదు. పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై సమగ్ర విచారణ జరగాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. సభా ప్రాంగణం అంతా పోలీసుల చేతుల్లోనే ఉన్నప్పటికి వారు పట్టనట్లు వ్యవహరించారు. దీంతో సభకు అంతరాయం కలిగింది' అని ఆరోపించారు.

ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలి: ధూళిపాళ్ల

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని హాజరైన సభ భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోరారు. లక్షలాది మంది వచ్చే ప్రధాని సభకు పోలీసులు ఇచ్చే భద్రత ఇదేనా? వేదిక వైపు జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా అని నిలదీశారు. జగన్ ప్రభుత్వం, కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.



20 రోజులు.. 60 స్థానాలు

- 22 నుంచి చంద్రబాబు ప్రచార భేరి
- రోజుకు 3 నియోజకవర్గాల్లో 'ప్రజాగళం'
- ఉదయం ఒకచోట శ్రేణులతో ముఖాముఖి
- మధ్యాహ్నం రెండో నియోజకవర్గ కేంద్రంలో రోడ్‌షో
- సాయంత్రం మూడో చోట.. రాత్రికి అక్కడే బస
- వీటి తర్వాత విరామమిచ్చి రెండో విడత పర్యటనలు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 22వ తేదీ నుంచి ఎన్నికల ప్రచార భేరి మోగించనున్నారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు జరపాలని నిర్ణయించారు. ప్రజాగళం పేరుతో ఈ సభలు చేపడతారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సోమవారమిక్కడ ఉండవల్లి నివాసంలో భవిష్యత్ కార్యక్రమంపై పార్టీ నేతలతో ఆయన చర్చించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. మూడు పార్టీల ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ఆదివారం భారీ బహిరంగ సభ విజయవంతమైందని.. పార్టీ శ్రేణుల్లో ఈ ఊపు తగ్గకుండా వెంటనే ప్రజల్లోకి వెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఖరారైన కార్యక్రమం ప్రకారం.. ఈసారి పర్యటనలను కొంత వినూత్నంగా నిర్వహిస్తారు. చంద్రబాబు ప్రతి రోజూ ఉదయం ఒక నియోజకవర్గంలో కేవలం పార్టీ శ్రేణుల సమావేశంలో పాల్గొంటారు. బూత్ కన్వీనర్ మొదలుకొని మండల పార్టీ అధ్యక్షుల వరకూ 6 వేల మంది చురుకైన నేతలను దీనికి పిలుస్తారు. ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, వివిధ అంశాలపై పార్టీ వైఖరి, ఎన్నికల్లో పనిచేయాల్సిన తీరు మొదలైనవాటిని వివరిస్తారు. తర్వాత మధ్యాహ్నం ఇంకో నియోజకవర్గ కేంద్రంలో.. సాయంత్రం మరో నియోజకవర్గ కేంద్రంలో రోడ్‌షోలు నిర్వహిస్తారు. మూడో నియోజకవర్గంలో రాత్రికి బస చేస్తారు. ఇలా వరుసగా ఇరవై రోజులపాటు అరవై నియోజకవర్గాలను చుట్టేస్తారు. దీని తర్వాత కొంత విరామం ఇచ్చి రెండో విడత పర్యటనలు ప్రారంభిస్తారు. 'కేంద్రంలో ఎన్డీయేకు 400 స్థానాలు, రాష్ట్రంలో టీడీపీ కూటమికి 160 స్థానాలు రావాలన్నది మన లక్ష్యం. దీనికి ఒక్క సీటు కూడా తగ్గడానికి వీల్లేదు. ప్రజల్లో సానుకూల వాతావరణం ఉంది. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంది. దీనిని అందిపుచ్చుకోవాలి. ఈ లక్ష్య సాధన కోసం మన పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలి' అని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు.

చిలకలూరిపేట సభకు స్పందనపై హర్షం

ప్రధాని మోదీ పాల్గొన్న చిలకలూరిపేట సభకు ప్రజల నుంచి వచ్చిన స్పందనపై ఈ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. 'జగన్ సభల్లో సభ ముగియడానికి ముందే ప్రజలు వెళ్ళిపోతుంటే ఈ సభలో సభ ముగిసేవరకూ వేల సంఖ్యలో వస్తూనే ఉన్నారు. లక్షలాదిగా తరలివచ్చిన ప్రజానీకం.. కూటమికి రాష్ట్రంలో ఉన్న ఊపును చాటింది. అధికార పార్టీ మాదిరిగా మనం జన సమీకరణకు వందల కోట్లు విరజిమ్మలేదు. గ్రామాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ప్రజలు వచ్చిన స్థాయిలో మనం మైదానాన్ని ఏర్పాటు చేయలేకపోయాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సభకు వచ్చిన స్పందనపై ప్రధాని కూడా సంతృప్తి వ్యక్తం చేశారని, ప్రజల్లో మంచి ఉత్సాహం కనిపించిందనీ వ్యాఖ్యానించారని చెప్పారు. ఈ సభలో చోటు చేసుకున్న కొన్ని లోపాలపైనా చర్చించారు. సభా ప్రాంగణానికి రెండు వైపులా జాతీయరహదారిపై ఇరవై కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించిందని, వేల మంది ప్రజానీకం అక్కడే ఆగిపోయారని, డ్రోన్ ద్వారా ఆ పరిస్థితిని చిత్రీకరిస్తే ఈ సభ స్థాయి ఏమిటో ప్రజలకు తెలిసేదని చంద్రబాబు అన్నారు. ప్రధాని మాట్లాడే సమయంలో కాసేపు మైకు పనిచేయకపోవడంపైనా చర్చ జరిగింది. ఉద్దేశపూర్వక కుట్ర జరిగి ఉండవచ్చని ఒకరిద్దరు పార్టీ నేతలు అనుమానం వ్యక్తం చేశారు. 'పోలీసుల వైపు నుంచి చాలా సమస్యలు వచ్చాయి. సభకు వచ్చే వాహనాలను నేరుగా ప్రాంగణానికి రానివ్వకుండా బొప్పూడి లోపల నుంచి వెళ్లాలని పోలీసులు సూచించారు. అటుగా వెళ్తే సభా ప్రాంగణం లోపలకు పోలీసులు రానివ్వలేదు. వెనక్కి రాలేక, ప్రాంగణం లోపలకు వెళ్లలేక వేల మంది అక్కడే చిక్కుకుపోయారు. అందులో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. వాహనాలకు పార్కింగ్ ప్రదేశాల సమాచారం కూడా పోలీసులు ఇవ్వలేదు. జాతీయ రహదారి మీద కిలోమీటర్ల తరబడి వాహనాలు నిలిచిపోయినా పట్టించుకోలేదు. ఇవన్నీ కావాలని చేసినట్లు కనిపిస్తోంది' అని పేర్కొన్నారు. పోలీసు అధికారుల తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

త్వరలో ముస్లిం డిక్లరేషన్

- రాష్ట్ర హితం కోసమే బీజేపీతో కలిశాం
- వారికి పూర్తి భరోసా కల్పిస్తాం
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ముస్లిం నేతలకు టీడీపీ అధినేత వినతి

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి త్వరలోనే ముస్లిం డిక్లరేషన్ ప్రకటిస్తుందని, ముస్లింలకు పూర్తి భరోసా కల్పిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారం ఉండవల్లిలో ఆయన ముస్లిం నేతలతో సమావేశమయ్యారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యానే బీజేపీతో కలిశామన్నారు. ముస్లిం సమాజం దూరదృష్టితో అర్థం చేసుకుని తమకు బాసటగా నిలవాలని కోరారు. గతంలో కూడా బీజేపీతో కలిసినప్పటికీ ముస్లింల ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ అంశాల్లో పూర్తిగా టీడీపీ ముస్లిం సమాజానికి వెన్నుదన్నుగా ఉందని గుర్తుచేశారు. 'సీఎం జగన్ ముఖంలో ఓటమి భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో కోడికత్తి డ్రామా నుంచి బాబాయి హత్య వరకు అన్ని అస్త్రాలూ ఉపయోగించిన ఆయన.. ఇప్పుడు మతాలు, కులాలపై పడ్డారు. జనసేనతో పొత్తు విషయంలో కుల రాజకీయం చేసి బోల్తాపడ్డారు. టీడీపీ-బీజేపీ పొత్తుతో ముస్లిం మైనారిటీలకు నష్టం అంటూ వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు. ముస్లిం సంఘాల నేతలు కూడా వైసీపీ మత రాజకీయాలను ఎండగట్టాలి' అని పిలుపిచ్చారు. ముస్లింలపై జగన్‌కు నిజంగా ప్రేమ ఉంటే రంజాన్ మాసంలో తామిచ్చిన రంజాన్ తోఫా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ముస్లింలకు ఇచ్చే దుల్హన్ పథకం, దుకాణ్-మకాన్ సహా పది సంక్షేమ పథకాలను రద్దు చేశారని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వంలో ముస్లింలకు ఒక్క పథకమైనా ఉంటే చెప్పాలని నిలదీశారు. టీడీపీ హయాంలో కడపలో 90 శాతం పూర్తిచేసిన హజ్ హౌస్‌ను కూడా పూర్తి చేయలేకపోయిన జగన్‌కు మైనారిటీల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ మాట్లాడారు. తాను, చంద్రబాబు మాట్లాడిన మాటలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా వైసీపీ ఎడిటింగ్ చేసి వీడియోలు విడుదల చేసి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీతో టీడీపీ కలవడాన్ని చిలువలు పలువలు చేసి ముస్లింలలో అభద్రతా భావాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు.



కడప బరిలో షర్మిల!

- వివేకా హత్య కేసు నిందితుడు వైఎస్ అవినాశ్‌రెడ్డిపై పోటీ
- రాహుల్ సూచనకు ఓకే చెప్పిన పీసీసీ సారథి?
- ఒకట్రెండు రోజుల్లో ప్రకటన

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు తెలిసింది. అగ్ర నేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ఆదివారం ముంబైలో ముగిసిన సందర్భంగా షర్మిల సహా వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు అక్కడకు వెళ్లి ఆయనకు సంఘీభావం తెలిపారు. ఆ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానంలో బరిలోకి దిగాలని రాహుల్ సూచించగా.. ఇందుకు షర్మిల సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. కడప లోక్‌సభ బరిలో వైసీపీ తరఫున సిటింగ్ ఎంపీ, వరుసకు తమ్ముడైన వైఎస్ అవినాశ్‌రెడ్డిని అభ్యర్థిగా సీఎం జగన్ ప్రకటించారు. ఆయన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాశ్ నిందితుడన్న సంగతి తెలిసిందే. తన తండ్రి హత్య హత్య కేసులో న్యాయపోరాటం చేస్తున్న వివేకా కుమార్తె సునీతకు షర్మిల ఇప్పటికే సంఘీభావం ప్రకటించారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో వివేకా హత్యను జగన్ తనకు అనుకూలంగా మలచుకున్నారు. నాటి సీఎం చంద్రబాబు, టీడీపీ నేతలపై ఆరోపణలు గుప్పించారు. సీబీఐతో దర్యాప్తు చేయించాలని హైకోర్టును ఆశ్రయించారు. అధికారంలోకి వచ్చాక సీబీఐ అక్కర్లేదంటూ పిటిషన్ ఉపసంహరించుకున్నారు. అనంతర పరిణామాల్లో సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశించడం.. అవినాశ్, ఆయన తండ్రి పాత్ర ఉన్నట్లు సీబీఐ తేల్చడంతో ఇప్పుడు కూడా వివేకా హత్య కేసు ప్రచారాస్త్రమైంది. ఈ కేసులో నిందితుడైన అవినాశ్‌పై పోటీచేస్తే రాష్ట్రం యావత్తూ కడప వైపు చూస్తుందని షర్మిలతో రాహుల్ అన్నట్లు తెలిసింది. దీంతో ఆమె సమ్మతించారని పీసీసీ వర్గాలు అంటున్నారు. కుటుంబ సభ్యులతో చర్చించాక ఒకట్రెండు రోజుల్లో ఆమె నిర్ణయం ప్రకటిస్తారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కాగా కడప లోక్‌సభకు షర్మిల పోటీ చేయాలన్న అంశంపై సంప్రదింపులు జరుగుతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీనిపై పార్టీలో అభిప్రాయ సేకరణ జరుగుతోందన్నారు. ఆమె ఎన్నికల బరిలో నిలిస్తే పార్టీ అభ్యర్థుల్లో ఉత్సాహం నింపినట్లు అవుతుందని ఏపీసీసీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

వీరికి.. పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి!

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 18 నాటికి సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తామని, అప్పటికి కొవిడ్ అనుమానితులు, కొవిడ్ నిర్ధారణ అయిన వాళ్లు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు, దివ్యాంగులు.. ఈ నాలుగు విభాగాలకు చెందిన వారు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చంటూ అనుమతించింది. ఈ మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వారి దరఖాస్తులను ఆయా రిటర్నింగ్ అధికారులు పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆర్వో అనుమతిస్తేనే వారికి పోస్టల్ బ్యాలెట్ కేటాయిస్తామని పేర్కొంది.

ప్రజాధనంతో ప్రచార రథం!

- జగన్ ఎన్నికల ప్రచారానికి ఆర్టీసీ బుల్లెట్ ప్రూఫ్ బస్సులు
- 35 కోట్లతో కొన్న యాజమాన్యం
- ఒకటి విజయవాడకు చేరిక
- రెండు రోజుల్లో ఇంకోటి కూడా

విజయవాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజలు కట్టిన పన్నులతో సీఎం జగన్ తన పార్టీ తరఫున ప్రచారం చేసుకునేందుకు ఏకంగా బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొనుగోలు చేయించారు. అత్యంత ఖరీదైన ఈ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ఆగమేఘాలపై కొనుగోలు చేసింది. వీటిలో ఒక బస్సు సోమవారం విజయవాడకు చేరుకుంది. ఇప్పటికే నాన్ బుల్లెట్ ప్రూఫ్ శ్రేణిలో మూడు మినీ కార్వాన్ బస్సులు విజయవాడ రాగా.. తాజాగా ఓల్వో కంపెనీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ బస్సు ఒకటి ప్రచారానికి సిద్ధమైంది. మరో రెండు మూడు రోజులలో రెండో బుల్లెట్ ప్రూఫ్ బస్సు కూడా రానుంది. ఈ రెండు బస్సులను గతంలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాల కోసం కొనుగోలు చేయించినట్టుగా ప్రచారం జరిగినప్పటికీ.. జగన్ తన ఎన్నికల ప్రచారం కోసమే ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేయించారని తెలుస్తోంది. ఈ బుల్లెట్ ప్రూఫ్ బస్సులు రెండింటినీ జగన్ తన ప్రచారంలో వినియోగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలు, బహిరంగ సభల ఏర్పాట్లను పర్యవేక్షించే ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ ఈ బస్సులను కూడా పర్యవేక్షిస్తున్నారు. ఈ బుల్లెట్ ప్రూఫ్ బస్సులలో సీఎం జగన్ అవసరాలు, సౌకర్యాలకు అనుగుణంగా చేపట్టవలసిన మార్పులు, చేర్పులపై రఘురామ్ ఆర్టీసీ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ప్రభుత్వ ఆస్తులను రాజకీయ పార్టీలు వినియోగించటానికి వీల్లేదు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన బస్సులు ఇస్తుంది కాబట్టి.. ఆ విధానంలోనే తాము వీటిని తీసుకోవాలని భావిస్తున్నట్టు వైసీపీ ప్రచారం చేస్తోంది. దీనివల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. బుల్లెట్ ప్రూఫ్ రెండు బస్సులు, నాన్ బుల్లెట్ ప్రూఫ్ మూడు బస్సులు కలిపి మొత్తం ఐదు బస్సులను ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి ఉపయోగించనున్నారు.

పాతవి పక్కన పెట్టేసి

సీఎం జగన్ పర్యటనల కోసం ఇప్పటికే రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులు ఉన్నాయి. అయితే వాటిని పెద్దగా ఉపయోగించడం లేదు. దాదాపు మూడేళ్ల పాటు వాటిని పక్కన పెట్టేశారు. ఇటీవల కాలంలో మాత్రమే ఆయన వీటిని వాడుతున్నారు. ఈ మధ్య ఈ రెండు బస్సులను రూ.3.50 కోట్లతో మరమ్మతులు కూడా చేయించారు. అయినప్పటికీ, రూ.35 కోట్లకు పైగా డబ్బులు వెచ్చించి మరీ 5 బస్సులను కొనుగోలు చేయించారు. బుల్లెట్ ప్రూఫ్ బస్సులు ఓల్వో కంపెనీకి చెందినవి. వీటి ఖరీదు కూడా ఎక్కువ. ఒక్కో బస్సు రూ.13 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సొమ్ముతో ఈ బస్సులను కొనుగోలు చేయించి.. మళ్లీ ఆ బస్సులనే అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవాలని సీఎం జగన్ భావిస్తున్నారు. అదే వేరే సంస్థ నుంచి అద్దెకు తీసుకుంటే ఎక్కువ మొత్తంలో చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. అందుకే ఆర్టీసీతో కొనుగోలు చేయించి, తక్కువ అద్దెతో సరిపెట్టవచ్చని తెలిసింది.



విలాస వంతమైన సౌకర్యాలు

జగన్ కోసం కొనుగోలు చేసిన బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో విలాస వంతమైన సౌకర్యాలు ఉన్నాయి. బెడ్ రూమ్, టాయ్‌లెట్స్, కాన్ఫరెన్స్ హాల్, టీవీ, వైఫై, మినీ ఆఫీసు, సీసీ కెమెరాలు, బస్సు చుట్టూ సౌండ్ సిస్టమ్, ముఖ్యమంత్రి బస్సు పైకి ఎక్కటానికి వీలుగా మెట్లు, బస్సెక్కిన తర్వాత ప్రసంగించటానికి వీలుగా విఐపీ డయాస్ వంటివి ఏర్పాటు చేశారు.

పరదాలు దాటి ప్రచారానికి..

వచ్చే వారంలో జగన్ బస్సు యాత్ర.. నెలరోజులపాటు నిర్వహణ

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల ముఖ్యమంత్రి హోదాలో పరదాలు, బారికేడ్ల మధ్య తిరిగిన జగన్మోహన్‌రెడ్డి... ఎన్నికల ముందు జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. 'మేమంతా సిద్ధం' పేరిట ఈ నెల 26 లేదా 27వ తేదీ నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నారు. దాదాపు నెలరోజుల పాటు ఈ యాత్ర జరగనుంది. పులివెందుల నుంచి ఇచ్ఛాపురం వరకూ బస్సు యాత్రకు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. ఉదయం పూట అభ్యర్థులు, జిల్లా ముఖ్యనేతలతోనూ ఎన్నికల వ్యూహాలపై సమీక్షిస్తారు. సాయంత్రం బహిరంగ సభలు నిర్వహిస్తారు. ఈ ఐదేళ్లలో జగన్ ఎక్కడికి వెళ్లినా అక్కడ కర్ఫ్యూ వాతావరణం సృష్టించారు. వందలకొద్దీ పోలీసుల బందోబస్తు మధ్య పరదాల మాటునే జగన్ తిరిగిన సంగతి తెలిసిందే.

'ఆ విరామం' కలిసొచ్చింది..: జగన్

సోమవారం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రాంతీయ సమన్వయకర్తలు వైవీ సుబ్బారెడ్డి, వీ విజయసాయి రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అయోధ్య రామిరెడ్డి తదితరులతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు దీర్ఘకాలం ఉండడం వైసీపీకి కలిసొచ్చిన అంశంగా పేర్కొన్నారు.

మనోహర్‌ను కలిసిన వంగవీటి రాధా

మర్యాదపూర్వకమేనన్న మనోహర్

తెనాలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారానికి అన్ని అస్త్రాలను ఉపయోగించేందుకు ఆయా పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ కలయిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సోమవారం రాత్రి తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాదెండ్లను రాధా కలిశారు. ఇరువురూ మంచి మిత్రులు కావటంతో సాధారణ విషయాలతో పాటు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రధానంగా రాజకీయ అంశాలపైనే చర్చ సాగినట్టు తెలిసింది. కాపు ఓట్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో వంగవీటి రంగా వారసుడిగా రాధా కూడా ప్రచారంలో పాల్గొంటే చాలావరకు ప్రభావం ఉంటుందనే ఆలోచనతో ఉన్నారనేది సమాచారం. ఇప్పటికే కాపు నాయకులు కొందరు వైసీపీలో చేరిన నేపథ్యంలో వారిని ధీటుగా ఎదుర్కొనేందుకు రాధా వంటి వారి సేవలు అవసరమేననేది ఆ పార్టీల ఆలోచనగా చెబుతున్నారు. అయితే ఇద్దరు నాయకులూ ఈ అంశాలపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. తాము మర్యాదపూర్వకంగా మాత్రమే కలిశామని చెబుతున్నారు.



నాదెండ్ల మనోహర్‌ను కలసిన వంగవీటి రాధా



సీఎం ఆకాశంలో వెళుతున్నా ట్రాఫిక్ ఆపేవారు..

పీఎం సభకు భద్రత కల్పించలేరా?

- వైసీపీకి తొత్తుల్లా ఆ నలుగురు పోలీస్ అధికారులు
- డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీ, గుంటూరు రేంజి ఐజీ, పల్నాడు ఎస్పీలను ఎన్నికల విధుల నుంచి తొలగించండి
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనాకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఫిర్యాదు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న ప్రజాగళం సభలో భద్రతావైఫల్యంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతల బృందం ఫిర్యాదు చేసింది. డీజీపీ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్సార్ ఆంజనేయులు, గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు, పల్నాడు జిల్లా ఎస్పీ శంకర్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని, వారిని ఎన్నికలవిధుల నుంచి తప్పించాలని కోరింది. 'ప్రధాని మోదీ పాల్గొన్న సభను భగ్నం చేయడానికి వీరు ప్రయత్నించారు. చట్టం పట్ల ఏమాత్రం ఈ అధికారులకు విధేయత లేదు' అని ఫిర్యాదు చేసింది. సోమవారం అమరావతి సచివాలయంలో సీఈవోను ఆ పార్టీలకు చెందిన నేతలు వర్ల రామయ్య, బండ్రెడ్డి రామకృష్ణ, పాతూరి నాగభూషణం కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "సీఎం జగన్ పైన ఆకాశంలో వెళుతుంటేనే కింద రోడ్ల మీద పోలీసులు ట్రాఫిక్ ఆపుతారు. అలాంటిది దేశ ప్రధాని పాల్గొన్న సభకు భద్రత కల్పించలేరా? డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్సార్ ఆంజనేయులు, గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు, పల్నాడు జిల్లా ఎస్పీ వైసీపీకి తొత్తుల్లా మారారు. ప్రధాని సభకు భద్రతా ఏర్పాట్లు చేయలేని రాజేంద్రనాథ్‌రెడ్డికి డీజీపీగా ఉండే అర్హతలేదు. లక్షలాది మంది వచ్చిన సభ విషయంలో ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు వ్యవహరించాల్సిన తీరు ఇదేనా? గుంటూరు రేంజి ఐజీ పాలరాజు కంటే కానిస్టేబుల్ నయం. పల్నాడు ఎస్పీ అనవసరంగా ఖాకీ చొక్కా వేసుకున్నారు. ఆయన వైసీపీ చొక్కా వేసుకుని తిరగాల్సింది" అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ సభను వైసీపీ ప్రభుత్వం, పోలీసులు విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించారని విమర్శించారు.

ఆ ఆరు గంటలు నరకయాతన

- చుక్కలు చూపించిన పోలీసులు

నరసరావుపేట, మార్చి 18 : ప్రధాని పాల్గొన్న 'ప్రజాగళం' సభ కోసం ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసుల వైఫల్యం ఎన్డీయే కూటమి అభిమానులకు చుక్కలు చూపించింది. ఆరు గంటలపాటు నరకయాతనకు గురిచేసింది. సభ ఆదివారం మధ్యాహ్నం మూడుగంటలకు ప్రారంభమైంది. 4.15 గంటలకల్లా చంద్రబాబు ప్రాంగణానికి చేరుకున్నారు. 5.10 గంటలకు ప్రధాని వచ్చారు. పవన్‌కల్యాణ్ అంతకుముందే అక్కడకు చేరుకున్నారు. వారు ప్రయాణించిన హెలికాప్టర్‌లను చూసిన కూటమి నేతలు.. అభిమానులు, ప్రజలు.. తొందరగా సభా ప్రాంగణం వద్దకు చేరుకోవడానికి ప్రయత్నించారు. అయితే, రహదారులు చూస్తే అడుగుకూడా ముందుకు వేయలేని పరిస్థితి. సాయంత్రం మూడుగంటల వరకు వాహనాలు ఆగుతూ సాగుతూ ఉన్నాయి. నాలుగు గంటల కల్లా కిలోమీటర్ల పొడవునా నిలిచిపోయాయి. రహదారులపైనే ఇరుక్కుపోయిన వారిలో చాలామంది తాగడానికి నీరు దొరక్క అల్లాడిపోయారు. తిండి లభించక ఇబ్బందిపడ్డారు. రాత్రి పది గంటల వరకు చెన్నై హైవేపై ఇదే పరిస్థితి. మరోవైపు, గ్యాలరీల్లోకి జనాన్ని పంపడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో సభా ప్రాంగణంలో స్వల్ప తొక్కిసలాట జరిగి.. ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయారు.

గెంటేస్తున్నారు!



(మొదటి పేజీ తరువాయి)

అవుతున్నా ఇప్పటికీ ఆ డబ్బులు అడ్రస్ లేవు. కానీ సీఎం బటన్ నొక్కినందున ఫీజులు కట్టాల్సిందేనంటూ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. పలుచోట్ల తరగతులకు హాజరు కానివ్వకుండా విద్యార్థులను ఇంటికి పంపుతున్నాయి. డబ్బుల్లేకుండానే జగన్ బటన్ నొక్కడంతో కాలేజీలకు సమాధానం చెప్పలేక, ప్రభుత్వం నుంచి ఫీజులు ఖాతాల్లో పడక విద్యార్థులు సతమతమవుతున్నారు. మొత్తంగా విద్యార్థుల చదువులను బలిపెట్టేలా డబ్బుల్లేని విద్యా దీవెన పథకాన్ని జగన్ ప్రభుత్వం అమలుచేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 9.44లక్షల మంది విద్యార్థులకు రూ.708కోట్లు విడుదల చేస్తూ ఈ నెల ఒకటో తేదీన జగన్ బటన్ నొక్కారు. రోజులు గడుస్తున్నా... ఎన్నిసార్లు అకౌంట్ చూసుకున్నా డబ్బులు మాత్రం కనిపించట్లేదు. తల్లిదండ్రుల ఖాతాల్లో ఫీజులు జమచేశామని ప్రభుత్వం చెబుతుంటే, ఇప్పటికీ ఆ డబ్బులు తమకు చేరలేదని వారంటున్నారు. అయితే ఫీజులు విడుదల చేశాం అని సాంకేతికంగా చెప్పుకొనేందుకు ప్రభుత్వం అక్కడక్కడా కొందరికి ఫీజులు ఖాతాల్లో జమచేసింది. కానీ 90శాతం మందికి మాత్రం ఇంకా ఫీజులు రాలేదు.

ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, మెడిసిన్ కోర్సులు చదువుతున్న 9,44,666 మంది విద్యార్థులకు అక్టోబరు-డిసెంబరు 2023 క్వార్టర్ ఫీజులు విడుదల చేసినట్లు ఈనెల 1న బటన్ నొక్కినప్పుడు సీఎం జగన్ తెలిపారు. రూ.708.68కోట్లు విడుదల చేశామన్నారు. అదే రోజు నుంచి ఫీజులు కట్టాలంటూ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి ప్రారంభించాయి. ఇంకా ఫీజుల డబ్బులు అకౌంట్‌లో పడలేదని చెబుతున్నా, అదంతా తమకు సంబంధం లేదని, వెంటనే ఫీజులు కట్టాలని తేల్చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడిపోయారు. ఫీజులు ఇవ్వలేనప్పుడు బటన్ నొక్కకుండా ఉండాలని, బటన్ నొక్కి మేనేజ్‌మెంట్ల ముందు విద్యార్థులను ఇరికిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పరీక్షలు ఉండటంతో కాలేజీలు హాల్‌టికెట్లు ఇవ్వవేమోనన్న ఆందోళన విద్యార్థుల్లో పెరిగింది. అసలే ఎన్నికలు కావడంతో ప్రభుత్వం పట్టించుకోదేమోనని భయపడుతున్నారు.

క్వార్టర్‌పైనా అబద్ధాలు

ప్రభుత్వం ఏటా నాలుగు విడతలుగా ఫీజులు విడుదల చేయాలి. ఏ క్వార్టర్ ఫీజులు అదే క్వార్టర్‌లోనే ఇస్తున్నామని జగన్ ప్రభుత్వం చెబుతోంది. 2023-24 విద్యా సంవత్సరం జూలైలో ప్రారంభమైంది. ఇప్పటికే రెండు క్వార్టర్ల ఫీజులు విడుదల చేయాలి. మరో రెండు వారాల్లో మూడో క్వార్టర్ విడుదల కావాలి. కానీ జగన్ బటన్ నొక్కి ఇచ్చింది ఈ విద్యా సంవత్సరంలో మొదటి క్వార్టర్ ఫీజులే. కానీ ప్రభుత్వం మాత్రం రెండో క్వార్టర్ అని ప్రచారం చేసుకుంటోంది. ఇలా ఏటా మూడు క్వార్టర్లు ఆలస్యంగా ఫీజులు విడుదల చేస్తోంది. కొందరు విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేశాక ఫీజులు కడుతుంటే, కాస్త మంచి పేరున్న కాలేజీలు ముందుగానే ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీంతో వేరే దారిలేక తల్లిదండ్రులు అప్పులుచేసి ముందుగానే ఫీజులు కడుతున్నారు.

మా ఖాతాల్లో వేయొద్దు

గత ప్రభుత్వంలో రీయింబర్స్‌మెంట్ పథకంలో ఇచ్చే ఫీజులు నేరుగా కాలేజీల ఖాతాల్లో వేసేవారు. కాలేజీలు అక్రమాలకు పాల్పడుతున్నాయనే నెపంతో జగన్ ప్రభుత్వం తల్లిదండ్రుల ఖాతాల్లో ఫీజులు జమచేసే విధానం అమలుచేస్తోంది. అయితే నెపం కాలేజీలపై నెట్టినా, ఈ కొత్త విధానంలో అసలు బాధితులుగా మారింది విద్యార్థులు. ఎందుకంటే గతంలో ఫీజుల అంశం ప్రభుత్వం- కాలేజీల మధ్య ఉండేది. ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తే అప్పుడు కాలేజీలు ఫీజులు తీసుకునేవి. కానీ జగన్ ప్రభుత్వం ఫీజులను కాలేజీలు-తల్లిదండ్రుల మధ్యకు తీసుకొచ్చింది. దీంతో ప్రభుత్వం ఎప్పుడు ఫీజులు విడుదల చేసినా కాలేజీలు మాత్రం ముందే ఫీజులు కట్టించుకుంటున్నాయి. దీంతో అసలు ఈ విధానమే వద్దని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

తొలినుంచీ ఇలాగే.....

"క్వార్టర్ ముగిసిన వెంటనే తల్లిదండ్రుల ఖాతాల్లో ఫీజులు వేస్తున్నాం" అని ప్రతిసారీ విద్యా దీవెన ఫీజులు విడుదల చేసే సమయంలో ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంటోంది. కానీ గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా క్వార్టర్ ముగిసిన వెంటనే ఫీజులు ఇచ్చిన దాఖలాల్లేవు. ప్రతిసారీ కనీసం మూడు క్వార్టర్ల ఫీజులు పెండింగ్‌లో పెట్టి పాత ఫీజులు విడుదల చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో మూడో క్వార్టర్ ముగుస్తున్నప్పుడు మొదటి క్వార్టర్ నగదు వేశారు. ఆయా కోర్సుల్లో చివరి ఏడాది విద్యార్థుకు ఇది ఇంకా ఇబ్బందిగా మారింది. ఫీజులు కట్టలేదనే ఫైనలియర్ పూర్తిచేసిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో ఫైనలియర్ విద్యార్థులకు 3, 4 క్వార్టర్ల నగదు ఒకే సారి ఇస్తామని గతేడాది ప్రభుత్వం తెలిపింది. అయితే అసలు మొదటి క్వార్టర్ ఫీజులే మూడో క్వార్టర్‌లో ఇస్తుంటే, ఇక 3, 4 క్వార్టర్లు ఎప్పుడిస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

సీఎం జిల్లాలోనూ..

సీఎం సొంత జిల్లా కడపలో 44,876 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.32.52 కోట్లు జమ కావాల్సి ఉంది. కానీ, ఇంత వరకు ఆ నిధులు జమ కాలేదు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు ఈ నెల 20లోగా ఫీజు చెల్లించాలి. అప్పుడే వారికి హాల్‌టికెట్ ఇస్తామని యాజమాన్యాలు పట్టుబడుతున్నాయి.

- నెల్లూరు జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులకు విద్యా దీవెన అందలేదు. వెయ్యి మంది విద్యార్థులున్న ఓ ఇంజనీరింగ్ కాలేజీలో ఎవరికీ ఫీజులు పడలేదు. 40 మంది సొంతంగాఫీజులు కట్టారు. మిగిలినవారిపై యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది.
- పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 20% మందికి మాత్రమే ఫీజులు పడ్డాయి. ఫీజులు కట్టకపోతే హాల్ టికెట్లు ఇవ్వబోమని యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. దీంతో అప్పులు చేసైనా ఫీజులు కట్టేందుకు తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తున్నారు.
- విశాఖపట్నం జిల్లాలో అన్ని విడతల ఫీజులూ కట్టాలని కాలేజీల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఒక్క విడత విడుదల చేయగా, మిగిలిన మూడు విడతల ఫీజులూ కలిపి కట్టాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి. ఇక... ఏడాదికి రెండు విడతల్లో వసతి దీవెన నగదు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకూ ఒక్క విడత కూడా ఇవ్వలేదు. దీంతో జిల్లాలో 44వేల మంది విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.
- జగన్ బటన్ నొక్కిన గత 20 రోజుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కనీసం 5 శాతం మందికి కూడా డబ్బులు పడలేదు. ఇక్కడి ఇంజనీరింగ్ కళాశాలలు, మరో 25పైగా ఫార్మసీ ఇతర వృత్తి విద్యా కళాశాలలకు ఇంకా రెండు విడతల ఫీజులు అందాల్సి వచ్చింది. డబ్బులు ఖాతాల్లో పడకపోవడం, అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు కొన్ని కళాశాలలు... ఫీజులు చెల్లించే వరకు క్లాసులకు రావద్దు అని వాట్సాప్ సందేశాలు పంపుతున్నాయి.
- విశాఖ జిల్లాలో డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఐటీఐ కోర్సుల్లో సుమారు 44వేల మంది చదువుతున్నారు. 2023-24 సంవత్సరానికి గాను నాలుగు విడతల్లో జమ కావాల్సిన విద్యా దీవెనను ఇప్పటివరకు ప్రభుత్వం ఒక విడత మాత్రమే చెల్లించింది. మిగిలిన మూడు విడతలు చెల్లించాల్సిందిగా ఇంజనీరింగ్, ఐటీఐ, డిగ్రీ కోర్సుల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి.

'బొమ్మ' వదలాలి!

(మొదటి పేజీ తరువాయి)

రికార్డులు, భూమి పాస్ పుస్తకాలు, రీసర్వే రికార్డులు, కుల, ఆదాయ, స్థానిక, ఫ్యామిలీ మెంబర్ తదితర సర్టిఫికెట్లపై జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటోలు ఉండటానికి వీల్లేదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ముఖ్యమంత్రి ఫొటోతో కూడిన నవరత్నాల లోగో, జగన్ ఫొటో ఉన్న వాటర్‌మార్క్ లోగోలు కూడా ముద్రించకూడదు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈసీ ఆదేశాలతో రెవెన్యూ, గ్రామ వార్డు సచివాలయాల విభాగం, సంక్షేమ శాఖలు చర్యలు ప్రారంభించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో భూముల సర్వే సాగుతోంది. దానికి కూడా 'జగనన్న' పేరుపెట్టారు. ఇకపై అది కూడా కొనసాగడానికి వీల్లేదు. ఎన్నికల నియమావళి ప్రకారం దీనిని 'భూముల సర్వే' అనే పిలవాల్సి ఉంటుంది. పాస్ పుస్తకాలపై ముద్రించే 'వైఎస్సార్ - జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష' నుంచి వైఎస్సార్, జగనన్న పేర్లను తొలగిస్తారు. ఇప్పటికే జగన్ పేరు, ఫొటోల పేరిట ముద్రించిన పాస్‌పుస్తకాలు అధికారుల వద్దే ఉంటే వాటిని పక్కన పెట్టేస్తారు. 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం తగిన చర్యలు తీసుకోండి' అంటూ ఏం చేయాలి, ఏం చేయకూడదో వివరిస్తూ అధికారులకు సూచనలు పంపించినట్లు తెలిసింది.

రేషన్ వాహనాలకూ...

రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాలపై ముఖ్యమంత్రి జగన్ ఫొటోతోపాటు నవరత్నాల పథకం చిత్రాలు ఉన్నాయి. నియమావళి ప్రకారం... ఆ రెండూ కనిపించకుండా మూసివేయాల్సిందే. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌కార్డుదారులకు, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకాలకు అందిస్తున్న రాగిపిండి, బెల్లం తదితర ప్యాకెట్లపైన జగన్ ఫొటోలు కనిపించకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సివిల్ సప్లయిస్ కమిషనర్ హెచ్. అరుణ్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సోమవారం అత్యవసర సర్క్యులర్ పంపించారు. ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో ఉన్న సంచులను ఉపయోగించవద్దని స్పష్టం చేశారు. ఎండీయూ వాహనాలను ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం, కార్డుదారులకు ఇంటింటికీ రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేయడానికి మినహా ఇతర కార్యకలాపాలకు వినియోగించకూడదని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎల్పీజీ (గ్యాస్ సిలిండర్ల) ఔట్‌లెట్స్, పెట్రోల్ బంకుల వద్ద ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్లు, రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు ఉంటే... వాటిని తొలగించాలని ఆదేశించారు. రేషన్ దుకాణాల డీలర్లు, ఎండీయూల ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని.. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ పోర్టల్‌లో కూడా సీఎం, మంత్రుల ఫొటోలు తక్షణమే తీసివేయాలని సూచించారు.



రవాణాశాఖ వెబ్‌సైట్‌లోని ఇ-ప్రగతిలో సీఎం జగన్, మంత్రి విశ్వరూప్ ఫొటోలు, వైఎస్ఆర్ వాహన మిత్ర లోగో ప్రచారం

జగన్ ఫొటోలు... టీచర్లకు పాట్లు

జగన్ ఫొటోల పిచ్చి ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా ఇచ్చే చిక్కీల కవర్‌పైనా జగన్ ఫొటో ఉంది. చిక్కీలు ప్రతి పాఠశాలకు వందల సంఖ్యలో ఒకేసారి ఇస్తారు. ఉన్నత పాఠశాలలకు వేలల్లో సరఫరా అవుతాయి. ఇప్పుడు ఆ చిక్కీలపై జగన్ ఫొటోలు ఉన్న కవర్లు తొలగించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. వందలు, వేలల్లో ఉన్న చిక్కీలపై కవర్లు తొలగించడం టీచర్లకు తలనొప్పిగా మారింది. అలాగే 'నాడు- నేడు' పథకంలో భాగంగా పాఠశాలల గోడలపై... స్వాతంత్ర సమరయోధుల సరసన పిల్లలను ఒడిలో కూర్చోబెట్టుకుని పలకపై అక్షరాలు దిద్దిస్తున్నట్లుగా ఉన్న జగన్ బొమ్మలూ వేశారు. ఇప్పుడు వాటిని కవర్ చేయాల్సి వస్తోంది. పిల్లలకు అందించే గుడ్లపైనా 'వైఎస్ఆర్' స్టాంపు వేస్తున్నారు. దానిని కూడా నిలిపివేయాలని విద్యాశాఖ ఆదేశించింది. పిల్లలకు ఇచ్చిన నోట్ పుస్తకాలపై జగనన్న విద్యా కానుక లోగోలు ముద్రించారు. ఆ నోట్ పుస్తకాలకు అట్టలు వేయాలంటూ డీఈవోలు ఆదేశాలు జారీచేస్తున్నారు. పిల్లల పుస్తకాలకు తాము అట్టలు వేయాలా అని టీచర్లు వాపోతున్నారు. ఇటీవల పంపిణీ చేసిన ట్యాబ్‌లపై వెనుక భాగంలో జగన్ ఫొటోల స్టిక్కర్లు వేశారు. వాటినీ తొలగించాల్సి వస్తోంది. పిల్లలకు విద్యా కానుకలో భాగంగా ఇచ్చిన బెల్టులనూ 'జగనన్న' వదల్లేదు. దీంతో కోడ్ ఉన్నంతవరకూ విద్యార్థులను బెల్టులు ధరించవద్దని ఆదేశాలు జారీచేశారు. జగన్‌కు ప్రచార పిచ్చి లేకుంటే ఇన్ని తిప్పలుండేవి కావని టీచర్లు అంటున్నారు. పిల్లలకు యూనిఫామ్, బెల్టులు, పుస్తకాలు, గుడ్లు, పోషకాహారం అందించడం కొత్తేమీ కాదు. కానీ, జగన్ మాత్రమే ఆయన ఫొటోలు ముద్రించుకున్నారు. చివరికి... రాగిజావ అందించే గ్లాసులపైనా జగనన్న గోరుముద్ద లోగోలు ముద్రించారు. వాటిని తొలగించడం కూడా సాధ్యం కాదు. దీంతో ఎన్నికలు ముగిసేవరకూ ఆ గ్లాసులు తీసి పక్కన పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

సర్వే రాళ్ల మాటేమిటి?

ప్రస్తుతం రాష్ట్రంలో భూముల సర్వే జరుగుతోంది. సరిహద్దులు నిర్ణేశించేందుకు పాతే రాళ్లపైనా 'జగనన్న' పేరు చెక్కారు. నియమావళి ప్రకారం ఇది కుదరదు. అయితే, జగన్ వీరభక్తుడైన ఓ సర్వే ఉన్నతాధికారి ఈ విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలిసింది. 'జగన్ పేరులేని సర్వేరాళ్లను ఎలా పంపిస్తాం?' అని ఆయన వాదిస్తున్నట్లు తెలిసింది. జగనన్న శాశ్వత భూ హక్కు, జగనన్న సర్వేగానే ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సర్వేయర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి మౌఖిక ఆదేశాలిచ్చారని తెలిసింది. పై అధికారి మాటలు వినాలా? లేక ఈసీ మార్గదర్శకాలు పాటించాలా అని దిగువ స్థాయి అధికారులు ఆందోళనగా ఉన్నారు.

కోడ్‌కు ఆ శాఖలు అతీతమా!

- ప్రభుత్వ వెబ్‌సైట్లలో అధికార పార్టీ నేతల ఫొటోలు
- పైన ఫొటోలు తొలగించినా.. లోపల యథాతథం

తెనాలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ కోడ్ కూతపెట్టి రెండో రోజు కావస్తున్నా కొన్ని ప్రభుత్వ సంబంధ అధికారిక సైట్‌లలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఫొటోలు ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో అధికారులవి మినహా రాజకీయవేత్తల ఫొటోలు ఎవరివీ ఉండకూదని, వెంటనే తొలగించాలని ఎన్నికల సంఘం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రధాన సైట్లలో ఫొటోలు తొలగించినా, లోపలి లింక్ పేజీలలోకి వెళితే ఫొటోలు, వైసీపీ ప్రచారార్భాటపు లోగోలు దర్శనమిస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు... ప్రభుత్వ రవాణాశాఖ ఇ-ప్రగతి వెబ్‌సైట్‌లో సీఎం జగన్, మంత్రి విశ్వరూప్, వైఎస్ఆర్ వాహనమిత్ర లోగో సోమవారం కూడా దర్శనమిస్తూనే ఉన్నాయి. రోజుకు లక్షల మంది ఈ సైట్‌ను ఓపెన్ చేయటం, లైసెన్స్‌ల వంటి వాటి కోసం సెర్చ్ చేస్తూనే ఉంటారు. అటువంటి సైట్‌లో ఎన్నిల సంఘం ఆదేశాలను కాదని ఫొటోలు యథాతథంగా కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. మిగిలిన కొన్ని అధికారిక సైట్‌ల లోనూ పైపేజీ మినహా మిగిలిన లోపలి పేజీల్లో ఫొటోలు, లోగోలు తొలగించనేలేదు.



కోర్ డాష్‌బోర్డ్ వెబ్‌సైట్‌లో వైద్య పరీక్షలపై క్లిక్ చేస్తే దర్శనమిస్తున్న సీఎం జగన్ ఫొటో

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పిచ్చుకలను సంరక్షించుకోవాలి

● స్ఫూర్తి శ్రీనివాస్

ధర్నాచౌక్, మార్చి 18: అపార్ట్‌మెంట్ కల్చర్ పెరగడంతో పిచ్చుకలు తమ నివాసాన్ని కోల్పోతూ జాతి అంతరించేస్థాయికి చేరుకుందని స్ఫూర్తి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 20న అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చుకల కోసం ప్రజలు కొన్ని పనులు చేయాల్సి ఉందన్నారు. ఫ్లకార్డు చాలెంజ్ (పిచ్చుక చిత్రం గల కార్డు ప్రదర్శించడం, పిచ్చుక గురించి సమాచారాన్ని తెలియజేస్తూ కరపత్రాలు ముద్రించడం, పిచ్చుకల సంరక్షణ గురించి చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం చేయాలన్నారు. పిచ్చుకల కోసం కత్రిమ నివాసాల ఏర్పాటు, మన ఇంటిపైన, ఎదుట గోడలపై చిన్నచిన్న గిన్నెల్లో నీళ్ల నింపడం, బియ్యం, జొన్నలు, సజ్జలు తదితర ధాన్యపు గింజలను వాటికి అందుబాటులో ఉంచాలన్నారు. గాలి పటాలు ఎగురవేసేటప్పుడు దారాలు వాటికి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీటిపై నేటి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో సిద్ధార్థ ప్రిన్సిపాల్ ఎం.రమేష్, పీడీ చినబాబు

అంతర్ వర్సిటీ జిమ్నాస్టిక్స్‌కు కృష్ణా వర్సిటీ

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 18: పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో గురునానక్ దేవ్ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19నుంచి 21వరకు జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల జిమ్నాస్టిక్స్ టోర్నీలో పాల్గొనే కృష్ణా వర్సిటీ పురుషుల, మహిళా జట్లు అక్కడకు పయనమయ్యాయని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. పురుషుల విభాగంలో ఎం.సమీర్ సాయి (పీబీ సిద్ధార్థ), పి.పవన్ (డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ డిగ్రీ కళాశాల, మైలవరం), మహిళల విభ విభాగం లో వి.నీలవేణి, కె.దీపిక(పీబీ.సిద్ధార్థ డిగ్రీ కళాశాల) విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ జట్లకు మేనేజర్‌గా పి.రాణాప్రతాప్ మైలవరం జూనియర్ కళాశాల పీడీ వ్యవహరిస్తారన్నారు. ఎంపికైన జట్లను కళాశాల ఆవరణలో సోమవారం అభినందించారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.చినబాబు పాల్గొన్నారు.

యూపీ కార్మికుడి అనుమానాస్పద మృతి

పాయకాపురం, మార్చి 18: స్థానిక ఓ బీరువాల కంపెనీలో పని చేసేందుకు వచ్చిన యూపీ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్ జమలాపూర్‌కు చెందిన యోగింద్ర యాదవ్ (35) స్థానిక దేవినేని గాంధీపురంలోని ఓ బీరువాల తయారీ కంపెనీలో వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తోటి కార్మికుడు సంతోష్‌తో కలిసి రాత్రి భోజనం చేశాడు. అనంతరం 11 గంటల సమయంలో యోగింద్ర యాదవ్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో నిద్రిస్తున్న సంతోష్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకుని మంటలను ఆపే ప్రయత్నం చేశారు. అయితే తీవ్రంగా గాయపడిన యోగింద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బంధువులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీ వాయిదా వేయండి!

ఎన్నికల కమిషన్‌కు నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడి విజ్ఞప్తి

వన్‌టౌన్, మార్చి 18: రాష్ట్రంలో ఈనెల 30నుంచి ఏప్రిల్ 30వరకు జరగనున్న డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్‌కుమార్ సోమవారం ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.



పరీక్షల అనంతరం సార్వత్రిక ఎన్నికలున్నాయని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు నిరుద్యోగ యువత ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులుగా కూడా పోటీ చేయనున్న నేపథ్యంలో చదువుకునేందుకు మరికొంత అదనపు సమయం కావాలన్నారు. ఎన్నికల తరువాత డీఎస్సీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సిబ్బందిలో చాలామంది డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేశారని, ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల చదువుకునే అవకాశం ఉండదన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా పరీక్షలను వాయిదా వేయాలని కోరారు.



అసోంతో తలపడుతున్న రాష్ట్ర జట్టు

జూనియర్ కబడ్డీ క్వార్టర్స్‌కు ఏపీ జట్టు

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 18: వరుస విజయాలతో మంచి ఊపు మీదున్న రాష్ట్ర జూనియర్ పురుషుల కబడ్డీ జట్టు సోమవారం క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. బీహార్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 33వ జాతీయ జూనియర్ కబడ్డీ టోర్నీలో ప్రీ క్వార్టర్స్‌లో అస్సామ్‌పై 39-19 పాయింట్లతో ఏపీ జట్టు జయభేరి మోగించిందని ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు.



క్రికెట్ కిట్‌లను అందజేస్తున్న అధికారులు

ఏపీఎస్‌పీఎఫ్‌లో క్రీడలకు ప్రోత్సాహం

వన్‌టౌన్, మార్చి 18: ఏపీఎస్‌పీఎఫ్‌లో క్రీడలకు ప్రోత్సాహమిస్తూ అధికారులు సోమవారం క్రికెట్ కిట్లను అందజేశారు. రాజమండ్రి, విజయవాడ, తిరుపతి జోన్ల పరిధిలోని ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బందికి ఈ కిట్లను అందజేశారు. ఏపీఎస్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఐ.వి రామిరెడ్డి, జోనల్ కమాండెంట్లు కేఏన్ రావు, ఎం.శంకర్‌రావు, బీకేఎస్ రాజు పాల్గొన్నారు. గత నెల 7న జరిగిన సమావేశంలో వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వివిధ సంస్థల్లో, సెక్రటరీయేట్, హైకోర్టు, ఎయిర్‌పోర్టు, ఏపీజెన్‌కోలో సెక్యూరిటీని బలోపేతం చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతను కట్టుదిట్టం చేయాలని సంస్థ అధిపతి డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ ఆదేశాలను జారీచేశారన్నారు. జోనల్ ఆఫీస్, ట్రైనింగ్ సెంటర్ నిమిత్తం వెదురుపావులూరులో ఐదెకరాలు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. సోమవారం హెడ్‌క్వార్టర్స్‌లో రాజమండ్రి, విజయవాడ, తిరుపతి జోన్‌లతో సమావేశం నిర్వహించి స్థల విషయంపై రెవెన్యూ అధికారులతో మాట్లాడాలని సూచించారు.



బార్ డే కు హాజరైన రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్

చట్ట పరిరక్షణలో న్యాయవాద వృత్తి కీలకపాత్ర

● గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయవాడ లీగల్, మార్చి 18: చట్ట పరిరక్షణలో న్యాయవాది వృత్తి కీలక పాత్ర వహిస్తుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన బార్ డేకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఉదాత్తమైనదని, చట్టాన్ని పరిరక్షిస్తూ, ప్రపంచంలోనే అతి పెద్ద న్యాయవాద వృత్తిలో న్యాయ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు.ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం, న్యాయ నిర్వహణలో న్యాయవ్యవస్థలో న్యాయవాద వృత్తి ఒక భాగమని, సమాజంలో న్యాయాన్ని నిలబెట్టే బాధ్యత జవాబుదారీతనం ఉన్నందున న్యాయానికి పునాదిరాయి అని గవర్నర్ అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.శేషసాయి, కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, బార్ అధ్యక్షుడు కేబీ సుందర్, బార్ కౌన్సిల్ మెంబర్ జి.రామారావు, బెజవాడ బార్ కార్యవర్గసభ్యులు, నగర పోలీసు కమిషనర్ కాంతిరాణా టాటా పాల్గొన్నారు.

క్రైస్తవులను మోసం చేసేందుకు సిద్ధమైన జగన్

● టీడీపీ నేత ఈటె స్వామి

విద్యాధరపురం, మార్చి 18: రాష్ట్రంలో క్రైస్తవులను మరోసారి మోసం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌రెడ్డి తెరతీశారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాసు, కృష్ణాజిల్లా పార్లమెంట్ విభాగం అధ్యక్షుడు మోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 75వేల మంది పాస్టర్లుంటే 10శాతం మందికి మాత్రమే గౌరవవేతనాలు ఇస్తున్నారన్నారు. మిగిలిన వారిని నిలువునా మోసం చేశారని విమర్శించారు. ప్రతి నియోజకవర్గంలో చర్చి నిర్మాణాలకు రూ.5లక్షలు ఇస్తామన్నారు కానీ ఎన్ని కట్టించారో చెప్పాలన్నారు. గత ఎన్నికల్లో బ్రదర్ అనిల్‌కుమార్ పాస్టర్ల సమావేశం నిర్వహించి జగన్‌ను గెలిపించుకుంటే అన్ని విధాల క్రైస్తవుల జీవితాలు బాగుపడతాయని నమ్మించారన్నారు. ఎన్నికలయ్యాక క్రైస్తవులను విస్మరించి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, క్రైస్తవుల ఓట్లతో గెలిచి ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. మ్యానిఫెస్టో, బైబిల్, ఖురాన్, భగవద్గీతలాంటిదని చెబుతూ రాష్ట్ర ప్రజలను జగన్ నిలువున ముంచాడన్నారు ఎన్నికలు వస్తున్న తరుణంలో పాస్టర్లకు గౌరవవేతనం ఇచ్చి మళ్లీ మోసానికి తెరలేపారన్నారు. జగన్ బంధువు విమలారెడ్డి రాష్ట్రమంతా తిరుగుతూ క్రైస్తవులకు మోసపూరిత హామీలు ఇస్తున్నారన్నారు. క్రైస్తవులపై దాడులు జరుగుతూ వారి ఆస్తులను దోచుకుంటున్నప్పుడు వీరు ఎక్కడున్నారో చెప్పాలన్నారు. టీడీపీ హయాంలో 277 చర్చిలను కట్టించారని, వైసీపీ హయాంలో ఏ ఒక్కటైనా కట్టించారా అని నిలదీశారు. ఛార్లెస్, కామాదేవరాజ్, నందకుమారి పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

రామవరప్పాడు, మార్చి 18: స్థానిక యాదవ బజార్‌లో తెర్లిస్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లినిక్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గుండె వైద్య నిపుణుడు డాక్టర్ తెర్లి సురేశ్ (ఎంస్ సర్జన్), ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు, తెర్లి ఎండీ డాక్టర్ భానురేఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేశ్, డాక్టర్ భానురేఖ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం అందని సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న ధ్యేయంతో తెర్లిస్ క్లినిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. కరోనా తర



వాత గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు మనిషిపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఇటువంట వారికి గుర్తించేందుకు కృష్ణా జిల్లా వ్యాప్తంగా అనేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, గుండెపరీక్షలు, ఈసీజీ, 2డీ, ఎకో, కొలెస్ట్రాల్, ఊపరితిత్తులకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా అందజేయగా, దాదాపు 400 మంది ఉచితంగా వైద్య సేవలు పొందారన్నారు. గుండె, ఊపిరితిత్తులకు సంబంధించి కార్పొరేట్ స్థాయి వైద్యం తక్కువ ఖర్చుతో అందించేందుకు తెర్లిస్ క్లినిక్ పేదలకు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుందన్నారు.

నేడు కాంగ్రెస్‌తో వామపక్షాల పొత్తు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

భవానీపురం, మార్చి 18: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అంశంపై వామపక్షాలు, కాంగ్రెస్‌ల పొత్తు మంగళవారం సాయంత్రానికి ఖరారవుతుందని, ఎన్నెన్ని సీట్లలో పోటీ చేయాలన్నదానిపై సీపీఎంతో కలిసి చర్చిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సీపీఐ సమితుల జనరల్ బాడీ సమావేశానికి నగరానికి సోమవారం విచ్చేసిన రామకృష్ణ పొత్తుపై ఆంధ్రజ్యోతి ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. బొప్పూడి బహిరంగసభలో ప్రధాన నరేంద్ర మోదీ మాట్లాడినవన్నీ అబద్ధాలేనన్నారు. ప్రత్యేక హోదా, రాష్ట్రాభివృద్ధిపై మాట్లాడకుండా ఐదేళ్లు జగన్‌కు సహకరించి ఇప్పుడు దిగజారుడుతనంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లు జగన్‌ను బ్లాక్ మెయిల్ చేసిన మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పి, ఇప్పుడు ప్రాంతీయ పార్టీలతో పొత్తు ఎందుకు పెట్టుకుంటున్నారని ప్రశ్నించారు. వైసీపీ, కాంగ్రెస్‌లు ఒక్కటేనని మోదీ వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. గతంలో మోదీని తిట్టిన చంద్రబాబు కూడా ప్రధానిని ఇంద్రుడు, చంద్రుడని పొగడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ హుందాతనం సభతో పోయిందని రామకృష్ణ అన్నారు.

మానసిక ఆరోగ్యానికి 'అవిక' యాప్ అద్భుత వరం

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 18 : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఎంతోకొంత మానసిక ఒత్తిడి, సమస్యలకు గురవుతున్నారని, అలాంటి వారందరికీ అవిక యాప్ గొప్ప వరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. సూర్యారావుపేటలోని ఇండ్లాస్ హాస్పిటల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 'అవిక' యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మానసిక సమస్య



లున్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా రూపొందించిన అవిక యాప్ దేశంలోనే మొట్టమొదటిదిగా భావిస్తున్నానన్నారు. అవిక యాప్‌ను రూపొందించిన ఇండ్లాస్ హాస్పిటల్ డైరక్టర్ డాక్టర్ విశాల్ ఇండ్ల, అవిక టీం సీఈవో శిరీష పెయ్యేటి బృందాన్ని అభినందించారు. గౌరవ అతిథిగా ఉన్నత విద్యా శాఖ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు. హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి పాల్గొన్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన విభాగంలో ఈవో పరిశీలన

వన్‌టౌన్, మార్చి 18: దుర్గగుడి మహా మండపం 2వ అంతస్తులో జరుగుతున్న నిత్యాన్నదానాన్ని సోమవారం ఈవో కేఎస్ రామారావు పరిశీలించారు. భోజనాలు చేస్తున్న భక్తుల నుంచి నాణ్యతా ప్రామాణాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. భక్తులు ఎక్కడ నుంచి వచ్చారు? ఇప్పటివరకు ఎన్నిసార్లు భోజనం చేశారు? గతానికి, ప్రస్తుతానికి నాణ్యతా ప్రామాణాల్లో మార్పులు ఉన్నాయా? సిబ్బంది ఆదరణ బాగుందా? రుచి ఎలా ఉంది? మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా? ఇలాంటి పలు విషయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తాము సంతృప్తికరంగా అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నామన్నారు. ఈవో మాట్లాడుతూ ఇంకా మెరుగైన సదుపాయాలు కల్పించి భక్తులకు



నిత్యాన్నదాన విభాగంలో నాణ్యతా ప్రమాణాలను భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఈవో

సంతృప్తికరంగా అన్నవితరణ చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా రుచి,శుచిలో రాజీ పడవద్దన్నారు. అన్నవితరణను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని దాతల ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

గన్నవరం, మార్చి 18: కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ అప్తమాలజిస్ట్ పాషా అన్నారు. మండలంలోని సూరంపల్లిలో బెస్ట్ మార్ట్ ఆన్‌లైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నందు విజయవాడ మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కంటి సమస్యలను అశ్రద్ధ చేయకూడదన్నారు. చూపు లోపం అనిపిస్తే వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. గ్లోకోమా, రెటీనా, రెఫ్రాక్టీవ్ ఎర్రర్స్ లాసిక్ తదితర కంటి పరీక్షలను చేసి మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం 110 మందిని



కంటి పరీక్షలు చేసిన ప్రముఖ అప్తమాలజిస్ట్ పాషా

పరీక్షించి 17 మందికి శస్త్ర చికిత్స కోసం సిఫారసు చేశారు. కౌన్సిలర్ రాజేశ్వరీ, క్యాంపు కో-ఆర్డినేటర్ ఎ.మునేశ్వర్, బెస్ట్ మార్ట్ సిబ్బంది లక్ష్మీ, సంధ్యా, భవాని, సంతోష్ పాల్గొన్నారు.

ఒంటరిగా 21 గంటలు!

రాత్రంతా ఆసుపత్రి గదిలోనే బాలుడు

- చూసుకోకుండా తలుపులు వేసిన సిబ్బంది
- ఆకలితో అలమటించి నీటితోనే కడుపు నింపుకున్న వైనం
- కర్నూలు జీజీహెచ్‌లో ఘటన



తండ్రితో బాలుడు సుదీత్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 18: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఖూత్ బంగ్లాలోని ఆపరేషన్ థియేటర్ అనస్థీషియా హెచ్‌వోడీ గదిలో ఐదేళ్ల బాలుడు 21 గంటలు ఒంటరిగా ఉండిపోయాడు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తినడానికి తిండి లేక ఆదివారం రాత్రంతా నరకయాతన అనుభవించాడు. సోమవారం ఉదయం ఆపరేషన్ థియేటర్ గది తలుపు తీసిన సిబ్బంది.. ఒంటరిగా ఉన్న ఆ బాలుడిని చూసి నివ్వెరపోయారు. ఓర్వకల్లు మండలం తిప్పాయపల్లెకు చెందిన ఐదేళ్ల బాలుడు సుదిత్ మూగ, చెవుడు సమస్యతో బాధపడుతున్నాడు. కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ కోసం తల్లిదండ్రులు 20 రోజుల క్రితం ఈఎన్‌టీ విభాగంలో చేర్పించారు. మంగళవారం సర్జరీ చేయాలని ఈఎన్‌టీ వైద్యులు నిర్ణయించారు. అయితే ఆదివారం ఆపరేషన్ థియేటర్‌ను శుభ్రం చేయడానికి సిబ్బంది తలుపులు తెరిచారు. ఈ ఆపరేషన్ థియేటర్‌లోనే అనస్థీషియా విభాగపు హెచ్‌వోడీ గది ఉంది. బాలుడు ఆడుకుంటూ అనస్థీషియా హెచ్‌వోడీ గదిలోకి వెళ్లాడు. సిబ్బంది చూసుకోకుండా ఆపరేషన్ థియేటర్, హెచ్‌వోడీ గది తలుపులకు తాళం వేసి వెళ్లిపోయారు. బాలుడు రాత్రంతా బిక్కుబిక్కున కాలం గడిపాడు. ఆకలి వేసినప్పుడల్లా ఫ్రిజ్‌లో నీరు తాగుతూ ఉండిపోయాడు. సోమవారం ఉదయం సిబ్బంది వచ్చి ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరవడంతో ఊపిరి పీల్చుకున్నాడు. అయితే అప్పటికే బాలుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని వివరణ కోరగా బాలుని ఆచూకీ దొరికిందని తెలిపారు.

టీడీపీ సానుభూతిపరుడి హత్య

- కత్తితో దాడికి పాల్పడిన వైసీపీ వర్గీయుడు
- తండ్రీకొడుకులపై కేసు.. నంద్యాల జిల్లాలో ఘటన



ఇమాంహుస్సేన్

చాగలమర్రి, మార్చి 18: వేలం పాటలో జరిగిన తగాదా ఒకరి ప్రాణాన్ని బలిగొంది. టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ నాయకుడు అత్యంత దారుణంగా కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన సోమవారం నంద్యాల జిల్లా చాగలమర్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చాగలమర్రి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈఓ నాగమణి ఆధ్వర్యంలో సోమవారం బస్టాండు, సంతమార్కెట్, కబేళా, దినమార్కెట్ నిర్వహణకు వేలంపాటను నిర్వహించారు. వేలంపాటలో పాల్గొనేందుకు టీడీపీ సానుభూతిపరుడైన రసూల్, అతడి కుమారుడు ఇమాంహుస్సేన్ (21) రూ.80 వేలు డిపాజిట్ చేశాడు. అదే వేలం పాటలో పాల్గొనేందుకు వైసీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న అబ్దుల్‌ఖాదర్ కుమారుడు దస్తగిరి వచ్చాడు. అయితే, వేలం పాట మధ్యలో రసూల్ కలగజేసుకుని డిపాజిట్ చేసిన వారు మాత్రమే ఇక్కడ ఉండాలని అన్నాడు. ఈ క్రమంలో అబ్దుల్‌ఖాదర్, రసూల్ మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఈఓ నాగమణి వేలం పాట నిర్వహణను వాయిదా వేశారు. అనంతరం అబ్దుల్‌ఖాదర్ కుమారుడు దస్తగిరి, రసూల్ కుమారుడు ఇమాంహుస్సేన్ ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఘర్షణ పడ్డారు. దస్తగిరి తన దగ్గర ఉంచుకున్న కత్తితో ఇమాంహుస్సేన్‌పై దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించగా అప్పటికే ఇమాంహుస్సేన్ మృతి చెందాడు. అబ్దుల్‌ఖాదర్, దస్తగిరిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమణయ్య తెలిపారు.

రాజమండ్రి రైల్వే సిబ్బంది అప్రమత్తతతో....

ఈస్ట్‌కోస్ట్‌కి తప్పిన ప్రమాదం

రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని రైల్వే టీఎక్స్ఆర్ సిబ్బంది అప్రమత్తతతో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. షాలిమార్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం 9.19గంటలకు చేరుకొంది. అయితే, ఎస్-7 బోగీ వీల్స్ యాక్సిల్ బాక్స్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్టు టీఎక్స్ఆర్ సిబ్బంది గుర్తించారు. ఆ బోగీని రైలు నుంచి వేరుచేసి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మిగతా బోగీల్లో సర్దుబాటు చేశారు. మధ్యాహ్నం 12.05గంటలకు రైలు బయలుదేరింది.

ప్రిన్సిపాళ్ల పదోన్నతి ఉత్తర్వులపై హైకోర్టు స్టే

- జీవో 76కు విరుద్ధమన్న ధర్మాసనం

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 197 మంది జూనియర్ లెక్చరర్‌లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు సోమవారం సస్పెండ్ చేసింది. పదోన్నతుల్లో లైబ్రరీ సైన్స్ లెక్చరర్లను పరిగణలోకి తీసుకోకపోవడాన్ని ప్రాథమికంగా తప్పుబట్టింది. కమిషనర్ నిర్ణయం.. జీవో 76కు విరుద్ధంగా ఉందని పేర్కొంది. ఈ వ్యవహారం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్, సాధారణ పరిపాలనశాఖ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను 25కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ జూనియర్ కాలేజీలలో జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించే విషయంలో 2021లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 76, ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌ను పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంజీవరావు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ... లైబ్రరీ సైన్స్ లెక్చరర్లను పదోన్నతిలో పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఇంటర్మీడియట్ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్.. హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వం ఇచ్చిన జీవోకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి ఆ ప్రొసీడింగ్స్‌ను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

కేఏ పాల్ వినతిపై నిర్ణయం తీసుకోండి

- కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర సీఈవోకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఎన్నికలు ముగిసిన తరువాత సాధ్యమైనంత త్వరగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ దాఖలు చేసిన పిల్ పై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ సమర్పించిన వినతి పై తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. అంతకు ముందు పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ నేరుగా వాదనలు వినిపించారు. గతంలో ఈవీఎంలు రీప్లేస్ చేశారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. అందుకు సంబంధించి పోలీసులు కేసులు కూడా నమోదు చేశారన్నారు. ఏపీలో ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు మధ్య 21 రోజుల గడువు ఉందని, ఈ గ్యాప్‌లో ఈవీఎంలు ట్యాంపరింగ్ చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం పిటిషనర్ వినతిని పరిగణలోకి తీసుకొని తగిన ఉత్తర్వులను జారీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర సీఈవోను ఆదేశించింది. పిల్‌ను పరిష్కరించింది.

డీఎస్సీని వాయిదా వేయాలి: నిరుద్యోగ జేఏసీ

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగ జేఏసీ ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ఆధ్వర్యంలో జేఏసీ నేతలు సోమవారం సచివాలయంలో సీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించేలా షెడ్యూలు ఇచ్చారని, ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని అధికార పార్టీ ప్రయత్నిస్తోందని అందులో ఆరోపించారు. పైగా ఎన్నికల సమయంలో పరీక్షలకు సన్నద్ధం కావడం, పరీక్షలకు హాజరుకావడం ఇబ్బందిగా ఉంటుందని, అందువల్ల ఎన్నికల తర్వాత నిర్వహించేలా ఆదేశించాలని కోరారు.

కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌లో సభ్యులుగా విశ్రాంత అధికారులు

- బీవీ సుధాకర్, జీ మల్లికార్జున్ నియామకం

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు ఇద్దరు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇండియన్ పోస్టల్ సర్వీస్ విశ్రాంత అధికారి బీవీ సుధాకర్, ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ విశ్రాంత అధికారి జీ మల్లికార్జున్‌ను సభ్యులుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు.

సాగర్ గేట్లకు మరమ్మతులు చేసుకోండి

» కానీ నష్టాలకు రాష్ట్రాలదే బాధ్యత: కేఆర్ఎంబీ

» 22న తుంగభద్ర బోర్డు భేటీ

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ డ్యాంలో దెబ్బతిన్న పెన్‌స్టాక్ ఇన్‌టేక్ గేట్లకు మరమ్మతులు చేసుకునేందుకు కృష్ణా నదీయాజమాన్య సంస్థ (కేఆర్ఎంబీ) ఆమోదించింది. అయితే మరమ్మతుల సమయంలో ప్రాజెక్టుకు ఏదైనా నష్టం వాటిల్లితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలదే పూర్తి బాధ్యతని.. తనకు ఏ మాత్రం సంబంధం ఉండదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ నెల 13న ఆదేశాలిచ్చింది. ప్రతి బుధవారం మరమ్మతు చేయాలని.. ఈ పనులను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాను మించిన ఇంజనీరింగ్ అధికారి మాత్రమే పర్యవేక్షించాలని తేల్చిచెప్పింది. ఈ గేట్లకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖలు, జెన్‌కోలు, కాంట్రాక్టు సంస్థలు కలిసి సమన్వయంతో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కాగా.. ఈ నెల 22న తుంగభద్ర బోర్డు సమావేశం జరుగనుంది. ఆలోగా రాష్ట్రావసరాలను తెలియజేస్తూ ఇండెంట్ పెట్టాలని ఆంధ్రప్రదేశ్‌కు తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి లేఖ రాశారు.

ఏపీపీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి: పట్టాభి

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ రాజీనామా చేయాలని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం సోమవారం డిమాండ్ చేశారు. గ్రూప్ 1 మెయిన్ మూల్యాంకనం మూడు సార్లు జరిగితే ఒక్కసారే చేశామని ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ బుకాయించడం సిగ్గుచేటన్నారు. ఈ స్కాంపై తాము ఇచ్చిన ఆధారాలు చూసి గవర్నర్ సైతం ఆశ్చర్యపోయారన్నారు. తప్పుచేసిన సవాంగ్‌కు ఏపీపీఎస్సీ చైర్మన్‌గా కొనసాగే అర్హత లేదన్నారు. గవర్నర్ సవాంగ్‌ను తొలగించే ముందే ఆయన రాజీనామా చేస్తే గౌరవప్రదంగా ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏపీపీఎస్సీ గ్రూప్ 1 స్కాంపై సీబీఐ విచారణ జరిపిస్తామన్నారు.

జగన్ విధ్వంసంతో జాతికి ద్రోహం: దేవినేని ఉమా

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విధ్వంసంతో జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు కృషితో పోలవరానికి జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు తెస్తే, జగన్ విధ్వంసంతో జాతికి ద్రోహం చేశారన్నారు. ప్రజావేదిక విధ్వంసంతో ప్రారంభమైన జగన్ పాలన డయాఫ్రం వాల్ విధ్వంసంతో ముగిసిందన్నారు. కేంద్రం పోలవరానికి ఇచ్చిన రూ.2,500 కోట్ల నిధులు నిర్వాసితులకు ఇవ్వకుండా దారి మళ్లించారన్నారు. వైసీపీ సర్కార్‌లో జలవనరుల శాఖ ఇద్దరు మంత్రులూ జగన్ కనుసన్నల్లో చేతగాని అసమర్థుల్లా మారారు. పోలవరాన్ని ముంచేసి జాతికి ద్రోహం చేశారన్నారు. సీఆర్‌పీఎఫ్‌కు నాగార్జునసాగర్ డ్యామ్‌ను అప్పగించిన ప్రబుద్ధులు వైసీపీ నాయకులని అన్నారు.

'ప్రజాగళం' విజయంతో జగన్ వెన్నులో వణుకు: కొల్లు రవీంద్ర

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజాగళం విజయంతో జగన్ వెన్నులో వణుకు మొదలైందని, కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై బీసీల్లో హర్షం వ్యక్తమవుతోందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. చిలకలూరిపేటలో ప్రజాగళం సభ జాతీయ రహదారిపై సుమారు 20 కిలోమీటర్లకు పైగా వాహనాలు స్తంభించడం ఇందుకు ఉదాహరణ అన్నారు. సభకు పది లక్షల మందికి పైగా ప్రజలు హాజరయ్యారని, ఇంత భారీగా జరుగుతున్న సభ విషయంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించిందన్నారు. బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చామని చెప్పుకునే జగన్‌రెడ్డి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కుదింపుపై సమాధానం చెప్పాలన్నారు.

రెండేళ్ల పిల్లాడికి స్నానం చేయించడం వేధింపా?

» గుజరాత్ హైకోర్టులో బాధితుడి పిటిషన్.. గూగుల్‌కు కోర్టు నోటీసులు

అహ్మదాబాద్, మార్చి 18: తనకు రెండేళ్ల వయసున్నప్పుడు నాయనమ్మ స్నానం చేయిస్తున్న ఫొటోను ఓ వ్యక్తి గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేశాడు. ఫొటోలో బాలుడు నగ్నంగా ఉండటంతో దాన్ని "చిన్న పిల్లలపై వేధింపు"గా భావించిన గూగుల్ సంస్థ అతడి ఈ మెయిల్ ఖాతాను బ్లాక్ చేసింది. స్నానం చేయిస్తున్నది తన నాయనమ్మ అని, అందులో వేధింపులేవీ లేవని సదరు వ్యక్తి గూగుల్‌కు ఎన్నోసార్లు వివరణ ఇచ్చాడు. అయినా, సంస్థ అతని ఈ మెయిల్ ఖాతాను అన్‌బ్లాక్ చేయకపోవడంతో గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. గుజరాత్‌కు చెందిన కంప్యూటర్ ఇంజనీర్ నీల్‌శుక్లా చిన్ననాటి జ్ఞాపకాలను పదిలపర్చుకోవడం కోసమని నాటి ఫొటోలను గతేడాది ఏప్రిల్‌లో గూగుల్ డ్రైవ్‌లోకి అప్‌లోడ్ చేశారు. అందులో తన నాయనమ్మ అతనికి స్నానం చేయిస్తున్న ఫొటో కూడా ఉంది. దీంతో గూగుల్ అతని అకౌంట్‌ను బ్లాక్ చేసింది. దీనిపై నీల్‌శుక్లా గూగుల్‌కు వివరణ ఇవ్వడంతో పాటు, గుజరాత్ పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 12న గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏడాది కాలంగా ముఖ్యమైన మెయిల్స్ చూడక తన వ్యాపారానికి నష్టం వాటిల్లిందని అందులో తెలిపారు. దీంతో కోర్టు గూగుల్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు పంపించింది. ఈ నెల 26వ తేదీలోగా స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

అఫ్ఘాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 8మంది మృతి

ఇస్లామాబాద్/కాబూల్, మార్చి 18: అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ సైన్యం సోమవారం వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. పాకిస్థాన్ నగరాల్లో ఇటీవల జరిగిన ఉగ్రదాడులపై ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో తాజా దాడులు చోటుచేసుకున్నాయి. పాకిస్థాన్ సరిహద్దు వెంబడి ఉన్న అఫ్గనిస్థాన్ ప్రావిన్సులు పక్తికా, ఖోస్ట్‌లో వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడులను అఫ్ఘాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. కాగా ఉత్తర వజీరిస్థాన్‌లోని భద్రతా బలగాల పోస్ట్‌పై జరిగిన ఉగ్రదాడితో ఇద్దరు అధికారులు సహా ఏడుగురు జవాన్లు మృతి చెందడంతో దానికి ప్రతీకారం తీర్చుకుంటామని పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ప్రతిన బూనిన మరుసటి రోజే వైమానిక దాడులు జరగడం చర్చనీయాంశమైంది.

మరో ఏడాది పాటు యూరియా దిగుమతులు

న్యూఢిల్లీ, మార్చి 18: దేశంలో యూరియా కొరత లేకుండా చేసేందుకు కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరో ఏడాది పాటు యూరియాను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు 'ఇండియా పొటాష్ లిమిటెడ్' ఆధ్వర్యంలో ప్రభుత్వ అకౌంట్ ద్వారా యూరియా దిగుమతులు జరగనున్నాయి. ఈ మేరకు డైరక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గతేడాది ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్య కాలంలో భారత్ 1.81 బిలియన్ డాలర్ల విలువైన యూరియాను దిగుమతి చేసుకుంది. భారత్ ప్రధానంగా చైనా, ఒమన్, రష్యా దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకుంటోంది.



టైగర్ ట్రయంఫ్-24 ప్రారంభం

31 వరకు భారత్-అమెరికా సంయుక్త విన్యాసాలు

విశాఖపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భారత్, అమెరికా సంయుక్తంగా నిర్వహించే 'టైగర్ ట్రయంఫ్-24' విశాఖలో సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 31 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో.. ఇరు దేశాలకు చెందిన త్రివిధ దళాలు పాల్గొంటాయి. ట్రయంఫ్‌లో మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సంయుక్త విన్యాసాలు ప్రధానాంశాలుగా ఉంటాయి. ఈ నెల 18 నుంచి 25 వరకు హార్బర్ ఫేజ్, ఆ తర్వాత రెండో దశలో సముద్ర విన్యాసాలు నిర్వహిస్తారు. భారత్ తరఫున హెలికాప్టర్లతో కూడిన యుద్ధనౌకలు, యుద్ధ విమానాలు, సైనిక దళాలు, వైమానిక దళానికి చెందిన విమానాలు పాల్గొంటాయి. అమెరికా తరఫున నేవీ నౌకలు, మెరైన్ బృందాలు, సైనిక దళం పాల్గొంటున్నాయి. ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నేవీ వర్గాలు తెలిపాయి.

41 అంతస్తుల భవనానికి నేవీ శంకుస్థాపన: విశాఖపట్నంలో అతి పెద్ద భవన నిర్మాణానికి తూర్పు నౌకాదళం అధికారులు



శ్రీకారం చుట్టారు. సెయిలర్లకు వసతి కల్పించే లక్ష్యంతో 41 అంతస్తుల భారీ భవన నిర్మాణానికి నౌసేనా బాగ్‌లో ఈ నెల 14న శంకుస్థాపన చేశారు. నగరంలో లాన్సమ్ గ్రూపు సీతమ్మధారలో ఆక్సిజన్ టవర్స్‌ని 36 అంతస్తులతో ఐదేళ్ల క్రితం నిర్మించింది. అందులో 640 వరకు ఫ్లాట్లు ఉన్నాయి. ఇప్పటివరకు విశాఖపట్నంలో ఇదే ఎత్తయిన భవనం. తాజాగా నేవీ నిర్మిస్తున్న భవనం పూర్తయితే విశాఖలో అదే అత్యంత ఎత్తయిన భవనం అవుతుంది.

టికెట్లు మాకే ఇవ్వాలి!

» బీజేపీలో పెరుగుతున్న ఆశావహులు

» టీడీపీ-జనసేనతో పొత్తుతో గెలుపుపై ధీమా

» నాయకత్వంపై ఒత్తిడికి యత్నాలు

» కర్ణాటక నుంచి సైతం సిఫారసులు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాకు అవకాశం ఇవ్వాల్సిందే' అంటూ బీజేపీలో పలువురు నేతలు పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. టీడీపీ, జనసేనతో పొత్తు కుదరడంతో గెలుపుపై ధీమా పెరిగి.. బీజేపీలో టికెట్లు ఆశిస్తున్న వారి సంఖ్యా పెరుగుతోంది. ఏ సీటు ఖరారైందో అంతర్గతంగా సమాచారం తెలుసుకుని.. తాము కన్నేసిన సీట్లు వాటిలో ఉంటే తమకు అన్యాయం జరిగిందంటూ పార్టీ కార్యాలయానికి వస్తున్నారు. ఓ మోస్తరు నాయకులకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సర్ది చెప్పి పంపుతున్నారు. మరికొందరు మాత్రం ఒత్తిడి తేవడానికి ప్రయత్నిస్తున్నారు. తాము బరిలో నిలుస్తామంటూ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. లోక్‌సభ సీటు కోసం 'తపన' పడుతున్న ఒక నాయకుడు నాలుగు రోజుల క్రితం ఇలాంటి భేటీ పెట్టారు. పార్టీ కోసం కష్టపడ్డాను.. కోట్లు ఖర్చు చేశానని ఆయన ఆ సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర నాయకత్వం ఘాటుగా స్పందించింది. స్వచ్ఛంద సేవ ముసుగులో సొంత కార్యక్రమాలు చేపట్టి అవన్నీ పార్టీ కోసమంటే ఎలాగని నిలదీసింది. జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పనిచేసి గెలిచే అభ్యర్థులకే సీట్లు దక్కుతాయని స్పష్టం చేసింది. పార్టీలో ఎంతో మంది సీనియర్లు టికెట్ దక్కినా, దక్కకున్నా పనిచేస్తున్నారని.. మీరు బెదిరిస్తే నాయకత్వం భయపడదని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒక అసంతృప్త నేతను సున్నితంగా హెచ్చరించినట్లు తెలిసింది. మరోవైపు.. అనంతపురం పార్లమెంటు స్థానం తనకు ఇప్పించాలంటూ ఇటీవలే పార్టీలో చేరిన ఒక నాయకుడు కర్ణాటక నేతల ద్వారా ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వారం రోజుల క్రితం ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు జై పాండా, జనసేనాని పవన్ కల్యాణ్‌తో జరిగిన చర్చల్లో బీజేపీకి పది అసెంబ్లీ, ఆరు పార్లమెంటు స్థానాలు దక్కగా.. జనసేనకు 21 అసెంబ్లీ, రెండు పార్లమెంటు సీట్లు దక్కాయి. మిగతా 144 అసెంబ్లీ, 17పార్లమెంటు స్థానాల్లో టీడీపీ పోటీచేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆదోని, ధర్మవరం, జమ్మలమడుగు, బద్వేలు(ఎస్సీ), విజయవాడ పశ్చిమ, కైకలూరు, అనపర్తి అసెంబ్లీ సీట్లు ఖరారైనట్లు చెబుతున్నా అనపర్తి అభ్యర్థిని ఇప్పటికే టీడీపీ ప్రకటించినందున పి.గన్నవరం (ఎస్సీ) సీటును బీజేపీకి కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో శ్రీకాకుళం, పాడేరు(ఎస్టీ), విశాఖ ఉత్తరం బీజేపీకి దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఆదోని అభ్యర్థిగా బీసీ వైద్యుడి పేరు బలంగా వినిపిస్తోంది. జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డికి కుటుంబ సభ్యుల నుంచే సహకారం లభించడం లేదు. విజయవాడ పశ్చిమను బీజేపీకి కేటాయించడంపై జనసేన శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆ పార్టీకి చెందిన బలమైన బీసీ సామాజిక వర్గం నేత నిరసనకు దిగారు. మరోవైపు కైకలూరు, అనపర్తి స్థానాలను వయసు మళ్లిన వారికి ఇస్తే ఊరుకోబోమని కొందరు పట్టుబడుతున్నారు. పాడేరు నుంచి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, విశాఖ ఉత్తరంలో విష్ణుకుమార్‌రాజు పేర్లు దాదాపు ఖరారయ్యాయి. అయితే శ్రీకాకుళం సీటుపై పార్టీలో గందరగోళం నెలకొంది. అక్కడ వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఎదుర్కొగల సమర్థ నాయకుడు బీజేపీకి లేరని పార్టీ పెద్దలకు ఫోన్లు వస్తున్నాయి. దాని బదులు అదే జిల్లాలో పాతపట్నం సీటు తీసుకోవాలని.. అక్కడ బీసీ అభ్యర్థిని బరిలో దించితే ఫలితం మెరుగ్గా ఉంటుందని అంటున్నట్లు తెలిసింది.



కాంగ్రెస్ రెబల్స్ అనర్హతపై స్టేకు నిరాకరణ

న్యూఢిల్లీ, మార్చి 18: హిమాచల్ ప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ జారీ చేసిన అనర్హత ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్ ధిక్కరించి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు ఆరుగురు ఎమ్మెల్యేలపై స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అనర్హతను తొలగించాలంటూ సదరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది. నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలని స్పీకర్‌ను కోరుతూ ఆయన కార్యాలయానికి నోటీసులు జారీ చేసింది. అలాగే పిటిషన్‌పై తమ నిర్ణయాన్ని వెల్లడించే వరకు ఆరుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు, ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనుమతించకూడదని స్పష్టం చేసింది. అయితే ఆ 6 స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ కూడా ప్రకటించిన నేపథ్యంలో దానిపై స్టే విధించే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని కోర్టు పేర్కొంది.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ, మార్చి 18: ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ) కేసులో సోమవారం విచారణకు రావాలంటూ ఈడీ ఇచ్చిన సమన్లను సీఎం కేజ్రీవాల్ పట్టించుకోలేదు. విచారణ నిమిత్తం ఆ సంస్థ కార్యాలయానికి వెళ్లలేదు. ఇప్పటికే మద్యం కుంభకోణంలో ఈడీ ఇచ్చిన ఎనిమిది సమన్లను విస్మరించిన కేజ్రీవాల్..జల్ బోర్డు కేసులో వచ్చిన మొదటి సమన్లను కూడా బేఖాతరు చేశారు. జల్ బోర్డు వ్యవహారాల్లో మనీలాండరింగ్ జరిగిందని ఈడీ ఆరోపిస్తోంది.

కువైత్‌లో అనధికార నివాసితులకు తీపి కబురు

» క్షమాభిక్ష ప్రకటించిన కువైత్ ప్రభుత్వం

» అన్నమయ్య జిల్లా ప్రవాసులకు ఊరట

రాజంపేట, మార్చి 18: కువైత్ దేశంలో అనధికారికంగా ఎన్నో సంవత్సరాలుగా ఉంటూ ఇబ్బందులు పడుతున్న అన్నమయ్య జిల్లా ప్రవాసులకు ఎంతో ఊరట లభించింది. జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల నుంచి లక్ష మందికి పైబడి కువైత్‌కు వెళ్లి వివిధ వృత్తుల్లో జీవనం సాగిస్తున్నారు. పలు ట్రావెల్ ఏజెంట్లను నమ్మి తప్పుడు వీసాలతో అక్కడికి వెళ్లి ఆ దేశంలో అధికారికంగా తిరగడానికి వీలు లేక దొంగచాటుగా జీవనం సాగిస్తున్నారు. ఆ దేశ అంచనాల ప్రకారం 1.30 లక్షల మంది ఆ దేశంలో అక్రమంగా నివాసం ఉండగా అందులో అన్నమయ్య జిల్లా వాసులు 5 వేల మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరికీ కువైత్ ప్రభుత్వం రంజాన్ నెల సందర్భంగా ఈనెల 17న క్షమాభిక్ష ప్రకటించింది. ఈ క్షమాభిక్షకు దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 17వరకు గడువు ఇచ్చారు. దీనిప్రకారం ఆ దేశంలో అక్రమంగా ఉంటున్న వారు అపరాధ రుసుం లేకుండా దేశం విడిచి వెళ్లడానికి, ఒకవేళ అక్కడే ఉండాలనుకుంటే అపరాధ రుసుం చెల్లించి ఉండటానికి చట్టబద్ధత కల్పించుకునేందుకు అనుమతినిచ్చింది. దీంతో బాధితుల కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ దేశంలో 2020 ఏప్రిల్‌లో కూడా ఇదే విధంగా క్షమాభిక్ష పెట్టి అనధికారికంగా ఉన్న వారికి ఈ సౌలభ్యాన్ని కల్పించారు.

5 వేల జిల్లా వాసులకు ఊరట: కువైత్‌లో పనులు ఉన్నట్లు, ఏదో కంపెనీలో ఉద్యోగం లభించినట్లు తప్పుడు వీసాలు తీసి కొంతమంది ట్రావెల్ ఏజెంట్లు సుమారు 5వేల మందిని మోసం చేశారు. అటువంటి వారు కువైత్‌లో పనులు దొరక్క ఎడారిలో దొంగచాటులో గొర్రెలు మేపుకోవడం, గుట్టుచప్పుడు కాకుండా ఇతరత్రా పనులు చేసుకుంటూ అక్కడ జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారు ఇకపై అక్కడ ఉండాలన్నా, లేదా భారత్‌కు వెళ్లాలన్నా కువైత్ వారికి క్షమాభిక్ష ప్రకటించడంతో ఇబ్బందులు తొలగిపోయాయని కువైత్ ఉంటున్న అన్నమయ్య జిల్లావాసి షేక్ మస్తాన్ ఆనందం వ్యక్తం చేశారు.

కేజ్రీవాల్, సిసోడియాతో కవిత కుమ్మక్కు

» నిబంధనలకు విరుద్ధంగా ఢిల్లీ మద్యం విధానం

» ఆప్ నేతలకు రూ.100 కోట్ల ముడుపులిచ్చారు

» డీలర్ల నుంచి వచ్చిన డబ్బును వాటాలేసుకున్నారు

» ఆమె పాత్రను ధ్రువీకరించిన తర్వాతే అరెస్టు.. ఈడీ ప్రకటన..

» సమన్లు జారీచేయబోమని కోర్టుకు చెప్పి అతిక్రమించారు

» సుప్రీం కోర్టులో కవిత పిటిషన్..

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా వంటి ఆప్ అగ్ర నేతలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కుమ్మక్కయ్యారని, ఢిల్లీ మద్యం విధానం(2021-22) రూపకల్పన, అమలు ద్వారా అక్రమంగా ప్రయోజనాలు పొందాలని చూశారని ఈడీ పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆప్ నేతలకు రూ.వంద కోట్ల ముడుపులు చెల్లించడంలో కవిత కీలక పాత్ర పోషించారని వివరించింది. ముడుపుల రూపేణా చెల్లించిన సొమ్మును తిరిగి రాబట్టుకునేందుకు, లాభాలు ఆర్జించేందుకు వీలుగా మొత్తం కుట్ర జరిగిందని, నిబంధనలకు విరుద్ధం గా మద్యం విధానం రూపొందించారని పేర్కొంది. హైదరాబాద్‌లో తాము సోదా లు నిర్వహిస్తున్నప్పుడు కవిత బం ధువులు, సహచరు లు తమను అడ్డుకున్నారని ఈడీ తెలిపింది. కాగా, మ ద్యం కుంభ కోణా నికి సంబం ధిం చిన కేసులో ఈ నెల 15న కవిత అరెస్టు తర్వాత మొదటి సారి ఈడీ అధికారికంగా స్పందించింది. ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబై తదితర 245 ప్రాంతా ల్లో సోదాలు నిర్వహించామని, రూ.128.79 కోట్ల ఆస్తులను జప్తు చేశామని తెలిపింది. సిసోడియాతో పాటు సంజయ్ సింగ్, విజయ్‌నాయర్ వంటి ఆప్ నేతలను అరెస్టు చేశామని పేర్కొంది. కుంభకోణంపై ఇంకా దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. ఢిల్లీలోని మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రత్యేక కోర్టు ఈ నెల 23 వరకు కవితకు రిమాండ్ విధించడంతో పాటు విచారణ నిమిత్తం ఈడీ కస్టడీకి అప్పగించినట్లు పేర్కొంది.



కవిత పిటిషన్‌పై నేడు విచారణ

ఢిల్లీ మద్యం కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ కవిత సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణ జరగతుండగానే అరెస్ట్ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో విచార ణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు ఈడీ తరఫు న్యాయవాది చెప్పారని గుర్తు చేశారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, ఈడీపై తగిన చర్యలు తీసుకోవాలని కవిత తరఫున న్యాయవాది ఆన్‌లైన్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ఢిల్లీ మద్యం కేసు లో ఈడీ తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలని, మహిళలను దర్యాప్తు కార్యాలయాలకు పిలిచి విచారించకుండా ఇంటివద్దనే విచారించాలని నిరుడు మార్చిలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళిని చిదంబరం, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీల పిటిషన్లతో ట్యాగ్ చేసింది. ఈ నెల 15న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. ఆ కేసును ఈ నెల 19 (మంగళవారాని)కి వాయిదా వేశారు. గత పిటిషన్‌తో కలిపి రెండింటినీ మంగళవారమే సుప్రీం ధర్మాసనం విచారించనుంది.

రష్యా అధ్యక్షుడిగా మళ్లీ పుతిన్

» మరో ఆరేళ్ల పాటు ఆయనే దేశాధినేత..!

» రికార్డు స్థాయిలో 87 శాతంపైగా ఓట్లు

» నాటోతో ఘర్షణ.. 3వ ప్రపంచ యుద్ధమే

» వదిలేయాలనుకుంటుండగా నావల్నీ మృతి

» విజయం అనంతరం పుతిన్ వ్యాఖ్యలు



మాస్కో, మార్చి 18: ప్రపంచంలో అతిపెద్ద దేశమైన రష్యాకు వ్లాదిమిర్ పుతిన్(71) మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం మొదలైన రష్యా ఎన్నికల పోలింగ్ మూడు రోజుల పాటు జరిగింది. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ సోమవారం ఫలితం వెల్లడిస్తూ.. పుతిన్‌కు 87.29 శాతం ఓట్లు వచ్చాయని తెలిపింది. 76 మిలియన్ల మంది పుతిన్‌కు అనుకూలంగా ఓటేశారని వివరించింది. తాజా ఎన్నికలతో కలిపి ఐదు సార్లు అధ్యక్షుడిగా పోటీచేసిన ఆయన కు ఇవే అత్యధిక ఓట్లు కావడం గమనార్హం. ఈ ఎన్నికల్లో పుతిన్‌కు ప్రత్యర్థులుగా నిలిచేందుకు ముగ్గురికి మాత్రమే అనుమతి లభించింది. కాగా, వీరంతా ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యను సమర్థించినవారే. పుతిన్ మరో ఆరేళ్లు.. అంటే 2030 వరకు రష్యా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. 1924-53 మధ్య సోవియట్ యూనియన్‌ను 29 ఏళ్ల పాటు నిరాటంకంగా పాలించిన జోసెఫ్ స్టాలిన్ రికార్డును బద్దలుకొట్టనున్నారు. 1999లో ప్రధాని అయిన పుతిన్.. 2000-08 మధ్య రెండుసార్లు దేశాధినేతగా, 2008-12 కాలంలో మరోసారి ప్రధానిగా వ్యవహరించారు. అధ్యక్షుడి పదవీ కాలాన్ని ఆరేళ్లకు పెంచాక 2012, 2018 లోనూ గెలిచారు. మరోవైపు తాజా ఘన విజయం అనంతరం పుతిన్ మీడియాతో మాట్లాడారు. అవసరమైతే తమ సైన్యాన్ని ఉక్రెయిన్‌కు పంపుతామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ప్రకటించిన నేపథ్యంలో తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే ఉక్రెయిన్‌లో నాటో బలగాలు ఉన్న సంగతిని గుర్తుచేశారు. అమెరికా సారథ్యంలోని నాటో కూటమితో గనుక తమకు ఘర్షణ తలెత్తితే అది 3వ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరించారు. తన బద్ధ విరోధి అయిన అలెక్సీ నావల్నీని జైలు నుంచి విడుదల చేయాలనుకుంటున్న సమయంలోనే ఆయన మృతిచెందారని తెలిపారు.

మంత్రిగా పొన్ముడి ప్రమాణ స్వీకారానికి గవర్నర్ నిరాకరణ

» సుప్రీంకోర్టును ఆశ్రయించిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నై, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు మళ్లీ శాసనసభ్యత్వం పొందిన తమిళనాడు మాజీ మంత్రి కె.పొన్ముడి చేత మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు నిరాకరించిన గవర్నర్ ఆర్ఎన్ రవి నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, పి.విల్సన్ సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు హాజరై ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ధర్మాసనం అనుమతించింది. ఆదాయానికి మించి అక్రమార్జనకు పాల్పడిన కేసులో పొన్ముడికి హైకోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించగా, ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఆయన ఎమ్మెల్యే పదవిని కోల్పోయారు. దాంతో ఉన్నతవిద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా, హైకోర్టు విధించిన శిక్షను సవాలు చేస్తూ పొన్ముడి సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు విధించిన జైలు శిక్షను నిలుపుదల చేసింది. దాంతో ఆయన మళ్లీ శాసనసభ్యత్వం పొందారు. పొన్ముడిని మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించిన స్టాలిన్.. ఆ మేరకు ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించాలని గవర్నర్‌కు ఇటీవల లేఖ రాశారు. అయితే ఇందుకు గవర్నర్ నిరాకరించారు. అక్రమార్జన కేసులో పొన్ముడికి హైకోర్టు విధించిన జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చిందే తప్ప ఆయన్ని నిర్దోషిగా ప్రకటించలేదని, అలాంటి వ్యక్తి చేత ప్రమాణం చేయించబోనని ప్రకటించారు.

ఎంపీ సంజయ్‌సింగ్‌ను పార్లమెంట్‌కు తీసుకెళ్లండి

» తీహార్ జైలుకు కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 18: తీహార్ జైలులో ఉన్న ఆమ్‌ఆద్మీ నేత సంజయ్‌సింగ్‌ను రాజ్యసభ ఎంపీగా ప్రమాణం స్వీకారం చేయించడానికి మంగళవారం పార్లమెంట్‌కు తీసుకువెళ్లవలసిందిగా జైలు అధికారులకు ఢిల్లీ కోర్టు ఆదేశాలిచ్చింది. ఆయనకు సరిపడా భద్రతనిచ్చి ప్రమాణస్వీకారం అనంతరం తిరిగి జైలుకు తరలించవలసిందిగా జైలు సూపరిండెంట్‌కు ప్రత్యేక జడ్జీ ఎంకే నాగ్‌పాల్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఆ సమయంలో తన కుటుంబ సభ్యుల్ని, లాయర్‌ని తప్ప మరెవర్నీ కలవడానికి వీలులేదని నిందితుడికి షరతు విధించారు.

ఢిల్లీ దాకా బీఆర్ఎస్ స్కామ్‌లు

» మద్యం పాలసీ కుంభకోణమే ఇందుకు నిదర్శనం

» తెలంగాణ వాదాన్ని వాడుకొని బీఆర్ఎస్ దోపిడీ

» రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకున్న కాంగ్రెస్

» ఆ రెండు పార్టీలను ఎన్నికల్లో మట్టి కరిపిస్తాం

» జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ

జగిత్యాల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణను దోచుకుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి తెలంగాణకే పరిమితం కాలేదని, ఢిల్లీకి సైతం పాకిందని అన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో బీజేపీకి ఎన్ని ఎక్కువ సీట్లు వ స్తే తనకు అంత బలం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించి తనను శక్తివంతున్ని చేయాలని కోరారు. "శక్తి వినాశకారుల నుంచి రక్షించడానికి నాకు మరింత శక్తి కావాలి. ఆ శక్తిని మీరు ఇవ్వాలి" అని మోదీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జగిత్యాలలో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ద్వారా కాళేశ్వరం స్కాం జరిగిందన్నారు. ప్రజలందరూ కుటుంబ పార్టీలను గమనించాలని కోరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను మట్టికరిపిస్తాం..

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను మట్టికరిపిస్తామని మోదీ అన్నారు. ఈ అంశం దేశమంతా చెబుతోందని, తెలంగాణను లూటీ చేసిన పార్టీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రకటించారు. ఇందుకు అవసరమైన శక్తిని ఎన్నికల ఫలితాల ద్వారా బీజేపీకి అందించాలని కోరారు. మే 13వ తేదీన తెలంగాణలో జరిగే ఎన్నికలతో కొత్త చరిత్ర సృష్టించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రోజురోజుకూ బీజేపీకి మద్దతు పెరుగుతోందని, తెలంగాణలో మూలమూలకూ బీజేపీ బలపడుతోందని మోదీ అన్నారు. జగిత్యాలలో నిర్వహించిన విజయసంకల్ప సభ రాష్ట్రంలో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజలంద రూ ఈసారి సైతం మోదీ సర్కారును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కోసం బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు దాటాలన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయి...

ఆంగ్లేయులు, రజాకార్లతో పోరాడిన గడ్డ తెలంగాణ అని మోదీ అన్నారు. రాష్ట్రంలో ఓవైపు ఎలాంటి అభివృద్ధి చేయని కాంగ్రెస్ పార్టీ, మరోవైపు తెలంగాణ వాదాన్ని వినియోగించుకొని అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ ఉన్నాయని, ఈ రెండు పార్టీలు ప్రజలను వంచించాయని ఆరోపించారు. తెలంగాణలో పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి రాష్ట్రాన్ని లూటీ చేసిందని, ప్రస్తు తం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తెలంగాణను తన ఏటీఎంగా మార్చుకుంటోందన్నారు. రాష్ట్రంలో ఈ రెండు కుమ్మక్కై పనిచేస్తున్నాయని, బీఆర్ఎస్ అవినీతి పై కాంగ్రెస్ మాట్లాడకపోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకత వల్లనే రాష్ట్రం లో ఆ పార్టీని అధికారం నుంచి దించారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ లెక్కలేనన్ని హామీలు ఇచ్చిందని, ప్రస్తుతం వాటిని నెరవేర్చలేని స్థితిలో ఉం దని విమర్శించారు. కాంగ్రెస్ హామీల అమలును బీఆర్ఎస్ ప్రశ్నించడం లేదని, ఒకరినొకరు రక్షించుకునే పని లో ఉన్నారని, మోదీని తిట్టడమే వారు పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఈ రెండు పార్టీలు చేసిన అన్ని రకాల అవినీతిని లెక్కగట్టి బయటకు తీస్తానని, తెలంగాణను లూటీ చేసిన వాళ్లను వదిలేది లేదని అన్నారు.



వికసిత్ తెలంగాణతో వికసిత్ భారత్...

వికసిత్ తెలంగాణతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని మోదీ అన్నారు. దేశంలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కలిగించానని, 4 కోట్ల మంది కి పైగా ఇళ్లు కట్టించామని, 12 కోట్ల కుటుంబాలకు తాగునీరు అందించామని, 50 కోట్ల కుటుంబాలను బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకున్నామని, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 50 కోట్ల మందికి ఆరోగ్య సేవలు అందిస్తున్నామని, నిరుపేదలకు ఆదుకోవడానికి ఆత్మనిర్భర్ పథకం ద్వారా వేల కోట్లు వ్యయం చేశామని వివరించారు. తెలంగాణలో 11 లక్షలకు పైగా మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఉజ్వల యోజన కింద పంపిణీ చేశామని, 30 లక్షల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.6 వేల చొప్పున అందించామని తెలిపారు. అయితే మోదీ ప్రసంగాన్ని ఎవరూ తెలుగులోకి అనువాదం చేయలేదు. దీంతో ఆయన చెప్పిన కొన్ని విషయాలు జనాలకు అర్థం కాలేదు.

తిరుపతి ఐఐటీలో / పీజీ, పీహెచ్‌డీ

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీలో ఎంటెక్, ఎంపీపీ, ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన మేరకు గేట్ వ్యాలిడ్ స్కోర్/రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్‌పూర్తిచేసినవారిని గేట్ స్కోర్ నుంచి మినహాయించారు. వీరికి అన్ని ప్రోగ్రామ్‌లలో నేరుగా అడ్మిషన్ ఇస్తారు. ఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంది. దీనికి గేట్ స్కోర్ అవసరం లేదు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ సౌకర్యం ఉంది. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటల సేపు టీచింగ్ అసిస్టెంట్‌షిప్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సంబంధిత విభాగాల్లో ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్, ట్యుటోరియల్స్, అసైన్‌మెంట్స్, టెస్ట్ పేపర్స్, సెమినార్స్, రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు తదితర యాక్టివిటీస్‌లో అసిస్టెంట్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందినవారికి హెచ్‌టీటీపీఏ కింద నెలకు రూ.12,400 చెల్లిస్తారు.

ఎంటెక్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఎన్ని స్పెషలైజేషన్‌లకైనా విడివిడిగా అప్లయ్ చేసుకోవచ్చు. ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కనీసం రెండు సెమిస్టర్లు పూర్తిచేసినవారు పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. వీటిలో 8 సీజీపీఏ తప్పనిసరి.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- కెమికల్ ఇంజనీరింగ్
- **సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్:** ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, జియోటెక్నికల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్స్, మైక్రోఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ, ఆర్ఎఫ్ అండ్ మైక్రోవేవ్ ఇంజనీరింగ్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, థర్మల్ ఇంజనీరింగ్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఎమ్మెస్సీ/ఎంఎస్/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతూ జూలై నాటికి ఫలితాలు విడుదలయ్యేవారు కూడా అర్హులే. గేట్ (2024/ 2023/ 2022)లో అర్హత పొంది ఉండాలి.

ఎంపీపీ

మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. కోర్ కోర్సులు, స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఎలక్టివ్ కోర్సులు, డిజర్టేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

స్పెషలైజేషన్‌లు: సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ సస్టయినబిలిటీ, డేటా సైన్స్ సస్టయినబిలిటీ అండ్ ఇంజనీరింగ్

అర్హత: సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ సస్టయినబిలిటీ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. డేటా సైన్స్‌కు బీటెక్(కంప్యూటర్ సైన్స్), సస్టయినబిలిటీ అండ్ ఇంజనీరింగ్‌కు బీటెక్(సివిల్/ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది.

ఎంపిక: గేట్ వ్యాలిడ్ స్కోర్/రాత పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంఎస్ రీసెర్చ్

రీసెర్చ్ విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్


అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఎమ్మెస్సీ/ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

పీహెచ్‌డీ

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్

అర్హత: ఇంజనీరింగ్, సైన్స్ విభాగాలకు సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్/ఇంటిగ్రేటెడ్ బీఎస్+ఎంఎస్/ ఎమ్మెస్సీ(జామ్ స్కోర్‌తో ఎంట్రీ)/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. ఎమ్మెస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/ జెస్ట్ అర్హత ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగానికి సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఇన్‌స్పయిర్ అర్హత ఉండాలి.

ఎంపిక: ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అడ్మిషన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 10; ఎంటెక్, ఎంపీపీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 19
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 1 నుంచి 24 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు జూలై 22; ఎంటెక్, ఎంపీపీ ప్రోగ్రామ్‌లకు జూలై 26
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** iittp.ac.in

తెలంగాణ ఆర్‌డీసీ సెట్ నోటిఫికేషన్



హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)- డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఆర్‌డీసీ సెట్) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు, తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకులాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఏ, బీఎఫ్‌టీ, బీఎస్సీ ఆనర్స్ తదితర కోర్సులు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. బోధన, వసతి ఉచితం.

డిగ్రీ గురుకులాల వివరాలు

- మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాల్లో పురుషులకు 15 కళాశాలలు, మహిళలకు 15 కళాశాలలు ఉన్నాయి.
- తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకులాల్లో మహిళలకు 26 కళాశాలలు ఉన్నాయి.
- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల్లో పురుషులకు ఆరు కళాశాలలు, మహిళలకు 15 కళాశాలలు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం ఇంటర్ రెండో సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు, ఇంగ్లీష్‌లో కనీసం 40 శాతం మార్కులు రావాలి. ఇన్‌స్టంట్ ఎగ్జామ్ అభ్యర్థులు అనర్హులు. కుటుంబ వార్షికాదాయం నగరాల్లో రూ.2,00,000లు; గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000లు మించకూడదు.

టీఎస్ ఆర్‌డీసీ సెట్ వివరాలు: పరీక్ష సమయం రెండున్నర గంటలు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం మార్కులు 150. అభ్యర్థి ఎంచుకొన్న కోర్సుకు నిర్దేశించిన మూడు సబ్జెక్టులలో ఒక్కోదానిలో 40 మార్కులకు, ఇంగ్లీష్‌లో 30 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. బీబీఏ, బీకాం(జనరల్ కంప్యూటర్స్ అండ్ బిజినెస్ అనలిటిక్స్) కోర్సులకు మాత్రం ఇంగ్లీష్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఇంటర్ సిలబస్ ప్రకారమే ఉంటాయి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది. ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.200
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- ★ **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 21 నుంచి
- ★ **టీఎస్ఆర్‌డీసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 28
- ★ **వెబ్‌సైట్:** tsrdccet.cgg.gov.in

జాబ్ కార్నర్

ఎడ్‌సిల్‌లో టీచర్ ట్రెయినీలు

నోయిడాలోని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన శ్రీలంకలోని పాఠశాలల్లో పనిచేయడానికి టీచర్ ట్రెయినీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

మొత్తం ఖాళీలు: 50

పోస్టులు: టీజీటీ టీచర్స్ ట్రెయినీ, పీజీటీ టీచర్స్ ట్రెయినీ

సబ్జెక్టులు: ఇంగ్లీష్, మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, బీఈడీ, పని అనుభవంతో పాటు తమిళం/ఆంగ్ల భాష బోధనలో ప్రావీణ్యం ఉండాలి.

వయోపరిమితి: 65 ఏళ్లు మించకూడదు

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 20

వెబ్‌సైట్: hcicolombo.gov.in/edu_consult

కోడింగ్ - డీకోడింగ్

పోటీ పరీక్షల ప్రత్యేకం — రీజనింగ్

(నిన్నటి తరువాయి)

2. సవ్యదిశ అక్షరాలకు అపసవ్యదిశ(వ్యతిరేకదిశ) అక్షరాలు రాయడం:

ఉదా: ఒక సంకేత భాషలో FAMEను UZNVగా రాస్తే అదే సంకేతభాషలో HELPను ఏ విధంగా రాస్తారు?

ఎ) VSKO బి) SVOK
సి) OVSK డి) SOKV

సమాధానం: (బి)

వివరణ: FAMEను UZNVగా రాయడం అంటే
F అనేది 6వ అక్షరం.
U అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 6వ అక్షరం.
A అనేది 1వ అక్షరం.
Z అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 1వ అక్షరం.
M అనేది 13వ అక్షరం.
N అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 13వ అక్షరం.
E అనేది 5వ అక్షరం.
V అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 5వ అక్షరం.
ఈవిధంగా FAME ని UZNVగా రాశారు. ఇదే విధంగా HELP అనే పదములో
H అనేది 8వ అక్షరం.
S అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 8వ అక్షరం.
E అనేది 5వ అక్షరం.
V అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 5వ అక్షరం.
L అనేది 12వ అక్షరం.
O అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 12వ అక్షరం.
P అనేది 16వ అక్షరం.
K అనేది అపసవ్యదిశలో (చివరి నుంచి) 16వ అక్షరం.

3. పదంలోని అక్షరాలకు తదుపరి అక్షరాలుగా లేదా వెనక అక్షరాలుగా రాసి ప్రతి రెండు అక్షరాలను రివర్స్ చేయడం (క్రాస్ మెథడ్).

ఉదా 3: ఒక సంకేతభాషలో MEDIUMను FNJENVగా రాస్తే అదే సంకేతభాషలో INCOMEను ఏవిధంగా రాస్తారు?

ఎ) OPDFJN బి) JODPNF



సి) OJPDFN డి) JPOFDN

సమాధానము: (సి)

వివరణ: MEDIUMను FNJENVగా రాయడం అంటే MEDIUMలోని ప్రతి అక్షరానికి +1 అక్షరాన్ని రాసిన అంటే.. తదుపరి అక్షరాలుగా రాసిన NFEJVN. దీనిలోని ప్రతి రెండు అక్షరాలను రివర్స్‌లో రాసిన FNJENV అవుతుంది. ఇదే విధంగా INCOMEలోని ప్రతి అక్షరానికి తదుపరి అక్షరం రాసిన JODPNF దీనిలోని ప్రతి రెండు అక్షరాలను రివర్స్‌లో రాసిన సమాధానం OJPDFN అవుతుంది.

4. పదంలోని అక్షరాలనే స్థానాలను మార్పు చేసి రాయడం:

ఉదా: ఒక సంకేతభాషలో PRIVATEను ARPTIEVగా రాస్తే అదే సంకేతభాషలో MISTAKEను ఏవిధంగా రాస్తారు?

ఎ) IASKMTE బి) AIMKSET
సి) MSKTIAE డి) ఏదీకాదు.

సమాధానము: (బి)

వివరణ: PRIVATEను ARPTIEVగా రాయడం అనగా ఆ పదంలోని అక్షరాలనే స్థానాలను మార్పుచేసి రాశారు.

PRIVATEఅనే పదంలోని అక్షరాలకు 1 2 3 4 5 6 7 అనే సంఖ్యలను ఇచ్చిన ARPTIEV అనేది 5 2 1 6 3 7 4.

1 2 3 4 5 6 7 - 5 2 1 6 3 7 4
P R I V A T E - A R P T I E V

ఇదేవిధంగా

1 2 3 4 5 6 7 - 5 2 1 6 3 7 4
M I S T A K E - A I M K S E T

సమాధానం అవుతుంది.


5. పదంలోని అక్షరాలను +గా లేదా -గా (తదుపరి లేదా వెనక అక్షరాలుగా) మార్చిన తరవాత మొదటి అర్థభాగం, రెండో అర్థభాగం అదే స్థానంలో రివర్స్ చేయడం:

ఉదా: ఒక సంకేతభాషలో JUNIORను OVKSPJగా రాస్తే అదే సంకేత భాషలో RADIUMను ఏవిధంగా రాస్తారు?

ఎ) EBSNVJ బి) ESBVJN
సి) SBENJV డి) ఏదీకాదు.

సమాధానము:- (ఎ)

వివరణ: ముందుగా JUNIOR అనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా KVOJPS. వీటిలో మొదటి అర్థభాగాన్ని రివర్స్ చేయగా OVK రెండో అర్థభాగాన్ని రివర్స్ చేయగా SPJ. ఈవిధంగా JUNIOR అనే పదం OVKSPJగా కోడ్ చేశారు. అదేవిధంగా RADIUMఅనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాసిన SBEJVN. ఈ అక్షరాలలో మొదటి అర్థభాగాన్ని రివర్స్ చేయగా EBS. రెండో అర్థభాగాన్ని రివర్స్ చేయగా VNJ. కాబట్టి సమాధానం EBSNVJ అవుతుంది. దీనినే మరొక విధంగా కూడా చూపవచ్చు.



ఆరో పద్ధతికి సంబంధించిన ప్రశ్నలు

1. ఒక సంకేత భాషలో ORANGEను OHFPSBగా రాస్తే అదే సంకేత భాషలో ANCHOR ను ఏ విధంగా రాస్తారు?

ఎ) IPRBPD బి) IPSBOD
సి) ISPBDO డి) PSIODB

సమాధానం: (బి)

వివరణ: ముందుగా ORANGE అనే పదంలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా PSBOHF. ఈ అక్షరాలలో మొదటి అర్థభాగాన్ని రెండో అర్థభాగం స్థానంలో, రెండో అర్థభాగాన్ని మొదటి అర్థభాగం స్థానంలోకి మార్పిడి చేస్తే OHFPSB అయింది. అదే విధంగా ANCHORలోని అక్షరాలను +1 చేయగా అంటే తదుపరి అక్షరాలుగా రాయగా BODIPS. ఈ అక్షరాలలో మొదటి అర్థభాగాన్ని రెండో అర్థభాగం స్థానంలో, రెండో అర్థభాగాన్ని మొదటి అర్థభాగంలోకి మార్పిడి చేసిన IPSBOD సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో HOSTELను SDKGNRగా రాస్తే అదే కోడ్ భాషలో SELDOMను ఏవిధంగా రాస్తారు?

ఎ) CNLRDK బి) NCLDRK
సి) CNRLKD డి) CNLRKD

సమాధానము: (ఎ)

వివరణ: HOSTEL అనే పదంలోని అక్షరాలను ముందుగా -1లో రాయగా GNRSDK. దీనిలోని ఎడమవైపు అర్థభాగంలో గల అక్షరాలను (GNR) కుడివైపు అర్థభాగంలో, కుడివైపు అర్థభాగంలో గల అక్షరాలు (SDK) ఎడమవైపు అర్థభాగంలో రాయగా SDKGNR అవుతుంది. ఇదేవిధంగా SELDOM అనే పదంలోని అక్షరాలను ముందుగా -1లో రాయగా RDKCNL. ఇప్పుడు దీనిలోని ఎడమవైపు అర్థభాగంలో గల అక్షరాలను RDK కుడివైపు అర్థభాగంలో, కుడివైపు అర్థభాగంలో గల అక్షరాలను CNL ఎడమవైపు అర్థభాగంలో రాయగా CNLRDK సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ


లిటిల్స్



గుండె మర్చిపోయింది

అనగనగా ఒక ద్వీపం. అక్కడ ఆపిల్, జామ, సపోటా లాంటి పండ్ల చెట్లు ఉండేవి. కొన్ని కిందపడిపోయిన పండ్లను ఓ మొసలి తినేది. తన భార్యకూ తీసుకెళ్లేది. ఒక రోజు కింద పండ్లు ఏమీ లేవు. ఆపిల్ చెట్టుమీద ఓ కోతి కనపడింది. ఓ పండును ఇవ్వమని అడిగింది. వెంటనే కోతి ఒక ఆపిల్‌ను విసిరేసింది. అది ఎంతో రుచిగా ఉందని.. తన భార్యకోసం కూడా ఓ పండును ఇవ్వాలని కోరింది. ఆ కోతి అలానే చేసింది. మొసలి ఆ పండును తనభార్యకు ఇచ్చింది. 'ఎంత మధురమైన పండో' అనుకున్నవి.


అలా పండ్లకోసం వచ్చిన మొసలికి ఆపిల్ పండ్లమీద మక్కువ పెరిగింది. ఇద్దరూ స్నేహితులయ్యారు. ప్రతిరోజూ ఆపిల్ పండ్లను ఇస్తుంటే ఇంటికి తీసుకెళ్లేది మొసలి. ఒక రోజు కోతి కనపడలేదు. ఆ తర్వాత రెండు రోజులకు కనపడింది. 'అయ్యో.. ఎక్కడికెళ్లావ'ని మొసలి బాధను నటించింది. 'మా ఇంటికి రమ్మని .. నా భార్య పిలిచింది. నీకు మంచి ఆహారం పెట్టాలి. ఎందుకంటే నువ్వు మాకు ఆపిల్ పండ్లు ఇచ్చావు కదా' అన్నది. కోతి తెగ సంబరపడింది.




మరుసటి రోజు మొసలి గట్టు దగ్గరకు వచ్చింది. కోతి రెండు ఆపిల్ పండ్లతో చెట్టుమీద నుంచి ఎగిరి మొసలి మీద కూర్చుంది. అలా నీళ్లలో సగం ప్రయాణం చేశాక.. మొసలి తన బుద్ధిని బయటపెట్టింది. 'ఇన్ని ఆపిల్ పండ్లు తిన్న నువ్వు ఎంత రుచిగా ఉంటావో. ముఖ్యంగా మా ఆవిడకు నీ గుండె కావాలి' అన్నది మొసలి. క్షణాల్లో కోతికి విషయం అర్థమైంది. మాయదారి మొసలి మాయ చేసిందే అనుకుంది. 'అయ్యో.. మొసలి బావా. ఎంత తప్పు చేశావు? ముందే చెప్పి ఉంటే ఆ ఆపిల్ చెట్టుకు వేలాడ తీసిన గుండెను తెచ్చేదాన్ని కదా.. ఎంత అన్యాయం. ఒక మాట చెప్పాలి కదా' అన్నది. 'అయ్యో.. వెనక్కి వెళ్దాం. ఆ గుండె కోసం' అన్నది మొసలి. 'నీ భార్యతో మాట్లాడాక చూద్దాం' అన్నది కోతి. 'నీ గుండెతో రాకుంటే అంతే నా సంగతి. ఆలస్యం అయినా వెనక్కి వెళ్దాం' అంటూ వెనక్కి తిరిగింది మొసలి.

కబుర్లు చెప్పుకుంటూ మొసలిని కోతి వెనక్కి తీసుకెళ్లింది. తీరం వచ్చిందో లేదో కోతి చెంగుమని మొసలి మీద నుంచి ఎగిరి చెట్టుమీద కూర్చుంది. 'హాహాహా..' అంటూ గట్టిగా నవ్వింది. 'ఎవరైనా గుండెను చెట్టుకు వేలాడదీస్తారా? నీదో మట్టి బుర్ర. నీ అమాయకత్వానికి జోహార్లు.. నీ మోసానికి నమస్కారాలు' అంటూ మొసలిని దుయ్యబట్టింది కోతి. మొసలి తన తప్పిదానికి చింతిస్తూ వెనక్కి వెళ్లిపోయింది. అలా కోతి లౌక్యంతో బతికి బయటపడింది.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?



డైలీ సుడోకు - 258

	2				4		1	8
			8					
7			2	6		3		
5		2						9
	7		9		3		5	
8						4		7
		7		9	2			1
					7			
2	3		5				4	

సుడోకు - 257 సమాధానం

2	4	5	8	1	3	6	7	9
7	3	6	4	2	9	1	5	8
8	1	9	5	7	6	2	3	4
9	6	2	7	3	4	8	1	5
4	5	8	1	6	2	3	9	7
1	7	3	9	8	5	4	2	6
3	9	4	2	5	8	7	6	1
6	8	1	3	9	7	5	4	2
5	2	7	6	4	1	9	8	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.